thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 346 కరీంనగర్ శుక్రవారం, 21 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 24న పీఎం కిసాన్‌నిధులు

న్యూఢిల్లీ : రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం కిసాన్ పథకం.. 19వ విడత నిధుల విడుదలకు తేదీ ఖరారైంది.

ఈ నెల 24న రూ. 2వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. బిహార్‌లోని భాగల్పూర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. 19వ విడతలో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలగనున్నట్లు వారు తెలిపారు.




హైదరాబాద్, ఫిబ్రవరి 20: జయశంకర్ భూపాలపల్లిలో సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య తీవ్ర కలకలం రేపుతోంది. లింగమూర్తి హత్య ఘటనను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ హత్యపై సీబీసీఐడీ ఎంక్వైరీ వేయాలని నిర్ణయించింది. మేడిగడ్డ అవినీతిపై పోరాడుతున్నందుకే లింగమూర్తిని హత్య చేసారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన అనుచరులే రాజలింగమూర్తిని చంపారని మృతుడి భార్య, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే తన అనుచరుల ద్వారా నడిరోడ్డు మీద తన భర్తను హత్య చేయించారన్న రాజలింగమూర్తి భార్య సరళ ఆరోపించారు. అన్ని ఆపేస్తే పది లక్షల రూపాయలు ఇస్తామని గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారని తెలిపారు. మేడిగడ్డ కేసు గెలుస్తామని అక్కస్సుతో తన భర్తను దారుణంగా హత్య చేయించారని

## రాజలింగమూర్తి హత్యపై ప్రభుత్వం
# కీలక నిర్ణయం

అన్నారు. కొత్త హరిబాబు రేణిగుంట్ల సంజీవ్ బుర్ర చంద్రయ్య, బుర్ర కొమురయ్య రేనిగుంట్ల కొమురయ్య మరికొంతమంది కలిసి హత్య చేశారని సరళ ఆరోపించారు. కాసేపట్లో రాజలింగమూర్తి మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించనున్నారు. ఇప్పటికే భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు రాజలింగమూర్తి బంధువులు చేరుకున్నారు. కాగా... బైక్‌పై వెళ్తున్న రాజలింగమూర్తిని ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి హత్య చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుపై లింగమూర్తి కేసు వేశారు. ఆఫిర్యాదుతో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుతో పాటు ఐదుగురిపై కేసు నమోదు అయ్యింది. దీంతో పాటు భూపాలపల్లిలో వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై రాజలింగమూర్తి కేసు వేశారు.




దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. 26 ఏళ్ల తర్వాత దిల్లీలో అధికారాన్ని దక్కించుకున్న భాజపా.. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అగ్రనేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. ఉదయం ఇంటినుంచి బయల్దేరిన రేఖాగుప్తా.. హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆమె రామ్‌లీలా మైదానానికి చేరుకొని, అందరినీ పలకరించారు. ఈ కార్యక్రమానికి సాధువులు, పలువురు ప్రముఖులు హాజరుకావడంతో భారీ భద్రత ఏర్పాటుచేశారు.

25,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. రేఖా గుప్తాతో పాటు భాజపా ఎమ్మెల్యేలు పర్వేశ్ వర్మ, ఆశీశ్ సూద్, మజీందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, కపిల్ మిశ్రా, పంకజ్ కుమార్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కొత్త సీఎంకు జడ్ కేటగిరీ సెక్యూరిటీని కేటాయించనున్నారు.




## సమస్యల సవారీ... అయినా...
# నటరాజన్ నిలబెడతారు!
### మేడం వేరే లెవల్.. కాంగ్రెస్ నేతల్లో కొత్త టెన్షన్!

తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఏఐసీసీ కొత్త ఇన్చార్జ్‌గా మీనాక్షి నటరాజన్ నియమితులయ్యారు. ఆ ఏఐసీసీ దూతకు సమస్యల సవారీ తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.. పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయం.. నామినేటెడ్ పదవుల భర్తీ, కేడర్‌కు భరోసా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుకోవడం.. బీజేపీ కి చెక్ పెట్టేలా ప్లానింగ్.. ఇవన్నీ కొత్త ఇన్చార్జ్‌కి సాధ్యమేనా? అసలు కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చిన పదిహేను నెలల లోపే మూడో ఇన్చార్జ్‌గా వచ్చిన మీనాక్షి నటరాజన్ ముందున్న ప్రధాన సవాళ్లేంటి? అసలు ఇంత స్వల్ప కాలంలో మూడో ఇన్చార్జ్‌ని నియమించడం వెనుక హైకమాండ్ లెక్కలేంటి? కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్ణయాల్లో భాగంగా రెండు రోజుల క్రితమే హైకమాండ్ తెలంగాణకు కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జ్‌ను నియమించింది. మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్ కు పూర్తి స్థాయిలో బాధ్యతలు ఇచ్చారు. త్వరలోనే బాధ్యతలు తీసుకునేందుకు ఆమె రెడీ అయ్యారు. వచ్చే వారంలోనే ఆమె గాంధీభవన్ లో బాధ్యతలు తీసుకోనున్నారు. అయితే కొత్త ఇన్ చార్జ్‌కు పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పవర్ లో ఉండటంతో.. ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం కోసం ఏఐసీసీ ఇన్‌చార్జ్ మరింత ఎక్కువ ఫోకస్ పెట్టాల్సి ఉంటుందంటున్నారు. ఆ క్రమంలో మీనాక్షి నిర్ణయాలు ఎలా ఉండబోతున్నాయి? ఏఐసీసీ స్థాయిలో పనిచేసిన ఆమె, స్టేట్ ఇన్చార్జి స్థాయిలో ఏం చేయబోతున్నారు? రాహుల్ కోటరీలో కీలక వ్యక్తిగా పేరొందిన మీనాక్షి పార్టీ బలోపేతానికి ఎలాంటి ఆదేశాలు ఇస్తారు? గ్రౌండ్ లెవల్ కేడర్‌లో భరోసా నింపడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు? వంటి అంశాలపై ఇప్పుడు పార్టీలో ఫుల్ డిస్కషన్ నడుస్తుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఎలక్షన్ అబ్జర్వర్ గా వచ్చిన ఆమె ఫుల్ స్ట్రిక్ట్ గా ఉంటారని గతంలో దగ్గర నుంచి పరిశీలించిన నేతలు చెప్తుండటంతో .. లీడర్లు, పార్టీ కార్యవర్గ నేతల్లో టెన్షన్ మొదలైందంట. తెలంగాణపై స్పష్టమైన అవగాహన కలిగిన మీనాక్షి..రాష్ట్ర రాజకీయాలను ఎలా నడిపిస్తారో? అన్న టెన్షన్ పలువురు నేతల్లో కనిపిస్తోంది. ఆమె ఇన్ చార్జ్ గా వస్తున్నట్లు ప్రకటన రిలీజ్ కాగానే, మేడం పనితీరు ఎలా ఉంటుంది..? కేడర్‌కు గుర్తింపు ఇస్తారా? లీడర్లతో అప్రోచ్ ఎలా ఉంటుంది? వంటి వాటిపై కొందరు రాష్ట్ర నాయకులు తమకున్న పరిచయాలతో ఢిల్లీ లెవల్‌లో ఇన్ఫర్మేషన్ తెలుసుకోవడానికి ప్రయత్నించారంట. మీనాక్షి ముందున్న ప్రధాన సవాలు పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయం.. దీంతో పాటు లీడర్లు, కేడర్ పటిష్టత కూడా ముఖ్యమే. ప్రస్తుతం మంత్రులు, ఎమ్మెల్యేలు, క్షేత్రస్థాయి కేడర్ మధ్య కొన్ని చోట్ల సమన్వయం లేదన్న అభిప్రాయం ఉంది. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య గ్యాప్ ఉందంటున్నారు. దాని ప్రభావం క్షేత్రస్థాయి కేడర్ పై స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలను సమర్ధవంతంగా జనాల్లోకి తీసుకువెళ్లేందుకు గ్రౌండ్ లెవర్ లీడర్లు ఆసక్తి చూపడం లేదంటున్నారు. ఇంత కాలం ఏఐసీసీ ఇన్ చార్జ్‌గా పనిచేసిన దీపాదాస్ మున్షి దృష్టికి కొన్ని జిల్లాల లీడర్లు గతంలోనే ఈ సమస్యను తీసుకువెళ్లారంట. కానీ ఆమె పెద్దగా స్పందించలేదని స్వయంగా జిల్లా అధ్యక్షులే మాట్లాడుకుంటున్నారు. హైదరాబాద్‌లో యాక్టివ్ రోల్ పోషించిన ఆమె.. జిల్లా వ్యవహారాలపై ఆశించిన స్థాయిలో దృష్టి సారించలేదన్న వాదన వినిపిస్తుంది. పార్టీ లోని అందరి అభిప్రాయాలను సేకరించేందుకు దీపాదాస్‌మున్షీ ఆసక్తి చూపలేదన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. దాంతో కొత్త ఇన్చార్జ్‌గా రానున్న మీనాక్షిపై గురుతర బాధ్యతలు ఉన్నాయంటున్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలో కీలక నేతలు మినహా వివిధ స్థాయిల నాయక్ను ఫెయిలయ్యారన్న టాక్ ఉంది. సోషల్ మీడియా దారుణంగా విఫలమైందని .. ఇక ప్రభుత్వం అమలు చేసిన స్కీమ్ లు, చేస్తున్న కార్యక్రమాలను కూడా పార్టీ నాయకులు జనాల్లోకి బలంగా తీసుకువెళ్లలేకపోతున్నారన్న విమర్శలున్నాయి. తద్వారా ఏడాది కాలంలోనే ప్రభుత్వంపై నెగెటివ్ ప్రచారం మొదలు పెట్టాయి విపక్షాలు. మెజార్టీ జిల్లాల్లో నేతల మధ్య ఇంటర్నల్ ఫైట్‌లు ఉన్నాయి. వీటన్నింటిని సెట్‌రైట్ చేయాల్సిన బాధ్యత నూతన ఇన్చార్జ్‌పై ఉంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల రానున్నాయి. లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో బీజేపీ దూకుడును అడ్డుకోవడం, బీఆర్ఎస్‌ను మరింత నిర్వీర్యం చేసి కోలుకోలేని దెబ్బ కొట్టడం కాంగ్రెస్ ముందున్న ప్రధాన టార్గెట్. వాటన్నింటిపై మీనాక్షి నటరాజన్ స్పెషల్ ఫోకస్ పెడితే.. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఎదురుండదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం పవర్ లోకి వచ్చి పదిహేను నెలలు అవుతున్నా .. నామినేటెడ్, పార్టీ పదవులు పంపకం పూర్తిస్థాయిలో జరగలేదు. దానిపై లీడర్లు, కేడర్లో ఒకింత అసంతృప్తి వ్యక్తమవుతుంది. పార్టీని పవర్ లోకి తీసుకువచ్చేందుకు పనిచేసిన తమకు ఇటు ప్రభుత్వం, అటు పార్టీలోనూ తగిన గుర్తింపు ఇవ్వకపోతే ఎలా? అని పలువురు నేతలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు... భుజాలకు కాయలు కాసేలా జెండా మోసిన కార్యకర్తలను పట్టించుకోలేదని చాలా మంది అసహనాన్ని వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న వంటి వారు సొంత పార్టీనే టార్గెట్ చేస్తున్నా చర్యలు తీసుకోకపోతుండటం పార్టీలో అసంతృప్తికి కారణమవుతుంది 13 సెప్టెంబరు 2020 నుంచి జనవరి 2023 వరకు మాణిక్యం ఠాగూర్ ఏఐసీసీ రాష్?ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్‌గా పనిచేశారు. ఆ తర్వాత 4 జనవరి 2023 నుంచి 24 డిసెంబరు 2023 వరకు మాణిక్ రావు ఠాక్రే ఇన్ చార్జ్‌గా పనిచేశారు. ఈ పీరియడ్ లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇక 24 డిసెంబరు 2024 నుంచి 14 ఫిబ్రవరి 2025 వరకు దీపాదాస్ మున్షి ఏఐసీసీ ఇన్చార్జ్‌గా పనిచేశారుచేశారు. త్వరలో రాహుల్‌గాంధీ పర్సనల్ కోటరీలోని మీనాక్షి నటరాజన్ తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. అధికారం చేపట్టిన పదిహేను నెలలకే ఇద్దరు ఇన్ చార్జ్‌లను మార్చిన హైకమాండ్ , కొత్త నాయకురాలిని రంగంలోకి దించుతోంది. దాంతో తెలంగాణపై ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు కనబరుస్తున్న ప్రత్యేక శ్రద్ధ అర్ధమవుతుంది.




# మరో ఎన్నిక!
## ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు పోల్స్..!
## కాంగ్రెస్‌లో భారీ పోటీ!!

హైదరాబాద్ : తెలంగాణలో మరో ఎన్నికకు రంగం సిద్ధమవుతోంది. మార్చి 29వ తేదీ నాటికి ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతాయి. రాజకీయ పార్టీలకు ప్రస్తుతమున్న ఎమ్మెల్యేల బలాన్ని బట్టి ఈ ఎమ్మెల్సీ స్థానాలు దక్కుతాయి.

**40 మంది పోటీ...** ఈ ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో నాలుగు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు దక్కే అవకాశం ఉంది. ఒకవేళ తమకు కూడా ఎమ్మెల్సీ ఇవ్వాలని ఎంఐఎం అడిగితే కాంగ్రెస్‌కు మూడు మాత్రమే దక్కుతాయి. బీఆర్ఎస్ పార్టీకి ఒక ఎమ్మెల్సీ స్థానం దక్కే ఛాన్స్ ఉంది. తమ కోటాలోని నాలుగు ఎమ్మెల్సీ స్థానాలను ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు కేటాయించాలని కాంగ్రెస్ భావిస్తోంది. బీసీ నేతలు తమ వర్గానికి రెండు సీట్లు ఇస్తారనే ఆశలు పెట్టుకున్నారు. నాలుగు సీట్ల కోసం కాంగ్రెస్ నుంచి ఏకంగా 40 మంది పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. వీరిలో పలువురు తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌ను కలవనున్నట్లు తెలుస్తోంది.

మరికొందరు నేరుగా ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ హైకమాండ్ పెద్దలతో సమావేశం కావాలని అనుకుంటున్నారు.

**ఏ వర్గం నుంచి ఎవరెవరు .. ?...** కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ స్థానాన్ని ఆశిస్తున్న ఓసీ నేతల లిస్టు పెద్దగానే ఉంది. ఇందులో వేం నరేందర్‌రెడ్డి, టి. జగ్గారెడ్డి, టి. జీవన్‌రెడ్డి, సామ రామ్మోహన్‌రెడ్డి, పారిజాతా నర్సింహారెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్‌రావు, అల్లుబెల్లి ప్రవీణ్‌రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి ఉన్నారు. ఎస్సీ కోటాలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, అద్దంకి దయాకర్, సింగాపురం ఇందిర, కొండ్రు పుష్పలీల, పిడమర్తి రవి, దొమ్మాట సాంబయ్య, రాచమళ్ల సిద్ధేశ్వర్, దర్శన్, జ్ఞానసుందర్, భీంభరత్ పేర్లు ఉన్నాయి.

మైనార్టీల నుంచి షబ్బీర్ అలీ, ఫిరోజ్ ఖాన్, మహ్మద్ అజారుద్దీన్, అజ్మతుల్లా హుస్సేనీ పేర్లు ఉన్నాయి.

బీసీల నుంచి మధుయాష్కీగౌడ్, ఎగ్గె మల్లేశం, ఈరావత్రి అనిల్, చరణ్‌కౌశిక్ యాదవ్, సునీతా ముదిరాజ్, నీలం మధు, వజ్రేశ్‌యాదవ్, చెవిటి వెంకన్న, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, పున్నా కైలాశ్‌నేత, నవీన్ యాదవ్ పేర్లు ఉన్నాయి.




హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి భారాస ప్రభుత్వమే కారణమంటూ కేసు వేసిన రాజలింగమూర్తి (47) హత్యపై తెలంగాణ సీఎం కార్యాలయం (సీఎంవో) ఆరా తీసింది. ఈ హత్యకు గల కారణాలపై నిఘా వర్గాల నుంచి సమాచారం కోరింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఎంవో అధికారులు వివరాలు సేకరించారు. రాజలింగమూర్తి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం తన స్వగ్రామం జంగేడు శివారు పక్కీరుగడ్డలో సోదరుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి రాజలింగమూర్తి వెళ్లారు. ద్విచక్ర వాహనంపై భూపాలపల్లికి తిరిగి వస్తుండగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యాలయం ఎదురుగా నలుగురు నుంచి ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు మంకీ క్యాపులు ధరించి ఆయన్ను చుట్టుముట్టారు. ఒక్కసారిగా కత్తులు, గొడ్డళ్లతో నరికారు.

స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.




హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి భారాస ప్రభుత్వమే కారణమంటూ కేసు వేసిన రాజలింగమూర్తి హత్యకు గురైన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆయన్ను క్రూరంగా చంపేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డే చంపించినట్లు మృతుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారని చెప్పారు. న్యాయపరంగా కొట్లాడాలి కానీ.. చంపేస్తారా? అని నిలదీశారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు. "కేసీఆర్, ఆయన కుటుంబం తెలంగాణను దోచుకుంది. వారి అక్రమాలను బయటపెడితే చంపేస్తారా? కేసీఆర్‌పై న్యాయపోరాటం చేస్తున్న చక్రధర్‌గౌడ్‌కు రక్షణ కల్పిస్తాం. రూ.కోట్లు పోతే సంపాదించుకోవచ్చు.. ప్రాణాలు పోతే తిరిగి వస్తాయా? కేసీఆర్ నుంచి ప్రాణభయం ఉన్నవారు ప్రభుత్వాన్ని సంప్రదించాలి. కాళేశ్వరం ప్రాజెక్టు దోపిడీపై రాజలింగమూర్తి పోరాడారు. ఆయన హత్య ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తాం" అని కోమటిరెడ్డి చెప్పారు.

## రాజలింగమూర్తి హత్య.. నాకేం సంబంధం లేదు: గండ్ర వెంకటరమణారెడ్డి

హైదరాబాద్: రాజలింగమూర్తి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారాస నేత, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ హత్యను భారాసకు అంటగట్టేందుకు యత్నిస్తున్నార న్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి భారాస ప్రభుత్వమే కారణమంటూ కేసు వేసిన రాజలింగమూర్తి బుధవారం హత్యకు గురికావడం సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో వెంకటరమణారెడ్డి ప్రమేయం ఉందని మృతుడి కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. "రాజలింగమూర్తి హత్యపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ ఘటనను భారాసకు అంటగట్టేందుకు యత్నిస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు బాధాకరం. నేనే చంపించానని ఆయన అంటు న్నారు. భారాస ఎప్పుడూ హత్యా రాజకీయాలను ప్రోత్సహించలేదు. మేడిగడ్డ కేసును చట్టపరంగానే ఎదుర్కొంటాం. రాజలింగమూర్తి హత్యతో నాకు, భారాసకు ఎలాంటి సంబంధం లేదు. హత్యపై సీఐడీ, సీబీఐతో విచారణ జరిపి దోషులను శిక్షించాలి. మృతుడి భార్య




భారాస నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. విధానాలు నచ్చక ఆమెను పార్టీ దూరం పెట్టింది. మృతుడి భార్యతో కొందరు తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారు. రాజలింగమూర్తి అనేక భూ వివాదాల్లో కూరుకుపోయా డు. గతంలో రౌడీషీటర్‌గానూ ఉన్నాడు. ఆయన హత్యకు భూవివాదమే కారణం. ఈ హత్య కేసు నిందితులు లొంగిపోయినట్లు మాకు తెలుస్తోంది" అని గండ్ర వెంకటరమణారెడ్డి చెప్పారు.

## జగన్‌తో స్నేహంగా ఉంటూ.. ఏపీ జలదోపిడీకి సహకరించారు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీకి భారాస ప్రభుత్వం సహకరించిందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 200 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత భారాసది అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణకే 500 టీఎంసీలు కావాలని వాదన ప్రారంభించామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతంగా ఉండేదన్నారు. భారాస ప్రభుత్వం వల్లే తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. జగన్‌తో స్నేహంగా ఉంటూ.. ఏపీ జలదోపిడీకి భారాస సహకరించిందన్నారు. జగన్ పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుతున్నా, అక్రమంగా ముచ్చుమర్రి నిర్మిస్తున్నా కేసీఆర్ నోరెత్తలేదని మండిపడ్డారు. "కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు రాలేదు కానీ.. భారాస నేత జేబులు నిండాయి. కాళేశ్వరంపై రూ.లక్షా 30వేల కోట్లు ఖర్చు చేస్తే మేడిగడ్డ కూలిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు అప్పు తెలంగాణ ప్రజలు ఎన్నటికీ తీర్చలేనంత భారంగా మారింది. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం కనీసం టెలిమెట్రీలు కూడా ఏర్పాటు చేయలేదు. కృష్ణా జలాలను జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే పట్టించుకోలేదు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు మన హక్కు అయితే 190 టీఎంసీల కంటే ఎక్కువగా ఎప్పుడూ వాడలేదు. కృష్ణా బేసిన్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే మన వాటా పూర్తిగా వాడుకునేవాళ్లం. ఏదుల, దిండి ప్రాజెక్టులను కూడా పదేళ్లలో పూర్తి చేయలేదు" అని ఉత్తమ్ విమర్శించారు.

## తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కృషి: కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో అన్నిరంగాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం నిధులు ఇస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. రైతులను అన్నివిధాలా కేంద్రం ఆదుకుంటుందని అన్నారు. ఆరుగ్యారెంటీలను తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీ స్కీంల్లో ఎన్ని అమలు చేస్తున్నారో దమ్ము ఉంటే చర్చకు సిద్ధమా అని బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. ఇవాళ(గురువారం) హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లపై తాము చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి సిద్ధమా అని ఛాలెంజ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీపై రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరచి పోయి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ చిల్లర మాటలు ఇక ఆపు అని హెచ్చరించారు. రేవంత్ మాటాలను ప్రజలు మెచ్చడం లేదని అన్నారు. రేవంత్ తన వైఖరి మార్చుకోవాలని బండి సంజయ్ సూచించారు.

## నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డిపై నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో, బేగంబజార్ పీఎస్‌లో, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో మొత్తం మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు.. భారాస ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ ఛైర్మన్ తిరుపతి వర్మ తెలిపారు. తదుపరి విచారణను ప్రజాప్రతినిధుల కోర్టు మార్చి 23కి వాయిదా వేసింది.




## భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు 'అన్యాయమే': మస్క్ ప్లాన్స్‌పై ట్రంప్ అసంతృప్తి

అమెరికా దిగ్గజ ఈవీ కంపెనీ టెస్లా.. భారత మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సంస్థ ఇక్కడ నియామకాలు ప్రారంభించిన సంగతి తెలిసిందే. షోరూంల ఏర్పాటు కోసం కూడా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ పరిణామాలపై తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలనే టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రణాళిక 'అన్యాయమే' అని వ్యాఖ్యానించారు. మస్క్ పక్కన ఉండగానే అమెరికా అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. వీరిద్దరూ కలిసి ఫాక్స్ న్యూస్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా భారత్‌లోకి టెస్లా ఎంట్రీ ప్రణాళికలపై ట్రంప్ మాట్లాడారు.

"ఈ ప్రపంచంలోని ప్రతి దేశం మమ్మల్ని వాడుకోవడానికి ప్రయత్నిస్తోంది. సుంకాలతో మానుంచి లబ్ధి పొందాలని చూస్తున్నారు. దీంతో ఎలాన్ మస్క్ తన కార్లను విక్రయించడం అసాధ్యంగా మారుతోంది. ఉదాహరణ భారతే..! ఇప్పుడు ఆయన (మస్క్) భారత్‌లో ఫ్యాక్టరీ ఏర్పాటుచేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన వరకు అది మంచిదే కావొచ్చు.. కానీ, అమెరికా పరంగా అది చాలా అన్యాయమైన నిర్ణయమే" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.


**ఏప్రిల్ కల్లా టెస్లా కార్యకలాపాలు!** ఈసందర్భంగా గతవారం భారత ప్రధాని మోదీతో భేటీని ట్రంప్ గుర్తుచేసుకున్నారు. ఆ సమావేశంలో విద్యుత్ కార్లపై అధిక సుంకాల విషయాన్ని మోదీతో ప్రస్తావించినట్లు తెలిపారు. సుంకాల సమస్యను పరిష్కరించుకోవడంతో పాటు వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం కోసం ఇరుదేశాలు కలిసి పనిచేసేలా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇటీవల మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా అధినేత ఆయనతో సమావేశమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొన్ని రోజులకే ఈ సంస్థ భారత్‌లో నియామకాలు చేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచే విక్రయ కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉంది. అయితే, భారత్‌లో విద్యుత్ కార్ల తయారీపై టెస్లా ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

మరోవైపు, ఇటీవల భారత ప్రభుత్వం నూతన ఈవీ పాలసీని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. కార్ల తయారీ సంస్థలు దేశంలో కనీసం 500 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టడంతో ఇక్కడ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తే దిగుమతి సుంకాలను 15శాతానికి తగ్గించేలా కేంద్రం కొత్త విధానం తీసుకొస్తోంది. ఈ పరిణామాల వేళ ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.




దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో భాజపా ప్రభుత్వం కొలువుదీ రింది. ఈక్రమంలో దిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా రోహిణి నియోజకవర్గం నుంచి గెలిచిన విజేందర్ గుప్తా ను పార్టీ ఎంపిక చేసింది. ఈనేపథ్యంలో ఆయనకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. దాదాపు 10 ఏళ్ల క్రితం అసెంబ్లీ నుంచి ఆయన బహిష్కరణకు గురయ్యారు. కాగా, తాజాగా ఆయన అదే సభకు స్పీకర్‌గా ఎంపిక కావడం గమనార్హం.

**అసలేం జరిగిందంటే..?** 2015లో దిల్లీ అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే ఆల్కాలంబాపై మరో ఎమ్మెల్యే ఓపీ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో సభలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. ఇందులో పాల్గొన్న భాజపా ఎమ్మెల్యే అయిన విజేందర్ గుప్తాను అప్పటి స్పీకర్ ఆరోజు సాయంత్రం 4 గంటల వరకు సభ నుంచి బహిష్కరించారు. అయితే బయటకు వెళ్లేందుకు ఆయన నిరాకరించడంతో.. మార్షల్స్ గుప్తాను భుజాలపై ఎత్తుకొని అసెంబ్లీ నుంచి బయటకు తీసుకెళ్లారు. తాజాగా దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. ఇక, దిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా పార్టీ తనను ఎంపిక చేయడంపై విజేందర్ గుప్తా హర్షం వ్యక్తంచేశారు. ఇదిలాఉంటే.. రామ్‌లీలా మైదానంలో గురువారం వేల మంది ప్రజల సమక్షంలో దిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు ఎన్డీయే నేతలు, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు హాజరయ్యారు. భాజపా పాలిస్తున్న 14 రాష్ట్రాల్లో ఎక్కడా మహిళా ముఖ్యమంత్రి లేకపోవడంతో పార్టీ అధిష్ఠానం రేఖాగుప్తా వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.




ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు 55 కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈక్రమంలో కుంభమేళాలో స్నానం చేస్తున్న మహిళా భక్తుల వీడియోలు విక్రయిస్తున్న రెండు సామాజిక ఖాతాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు యూపీ పోలీసు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల గోప్యత, గౌరవానికి భంగం కలిగించే ఇలాంటి వీడియోలను కొన్ని ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేస్తున్నాయి. సోషల్ మీడియా మానిటరింగ్ టీమ్ దీన్ని గుర్తించింది.

దీనిపై కోత్వాల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ వీడియోలు అప్‌లోడ్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను గుర్తించేందుకు మెటా నుంచి వివరాలు కోరినట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు టెలిగ్రామ్ ఛానళ్లలో ఈ వీడియోలు విక్రయిస్తున్నట్లు మరో కేసు నమోదైంది. వీటిపై దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు. మహాకుంభమేళాకు సంబంధించి అభ్యంతరకరమైన, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే సామాజిక మాధ్యమాలపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

**కుంభమేళాను అగౌరవపరిస్తే సహించం..** జనవరి 13న మొదలైన మహా కుంభమేళా కార్యక్రమం ఫిబ్రవరి 26 వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26 నాటికి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసే భక్తుల సంఖ్య 60 కోట్లు దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తొలుత దీనికి 45 కోట్ల మంది మాత్రమే వస్తారని అంచనా వేయగా.. ఊహించని రీతిలో భక్తులు పోటెత్తారు. ఫిబ్రవరి 14 నాటికే 50 కోట్ల మార్కును అధిగమించి.. తాజాగా 55 కోట్ల మార్కును చేరుకుంది. జనవరి 29న మౌని అమావాస్య రోజే దాదాపు 8 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌కు రాగా.. మకర సంక్రాంతి రోజున 3.5 కోట్ల మంది, జనవరి 30న రెండు కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం పేర్కొంది.

## రేవంత్ ప్రభుత్వం మోసం చేసింది: కిషన్‌రెడ్డి

యాదాద్రి: రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిలదీశారు. ఇవాళ(గురువారం) యాదాద్రిలో కిషన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. అన్నివర్గాలను రేవంత్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు నాటకాలాడుతున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 స్థానాల్లోనూ బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నివర్గాల్లోనూ వ్యతిరేకత ఉందని కిషన్‌రెడ్డి విమర్శించారు.



# తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించాలి

## ఫిబ్రవరి 21... అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం




ఒక సమాజం యొక్క సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి. సంస్కృతి అంటే సంస్కరించినది అని అర్థం. ఆ సమాజంలో పాటించే ఆచారాలు, పద్ధతులు, సంప్రదాయాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, జీవన విధానం, అన్నీ సంస్కృతిలోని భాగాలే. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉంది. ప్రాచీన అర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు ఆలవాలమైన భారతావనిలో తెలుగు సంస్కృతికి విడదీయరానిది బంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు సంస్కృతిలో భాగమై నానాటికీ అనాదరణకు గురవుతున్న తెలుగు భాష పునర్ వైభవానికి కృషి సల్పాల్సిన సమయం ఆసన్నమైంది. విదేశాల్లో తెలుగు వికాసానికి ఎనలేని కృషి జరుగుతుంటే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనుమరుగయ్యే ప్రమాదంలో పడింది. బతుకు తెరువు కోసం ఆంధ్ర ప్రాంతం నుంచి మారిషస్ కు వెళ్ళిన వ్యవ సాయ కూలీలు 185 సంవత్స రాలుగా తమ మాతృభాష అయిన తెలుగు భాషను పరిరక్షిస్తూనే ఉన్నారు. 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగు వాళ్లు ఉండగా... తమ వారసులకు, భావితరాల వారికి, తెలుగు భాషలో సాధికారిక కతను సాధించి పెట్టేందుకు కృత నిశ్చయంతో, తెలుగు భాషా మాధ్య మంలో పాఠశాలలు నిర్వహింప చేసుకుంటూ తమ పిల్లల్ని తమ మాతృభాషలోనే చదివించడం గొప్పలలో కెల్లా గొప్ప. అక్కడ తెలుగు వారికోసం చాలా సంస్థలు ఉన్నాయి. ఉత్సవాల్లో అందరూ తెలుగులోనే మాట్లాడే ప్రయత్నం చేస్తారు. మారిషస్ అధికారిక టీవీ చానెల్లో కూడా వారానికి ఒక తెలుగు సినిమా వేస్తారు. డీడీ యాదగిరి చానెల్ మారిషస్‌లో వస్తుంది. ప్రాథమిక స్థాయి నుంచి విశ్య విద్యాలయ స్థాయి వరకూ తెలుగు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ యూనివర్శిటీలో తెలుగులో డిప్లొమా, డిగ్రీ కోర్సులు ఉన్నాయి. అంతే కాకుండా, మారిషస్ తెలుగు మహా సభ, తెలుగు సాంస్కృతిక కళా నిలయం, తెలుగు సాంస్కృతిక నిలయం, తెలుగు భాషా సంఘం వంటి సంస్థలు అక్కడ తెలుగు భాషను, సంస్కృతిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆస్ట్రేలియాలో తెలుగు భాషా వికాసం కోసం చాలాకాలంగా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలు కృషి చేస్తూ భావి తరాలకు బాటలు వేస్తున్నాయి. 'తెలుగుమల్లి' సాహిత్య మాసపత్రిక, 'భువన విజయం' వంటి సాంస్కృతిక సంస్థలు ఈ క్రమంలో తెలుగు ప్రజల అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. తెలుగు భాషకు ఆస్ట్రేలియాలో అరుదైన గౌరవం లభించింది. అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. దీంతో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఇకపై పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలిగింది. ఇందుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, విక్టోరియా, న్యూసౌత్‌వేల్స్, క్వీన్స్‌లాండ్, సౌత్ ఆస్ట్రేలియా మొదలైన రాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలకు ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగు ఐచ్ఛికంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చదువుకొనే అవకాశం కలగనుంది. ఆస్ట్రేలియా "తెలుగు సమాఖ్య, తెలుగుమల్లి, భువనవిజయం" వంటి సాంస్కృతిక సంస్థలు,16 ఏళు ్ల కృషి చేసి విజయం సాధించాయి. అమెరికాలో మన తెలుగు భాషకు గౌరవం దక్కింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ప్రజలకు సమాచారం అందించేందుకు అధికారిక భాషగా తెలుగు భాషను గుర్తించింది. యూ ఎస్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ స్టడీస్ ఇటీవలి అధ్యయనం తెలుగును యుఎస్ లో వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషగా చూపిస్తుంది, ఇది గత ఏడు సంవత్సరాలలో 86% పెరిగింది. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 3 న జరగగా, ఆ ఎన్నికల్లో ఓటరు బ్యాలెట్ పేపర్‌లోని అధికారిక భాషల జాబితాలో తెలుగు భాష కూడా చేర్చారు. ఇటీవలే సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, సాంస్కృతిక కళాసారథి సింగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో తానా, వంగూరి ఫౌండేషన్, యునైటెడ్ కింగ్డమ్ తెలుగు అసోసియేషన్, సీపీ బ్రౌన్ తెలుగు సమాఖ్య (లండన్), దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక, తెలుగు మల్లి ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ సిడ్నీ, న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్, హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య, వేగేశ్న ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో కళాప్రపూర్ణ, పద్మభూషణ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవులపల్లి కృష్ణశాస్త్రి 123వ జయంతి సందర్భంగా 'మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం' అత్యంత వైభవంగా నిర్వహించారు. 2020 నవంబర్ 1 ఆదివారం రోజున 12 గంటలపాటు నిర్విరామంగా ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించ బడింది. అంతేకాదు...మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం' కార్యక్రమానికి.. 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో గౌరవ స్థానం దక్కింది. 12 గంటల ఈ నిర్విరామ సంగీత కార్యక్రమాన్ని వేలాది మంది వీక్షించి, ఆనందించడం సంగీత చరిత్రలో ఒక చెరిగి పోని సంఘటన. ఇదివరలో, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరితో కలిసి ఒక ఫెస్టివల్ జరపాలనే ఆలోచనతో సౌందర్య లహరి పేరిట అమెరికా జయహో భారతీయం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి నిశ్చయించి, తానా సంస్థ మహిళా కోఆర్డినేటర్ తూనుగుంట్ల శిరీష, జిజ్ఞాస అధినేత భార్గవ్ సాయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ మాజీ సంచాలకులు డాక్టర్ డి విజయభాస్కర్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గోళ్ల నారాయణరావు లతో సంప్రదించి సౌందర్యలహరి కార్యక్రమాన్ని ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవంగా మార్చి ప్రణాళిక రూపొందించారు. ప్రపంచ తెలుగు సాంస్కృతి మహోత్సవంలో దాదాపు 45 దేశాల నుంచి 64 తెలుగు సంఘాలు ఒకే తాటి పైకి వచ్చాయి. తెలుగు చరిత్ర లో కనీవినీ ఎరుగని రికార్డ్ అది. జయహో భారతీయం- భారతదేశం, జిజ్ఞాస భారతదేశం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, ఆంధ్ర ప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఫ్రాన్స్ తెలుగు అసోసియేషన్, సౌత్ ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, జర్మనీ తెలుగు అసోసియేషన్, సింగపూర్ తెలుగు సమాజం, తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్, బహరేన్ తెలుగు కళాపరిషత్, తెలుగు వెలుగు జర్మనీ, డెన్మార్క్ తెలుగు అసోసియేషన్, తెలుగుఅసోసియేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియా, సింగపూర్ తెలుగు కమిటీ, చైనా తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్కాట్లాండ్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ కెన్ బెర్రా, కామన్ అసోసియేషన్ ఆఫ్ చైనా, యునైటెడ్ తెలుగు అసోసియేషన్ ఫోరమ్ %-% కువైట్, తెలుగు కళా సమితి కువైట్, ఆస్ట్రేలియా తెలుగు సమితి, ఆస్ట్రేలియా తెలంగాణ స్టేట్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సిడ్నీ, సౌదీ తెలుగు అసోసియేషన్, సౌత్‌ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, తెలుగు కల్చరల్ సొసైటీ నార్త్రెన్- ఐర్లాండ్, తెలుగు కళా సమితి బహరెయిన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇజ్లాండ్ న్యూజి ల్యాండ్, తెలుగు బ్యాత్మెంటిన్ క్లబ్ ఆఫ్ కాంటెంబరి న్యూజి ల్యాండ్, తెలుగు కళా సమితి %-% ఓమాన్, దుబాయ్ తెలుగు అసోసియేషన్, ఖత్తర్ తెలుగు అసోసియేషన్, నార్వే తెలుగు అసోసియేషన్, అమెరికా తెలుగు మహిళ సంఘం లతో పాటు ఆయా ఆయా దేశాలలో వివిధ రాష్ట్రాల తెలుగు అసోసియేషన్స్ భాగస్వామ్యం అయ్యాయి. తెలుగు భాషను నికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 15 కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9 కోట్ల మంది (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే ఎక్కువగా) తెలుగు మాట్లాడేవారు ఉన్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించా ల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**




ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత ఢిల్లీలో ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశం జరిగింది. అలాగే బీజేపీ ఎన్డీయే నేతలకు ప్రత్యేక విందు ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ సమావేశానికి హాజర య్యారు. అలాగే ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ము ఖ్యమంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రభు త్వాల పనితీరు ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ సీఎం రేఖాగుప్తా, డిప్యూటీ సీఎం పర్వేష్ సాహెబ్ సింగ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కొత్తగా సీఎం, డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టిన ఈ ఇద్దరినీ ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు అభినందించారు.

**చంద్రబాబు, పవన్‌తో ప్రత్యేకంగా..** ఎన్డీయే సమావేశంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా మాట్లాడినట్లు తెలుస్తోంది. ఏపీలో అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయి.. రాజధాని అమరావతి పనులు స్థితిగతులను మోదీ అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఏపీ అభివృద్ధికి కేంద్రం నుంచి అన్ని విధాలా తోడ్పాటు ఉంటుందని చెప్పగా.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు చెప్పినట్లు సమాచారం. ఓవైపు ఏపీలో కూటమి నేతల మధ్య విబేధాలు ఉన్నాయంటూ కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా వైసీపీ నేతలు ఈ తరహా విమర్శలు చేస్తున్నారు. ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం వేదికగా ఈ విమర్శలకు ప్రధాని మోదీ చెక్ పెట్టినట్లు తెలుస్తోంది. వేదికపై పవన్ కళ్యాణ్, చంద్రబాబుతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇద్దరితో చమత్కరించిన మోదీ మిగతా ఎన్డీయే నేతలతో పోలిస్తే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో కూటమి మధ్య ఎలాంటి పొరపచ్చాలు లేవనే విషయం స్పష్టమైంది.

**మరింత సమన్వయంతో..** ఎన్డీయే సమావేశం పూర్తైన తర్వాత పవన్ కళ్యాణ్ జాతీయ మీడియాతో మాట్లాడారు. తమ మధ్య ఎలాంటి విబేధాలు లేవన్నారు. తనకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో గతంలో ఎన్డీయే సమావేశాలకు హాజరుకాలేదన్నారు. ఇప్పటికీ వెన్నునొప్పితో తాను బాధపడుతున్నానని పవన్ కళ్యాణ్ చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని, అన్ని హామీలు అమలుచేస్తామని పవన్ కళ్యాణ్ తెలిపారు.

# తెలుగుకు పునర్వైభవం తేవాలి... తెలుగుకు పట్టిన తెగులును వదిలించాలి

## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా




జంతువుల నుండి మానవుని వేరు చేసేది భాష ఒక్కటే. భాష లేకపోతే మన భావాలను ఇతరులతో వ్యక్తీకరించడం సాధ్యం కాదు. సమాజం ద్వారా వ్యక్తి లోనికి ప్రవేశించి వ్యక్తిని సామాజికుడిని చేసేది మాతృభాష. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవడం, తెలుసుకున్న జ్ఞానాన్ని అనుభవాన్ని సంస్కృతిని, సంప్రదాయాన్ని తర్వాతి తరాలకు అందించడానికి ఉపకరించే సాధనం మాతృభాష. గతానికి వర్తమానానికి భవిష్యత్తుకు వారధి కూడా మాతృభాషే. భాష అనేది చరిత్ర గమనానికి, సామాజిక పరిణామానికి మూలాధారం. మాతృభాష అనగా శిశువుకు తల్లి ఉగ్గుపాలతో నేర్పినటువంటి భాష. ఈ మాతృభాష ప్రతి శిశువుకు సహజంగా ఎలాంటి ప్రయత్నం అవసరం లేకుండానే వస్తుంది. మాతృభాష ద్వారా నేర్చుకున్న విద్య సులభంగా అవగత మవుతోంది. అంతేకాక విద్యార్థిలో ఉన్న సృజనాత్మక శక్తులను వెలికి తీస్తుంది. తద్వారా ఇతర భాషలు నేర్చుకోవడానికి మాతృ భాష ఎంతో సహాయకారిగా ఉంటుంది.. ఇదంతా గత కాలం గురించి పూర్తిగా తెలిసిన తెలుగు వారికి, తెలియనిది ఏమీ కాదు. ఆంగ్ల మాధ్యమంలో చదివితే పిల్లలు గొప్పవారు కాగలరని, తెలుగు మాట్లాడితే చులకన అనే భావన వల్ల, ఆంగ్ల భాషకు ప్రాధాన్యత పెరిగి, తెలుగు భాష నిరంతర నిర్లక్ష్యానికి గురి అవుతున్నది. వెనుజులకు చెందిన వర్తకుడు నికొలో డా కాంటి భారతదేశం గుండా ప్రయాణిస్తూ, తెలుగు భాషలోని పదాలు ఇటాలియన్ భాష వలె అజంతాలు (అచ్చు చివరన కలిగి) గా ఉండటం గమనించి తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ గా 1402 లోనే ప్రశంసించారు.

పరభాష ద్వారా ప్రాథమిక తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పే విధానం పూర్తిగా అశాస్త్రీయమని, కాలహరణ హేతువని, బావి పౌరులను బానిసలుగా చేస్తుందని విద్యా వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. పిల్లల సొంత ఆలోచనలను పెంపొందించడానికి, వారి సాంస్కృతిక బానిసత్వానికి మార్గం ఏర్పడుతుందని, విజ్ఞానానికి - విద్యార్థులకు మధ్య ఒక అడ్డుగోడలా సృష్టిస్తుందని, తమ చుట్టూ ఉన్న జీవిత విలువలను తెలియని విద్యార్థులను, విషయ పరిజ్ఞానం లోతుగా తెలీని, ఉపాధ్యాయులు చెప్పింది చెప్పినట్లు, నోట్సు కాపీ చేస్తూ, కంఠస్తం చేసే యంత్రాలుగా మారుస్తుందని విద్యాధికుల, మానసిక శాస్త్ర వేత్తల భావన. తనకు అర్థం కాని, సాధికారికత ఏమాత్రం చేకూర్చని భాషకు సంబంధించిన విషయాలను, బట్టీ పట్టి తమ తల్లిదండ్రులను మురిపింప చేస్తూ, తమను తాము, తమ పోషకులను, మోసం చేసుకోవడం అవుతుందని విజ్ఞులు, ప్రాజ్ఞులు ఎంత మొత్తుకున్నా, అర్థం చేసుకునే వారు భూతద్దానికి అగుపించడం లేదంటే అతిశయోక్తి లేదు...మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు ... ప్రఖ్యాత ఆంగ్ల కవి విలియం షేక్స్పియర్ ఏమి చదవుకుని, ఆంగ్ల సాహిత్య శిఖరంలా ఎదిగారనేది అర్థం చేసుకోవాలి. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు 9.3 కోట్ల మందికి మాతృభాషగా ఉంది. భారతావనిలో హిందీ 366 మిలియన్ల, బెంగాలీ 83 మిలియన్ల, తెలుగు 74 మిలియన్ల, తర్వాత మరాఠీ 72, తమిళం 61, కన్నడం 55, ఉర్దూ 52, గుజరాతీ 46, మలయాళం 33, ఒరియా 33 మిలియన్ల మంది మాట్లాడుతూ 10 స్థానాలలో ఉన్నారు. తెలుగు భాషను 2008 అక్టోబరు 31న భారత ప్రభుత్వం ప్రాచీన భాషగా గుర్తించింది. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణా, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దు కుంటోంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో, కేజీ నుండి పూర్తిగా ఆంగ్ల మాధ్యమం పెడదామన్న సీఎం జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని, హై కోర్టు నిర్ద్వందంగా త్రోసి పుచ్చింది. తెలుగు భాషాభిమానులు ప్రపంచ వ్యాప్తంగా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు వ్యక్తం చేశారు. ఇదైనా పాలకులకు గుణపాఠం కావాలి. ప్రైవేటు పాఠశాలలో తెలుగు మాధ్యమంలో, ప్రాథమిక విద్య దాదాపు కనుమరుగయింది. తెలుగు భాషకు.. తెలుగు తనానికి చోటు లేకుండా పోతున్నది. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు " తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు రాష్ట్రాలలో తెలుగును నిర్లక్ష్యం చేస్తుంటే.... దేశ ప్రధాని నరేంద్ర మోడీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ, అహమ్మదాబాద్, సూరత్ లాంటి పట్టణాలలో, తెలుగు వారికోసం తెలుగు మాధ్యమ బడులు నడిపారు. ఇప్పటికీ అవి నడుస్తూనే ఉన్నాయి. అంతే కాదు, 2017లో కేంద్ర ప్రభుత్వ బళ్ళలో కూడా తెలుగు తప్పని సరి అని ప్రధాని అన్నారు కూడా. భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, "మాతృ భాష కళ్ళ వంటిది, పరాయి భాష కళ్ళద్దాల వంటిది, కళ్లు లేకుండా, అద్దాలు పెట్టుకోవడం వల్ల ఉపయోగం శూన్యం". అన్న మాటలను మననం చేసుకోవాలి. మారిషస్ లో తెలుగు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయ స్థాయి కోర్సుల నిర్వహణబీ ఆస్ట్రేలియా ప్రభుత్వం అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలుగుతున్నది. అమెరికాలో తెలుగు వారి కోసం బ్యాలెట్లపై ఇటీవలే తెలుగులో ముద్రించడం వంటి అంశాలను గమనించాలి. పరదేశీయుడైనా, ఆంగ్ల భాష మాతృభాష అయినా, ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా భారత దేశానికి వచ్చి, విధి నిర్వహణ కోసం తెలుగు భాష నేర్చుకుని, నాటికి కరడుగట్టి, మినుకు మినుకు మంటూ, ఆరి పోవడానికి సిద్దంగా ఉన్న తెలుగు భాష ఉద్దరణకు బ్రౌన్ తీసుకున్న చొరవను, సహస్రాధిక వేమన పద్యాలను వెలికితీసి ప్రచురించడం, పాఠశాలలు స్థాపించి, ఉచిత విద్య నేర్చుకునే అవకాశం కల్పించడం, ప్రాచీన గ్రంథాలను అర్థం చేసుకోవడానికి ఏకంగా నిఘంటువుని అందించడం ద్వారా తెలుగు భాషా, సాహిత్య వికాసానికి సి. పి. బ్రౌన్ అందించిన సేవలను ఒకసారి గుర్తు చేసుకోవాలి. గొప్పలను ప్రదర్శించడం కాదు... గొప్పలను నిలబెట్టు కోవడమే గొప్ప. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# సర్ ఫ్రెడరిక్ గ్రాంట్ బాంటింగ్ .... మధుమేహ చికిత్సలో విప్లవాత్మక శాస్త్రవేత్త

## ఫిబ్రవరి 21...సర్ ఫ్రెడరిక్ గ్రాంట్ బాంటింగ్ వర్ధంతి



సర్ ఫ్రెడరిక్ గ్రాంట్ బాంటింగ్ ఒక ప్రముఖ కెనడియన్ వైద్యుడు, శాస్త్రవేత్త, మరియు శస్త్రచికిత్స నిపుణుడు. ఆయన ఇన్సులిన్ కనుగొనడంలో కీలక పాత్ర పోషించాడు. ఇది మధుమేహ రోగుల చికిత్సలో విప్లవాత్మక మార్పుని తెచ్చింది. 1923లో, ఈ విశేషమైన పరిశోధనకు గాను నోబెల్ బహుమతి అందుకున్నాడు. ఆయన కృషి అనేక కోట్లు మంది మధుమేహ రోగుల జీవితాలను కాపాడింది. సర్ ఫ్రెడరిక్ గ్రాంట్ బాంటింగ్ 1891 నవంబర్ 14 న కెనడాలోని అలిస్టన్, ఒంటారియో లో జన్మించాడు. సాధారణ రైతు కుటుంబంలో పెరిగిన బాంటింగ్ తన విద్యకు పెద్దపీట వేసుకున్నాడు. టొరంటో విశ్వవిద్యాలయంలో వైద్య విద్య అభ్యసించాడు. 1916లో ఎం బి బి ఎస్ పట్టా పొందాడు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో కెనడియన్ ఆర్మీ మెడికల్ కార్ప్స్ లో చేరి వైద్యుడిగా పనిచేశాడు. 1920లో బాంటింగ్ మధుమేహంపై లోతైన పరిశోధన చేయాలని నిర్ణయించు కున్నాడు. టొరంటో విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ జాన్ మెక్ లియోడ్ సహాయంతో ఇన్సులిన్ అభివృద్ధిపై పని చేశాడు. బాంటింగ్ తన సహచరుడు చార్లెస్ బెస్ట్ తో కలిసి పాంక్రియాస్ గ్రంథి నుండి ఇన్సులిన్ ను వేరు చేయడానికి ప్రయోగాలు ప్రారంభించాడు. 1921లో, కుక్కలపై నిర్వహించిన ప్రయోగాలు విజయవంత మయ్యాయి. 1922లో, లియోనార్డ్ థాంప్సన్ అనే మధుమేహ రోగికి ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇచ్చి, అతని ఆరోగ్యాన్ని మెరుగుపరిచారు. 1923లో, బాంటింగ్, జాన్ మెక్ లియోడ్ లు ఫిజియాలజీ లేదా మెడిసిన్ లో నోబెల్ బహుమతి అందుకున్నారు. అయితే, బాంటింగ్ తన సహచరుడు చార్లెస్ బెస్ట్ కృషిని గుర్తించక పోవడాన్ని వ్యతిరేకించాడు. అందుకే, తన బహుమతి మొత్తం బెస్ట్ తో పంచుకున్నాడు. 1934లో, "సర్" అనే గౌరవ పదవిని పొందాడు. కెనడా దేశం అతన్ని జాతీయ గౌరవంగా గుర్తించింది. ఇన్సులిన్ కనిపెట్టక ముందు, మధుమేహం ఉన్న రోగులకు ఎటువంటి ప్రభావవంతమైన చికిత్స లేదు. ఈ శాస్త్రసాంకేతిక విజయంతో అనేక కోట్ల మంది రోగులు ప్రాణాలను దక్కించుకున్నారు. నేడు, ఇన్సులిన్ ప్రపంచవ్యాప్తంగా మధుమేహ చికిత్సకు ప్రధాన ఔషధంగా మారింది. బాంటింగ్ టొరంటో విశ్వవిద్యాలయంలో వైద్య పరిశోధనను కొనసాగించాడు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో, అతను కెనడియన్ ప్రభుత్వానికి వైద్య పరిశోధనలో సహాయం చేశాడు. 1941 ఫిబ్రవరి 21 న, న్యూఫౌండ్‌ల్యాండ్ సమీపంలో ఓ విమాన ప్రమాదంలో మరణించాడు. బాంటింగ్ ఇన్సులిన్ ఆవిష్కరణ మధుమేహం చికిత్సలో విప్లవాత్మక మార్పులు చేసింది. ఆయన కృషి లక్షలాది మంది జీవనాన్ని మార్చింది. నవంబర్ 14, బాంటింగ్ పుట్టిన రోజును ప్రపంచ మధుమేహ దినోత్సవంగా జరుపుకుంటారు. టొరంటోలోని బాంటింగ్ ఇనిస్టిట్యూట్ వైద్య పరిశోధనలకు ప్రాముఖ్యత నిస్తుంది. సర్ ఫ్రెడరిక్ గ్రాంట్ బాంటింగ్ మానవాళికి చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఇన్సులిన్ కనిపెట్టడం ద్వారా ఆయన మధుమేహం రోగుల జీవితాల్లో వెలుగును నింపాడు. ఈ విశేషమైన కృషికి గాను ఆయన పేరు వైద్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం

# హైదరాబాద్ కిటకిట.. ఢిల్లీని దాటేసిందట!

వాళ్లు వీళ్లు అన్న తేడా లేదు. సౌత్..నార్త్ అన్న సమస్య రాదు. ఎవరి భాష మాట్లాడినా.. ఎవరో ఒకరు సమాధానం ఇస్తుంటారు. ఫుడ్ కోసం ఇబ్బందులు అసలే రావు. ఇన్ని ప్లస్ పాయింట్లు ఉన్న మహానగరం మన దేశంలో హైదరాబాద్ ఒక్కటి మాత్రమే ఉంటుంది. అందుకే.. ఇప్పుడు అందరి చూపు భాగ్యనగరం మీదనే. గడిచిన కొన్నేళ్లుగా భాగ్యనగరికి అన్ని రాష్ట్రాలకు చెందిన వారు వస్తున్నారు. ఉపాధి అవకాశాల కోసం.. ఉద్యోగాల కోసం.. చదువుకోవటానికి.. ఇలా ఒకటి కాదు రెండు కాదు ప్రతి అంశానికి కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది హైదరాబాద్. ఈ కారణంతోనే జనసాంద్రత విషయంలో దేశ రాజధాని ఢిల్లీని దాటిపోయింది భాగ్యనగరం. ఈ విషయాన్ని తాజాగా విడుదలైన తెలంగాణ రాష్ట్ర గణాంకాల శాఖ విడుదల చేసిన రిపోర్టులో వెల్లడయ్యాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఢిల్లీ మహానగరంలో ప్రతి చదరపు కిలోమీటర్ కు 11,313 మంది నివసిస్తుండగా.. హైదరాబాద్ జనసాంద్రత 18,161గా నమోదైంది. అంటే.. హైదరాబాద్ మహానగరం లోని ప్రతి చదరపు కిలోమీటర్ లో 18వేలకు పైగా ప్రజలు నివసిస్తున్న పరిస్థితి. ప్రపంచంలో అత్యధిక జనసాంద్రత కలిగిన నగరంగా ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాను చెబుతారు. అక్కడ ప్రతి చదరపు కిలోమీటర్ కు 43,079 మంది నివసిస్తుంటారు. మన దేశానికి వస్తే అత్యధిక జనసాంద్రత కలిగిన మహానగరంగా ముంబయి నిలుస్తుంది. ఇక్కడ ప్రతి చదరపు కిలోమీటర్ కు 28,508 మంది ఉంటున్నారు. ఇక్కడో ఆసక్తికరమైన అంశాన్ని ప్రస్తావించాలి. హైదరాబాద్ మహానగరంలో జనసాంద్రత అంతకంతకూ పెరిగిపోతుంటే.. ఈ మహానగరి ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలు జనసాంద్రత తక్కువగా ఉండటం గమనార్హం. బిహార్.. పశ్చిమ బెంగాల్ తో పోల్చినా కూడా తెలంగాణలో జనసాంద్రత తక్కువగా నమోదు అవుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్ర జనాభా 3.5 కోట్లు. సగటున చదరపు కిలోమీటర్ కు 312 మంది మాత్రమే నివసిస్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ మహానగరంలో చదరపు కిలోమీటర్ కు నివసిస్తున్న వారు 18,161తో పోల్చినప్పుడు జనాభా ఎంత ఎక్కువగా ఉన్నారన్న విషయం అర్థమవుతుంది. ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్రంలో 2036 నాటికి యువ జనాభా తగ్గి పెద్దవయస్కుల జనాభా పెరుగుతుందన్న ఆందోళనకర అంశం వెల్లడైంది. 2011తో పోలిస్తే 2036 నాటికి తెలంగాణలో 34 ఏళ్ల లోపు వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోనుంది. అదే సమయంలో పెద్ద వయస్కుల జనాభా పెరగనుంది. జనాభా నియంత్రణ విధానాల్ని పాటించటంతో జననాల రేటు తగ్గిపోవటమే కారణంగా చెబుతున్నారు. 2011లో తెలంగాణలో రాష్ట్రంలో ఏడాది అంతకంటే తక్కువ వయసున్న చిన్నారులు 5.79 లక్షల మంది. 2036 నాటికి చిన్నారుల సంఖ్య 3.94 లక్షలకు తగ్గిపోతారని చెబుతున్నారు. ఇదే విధంగా మిగిలిన వయస్కుల విషయంలోనూ ఉంటుందని చెబుతున్నారు. ఈ కారణంతోనే ఎక్కువ మంది పిల్లల్ని కనాలన్న మాట ఇప్పుడు ప్రభుత్వాధినేతల నోటి నుంచి తరచూ వస్తోంది.

# మారిషస్ లో తెలుగు వెలుగు - ఫిబ్రవరి 21...అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా సందర్భంగా




ఆఫ్రికా ఖండ తీర ఆగ్నేయ తీరప్రాంతాల్లో 2000లో మీటర్ల దూరంలో హిందూ మహా సముద్రంలో ఉన్న ద్వీప దేశం మారిషస్. 2040 చ.కి.మీల వైశాల్యం కలిగి, పోర్టు లూయిస్ రాజధానిగా దాదాపు 12 లక్షల పై చిలుకు జనాభా కలిగి, ఆంగ్లం, తెలుగు అధికార భాషలుగా, మారిషియన్ క్రియోల్, ఫ్రెంచి, చైనీస్ ఉర్దూలతో పాటు, భోజ్ పూరి, మరాఠీ, తమిళం, ఉర్దూ తదితర భారతీయ ప్రాంతీయ భాషలు గా కలిగి ఉంది. 1630 – 1710 డచ్ కాలనీగా 1715 – 1810 మధ్య ఫ్రెంచ్ కాలనీగా తర్వాత 1968 వరకు బ్రిటిష్ కాలనీల నుండి తర్వాత స్వాతంత్రం పొందింది. 1903లో పైచెల్లిసును ప్రత్యేక కాలనీ గా రూపొందించిన తర్వాత మారిషస్ క్రమానుగత అభివృద్ధి జరుగు తున్నది. ఆఫ్రికా దేశాల మానవ అభివృద్ధి జాబితాలో ద్వితీయ స్థానంలో ఉన్న మారిషస్ హిందూ యిజం అతి పెద్ద మతంగా ఉన్న ఏకైక ఆఫ్రికా దేశంగా ప్రత్యేకతను కలిగి ఉంది. రైతులు చెరకు పొలాలలో పని చేయడానికి పెద్దసంఖ్యలో భారత దేశం నుండి కార్మికులను తీసుకు వచ్చారు. 1834 – 1921 మధ్యలో ద్వీపంలో సుమారు 5 లక్షల మంది కార్మికులు పనిచేసారు. నేడు మారిషస్ జనాభాలో 68% కంటే ఎక్కువ మంది భారతీయ మూలానికి చెందిన వారు, సాధారణంగా ఇండో – మారిషియన్లు అని పిలుస్తారు. ప్రైవేటు వ్యవసాయ దారుల క్రింద కూలీలుగా పనిచేయటానికి 1835 లో కిష్టమ్, వెంకటపతి, అప్పయ్య అనే ముగ్గురు తెలుగు వారు కాంది శీకులుగా తొలిసారిగా మారిషస్‌లో అడుగు పెట్టారు. ఆ మరుసటి సంవత్సరం గౌంజన్ అనే ఓడలో దాదాపు 30 మంది తెలుగు వారు ఆ ద్వీపంలో కాలు పెట్టారు. కాకినాడ సమీపాన వున్న 'కోరంగి' రేవు నుండి బయలు దేరి వచ్చినందుకు వాళ్లని "కోరంగి వాళ్ళు" అని, వారు మాట్లాడే తెలుగు భాషకు 'కోరంగి భాష' అని పిలిచేవారు. 1843 సంవత్సరంలో దాదాపు 35 ఓడల్లో భారతీయులు మారిషసు వలస వచ్చారు. వారిని తీసుకుని వచ్చిన ఓడల పేర్లు సిటీ ఆఫ్ లండన్, కింగ్ స్టన్, ఫ్లవర్ ఆఫ్ ఉగీర్, సుల్తాన్, సిరంగపట్నం, బాబా బ్రాహ్మిన్, కోరంగి పికెట్ మొదలైనవి. ఇ 1834లో పుట్టిన ఊళ్లను విడిచి, చెరుకు తోటల్లో పని చేసేందుకు కూలీలుగా మారిషస్ వెళ్లిన తెలుగు వారు మాత్రం తమ తరువాతి తరం వారు కూడా తెలుగు భాషను ప్రేమించి, మాట్లాడేలా పునాది వేశారు. మాతృ భాషకు బ్రహ్మో త్సవం జరిపారు. తెలుగుకు పట్టాభిషేకం చేస్తున్నారు. వారు తమతో తీసుకెళ్లిన వ్యవసాయ పరికరాలైన పలుగు, పారతో పాటు "పెద్ద బాలశిక్ష, రామాయణ, మహాభారతం" వంటి ఇతిహాస గ్రంథాలు, అక్కడి వారిని తెలుగు వారసులుగా తీర్చిదిద్దే ప్రయత్నానికి దోహద పడుతు న్నాయి. అవే ఇప్పటి ఆరవ తరం తెలుగువారూ భాషాయజ్ఞంలో మమేకం కావడానికి కొండంత ఆసరాగా నిలుస్తున్నాయి. మారిషస్ దేశానికి వెళ్లిన తెలుగువారు తొలుత తమ భాషా, సాంప్రదాయాలను నిలుపు కోవడానికి ఇబ్బందులను ఎదుర్కొన్నా, అక్కడికి వెళ్లిన వారిలో మేబర్ ప్రాంతానికి చెందిన పండిట్ గుణ్ణయ్య 1930లో తెలుగు భాషా వికాసానికి నడుం కట్టారు. ఇలా 1947లో ముందు మారిషస్ ఆంధ్ర మహా సభ, తర్వాత నామాంతరం చెంది మారిషస్ "తెలుగు మహా సభ"గా ఆవిర్భవించింది. దాన్ని వారు తెలుగు భాషామ తల్లి ఆలయంగా భావిస్తున్నారు.. ప్రస్తుతం మారిషస్ దేశంలో తెలుగు కుటుంబాల్లో ఆరవ తరం వారు సైతం, తమ పెద్దలు వేసిన బాటలో నడుస్తుం డటం ఇక్కడి తెలుగు వారికి స్ఫూర్తిదాయక అంశం. మారిషస్ దీవిలోని మొత్తం జనాభా దాదాపు 13 లక్షలైతే, తెలుగువారు 1లక్షమందికి పైగా ఉన్నారు. వీరికోసం సుమారు 300 తెలుగు పాఠశాలలు నడుస్తుండగా, 190 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రాథమిక తరగతులలో దాదాపు 10 వేల మంది విద్యార్థులు తెలుగు మాధ్యమంలో విద్యను అభ్యసి స్తున్నారు. మాధ్యమిక, ఉన్నత విద్య లో తెలుగు ద్వితీయ భాషగా ఉంది. ఉన్నత విద్యకోసం మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం పని చేస్తుంటే, తెలుగు మహాసభ, తెలుగు సాంస్కృతిక మండలి, తెలుగు యువ సంఘం, అనేక ఉప సంఘాలు సమన్వయంతో పని చేస్తున్నాయి. వీటికి మారిషస్ రిపబ్లిక్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, పూర్తిస్థాయిలో ఆర్థికంగా చేయూత నిస్తున్నది. ఫ్రెంచికి దగ్గరగా ఉండే "క్రియోల్" వారి మాతృభాష అయినా, స్వ భాషాభిమానంతో, తెలుగును ద్వితీయ భాషగా ఎంచుకొని తెలుగును బతికిస్తున్నారు. ముఖ్యంగా ధర్మపురి నరసింహ శతకం, వేమన శతక పద్యాలకు వారు పెద్దపీట వేయడం, క్షేత్రయ్య అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు కీర్తనలు, నరసింహ శతకం, నేర్చు కోవడంతో పాటు తెలుగు సంప్రదాయాలనూ పూర్తిస్థాయిలో పాటించడం విశేషం. ఇటీవల అక్కడి విద్యార్థులే ఓ కథా సంకలనం వెలువరించడం వారికి తెలుగు గల అభిమానానికి, ప్రేమకు తార్కాణం. మారిషస్‌లో ఓ ఆరాధ్య భావంతో తెలుగుకు బ్రహ్మోత్సవాలు 2018లో ఆగస్టు 20నుండి నిర్వహించి, అందులో భాగంగా, పద్య పఠన పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతి ప్రదానంతో పాటు ఒక్కోరోజు ఒక్కో తెలుగు సాంప్రదాయంపై అవగాహన కల్పించేందుకు వీలుగా సదస్సులను నిర్వహించారు. మారిషస్ దీవిలో తెలుగు భాషోన్న తికి సర్వస్వాన్ని ఫణంగా పెట్టి "సంజీవ నరసింహ అప్పడు" పని చేస్తున్నారు. ఆయన ఆ దేశ తెలుగు పరీక్షల విద్యాధికారి, రేడియో వ్యాఖ్యాత, జర్నలిస్ట్. మారిషస్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ తెలుగు విభాగ అధికారి. తెలుగు ప్రాంతాలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ అక్కడి తెలుగు వికాసానికి కృషి చేస్తున్నారు. తెలుగు తనాన్ని నిలుపు కొనేందుకు మారిషస్ తెలుగు మహాసభ, అక్కడి ప్రభుత్వం గట్టి సంకల్పంతో పని చేస్తున్నాయి.

తెలుగు మహాసభ దేశ రాజధాని పోర్టు లూయిస్ లోని రాయల్ రోడ్డులో ప్రధాన కార్యాలయం కలిగి, ఏడు ప్రాంతీయ కమిటీలు, 90 శాఖలు క్రియా శీలకంగా పని చేస్తున్నాయి అంటే, ఆ సంస్థ తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషి చెప్పకనే చెబుతున్నది. తెలుగు వారికి ప్రీతి పాత్రమైన ఉగాదితో పాటు వినాయక చవితి, దీపావళి, సంక్రాంతి జాతీయ సెలవుదినాలుగా పాటించడం గమనార్హం. తెలుగు వారి సంస్కృతి ప్రతీకలైన పండగలు, పబ్బాలు ఆచరిస్తున్నారు. ప్రస్తుతం తెలుగువారిచే నిర్మితాలైన 350 దేవాలయాలూ తెలుగు భాషా వికాసానికి కేంద్రాలుగా ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగనభట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాల మిస్ట్... 9440595494**

# తెలుగు నాటక రంగం లో స్థానం వారిది ప్రత్యేక స్థానం - ఫిబ్రవరి 21...స్థానం నరసింహారావు వర్ధంతి



స్థానం నరసింహారావు (23.9.1902%– 21.2.1971) ఆంధ్ర నాటకరంగ చరిత్రలో నరసింహారావుది ప్రత్యేక స్థానం. నాటక రంగం మనగలిగినంత కాలం ఆయన పేరు శాశ్వతంగా నిలిచి పోతుంది. ఆయన స్త్రీ పాత్రధారణలో అసాధారణ ప్రజ్ఞ కనబరచి నాటక రంగానికే వన్నె తెచ్చారు. పురుషులే స్త్రీ వేషాలు వేసే ఆ నాటి రోజుల్లో రంగస్థలంపై విభిన్నమైన, పరస్పర విరుద్ధమయిన పాత్రలను ధరించి, ధరించిన ప్రతి పాత్రలోను తమదైన ప్రత్యేకతను చూపించి లీనమై, ముప్ఫయి సంవత్సరాలపాటు లక్షలాది మంది ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసిన ప్రతిభ ఆయనకే సొంతం. నటకావతంస, నటశేఖర, నాటకకళా ప్రపూర్ణ, పద్మశ్రీ వంటి బిరుదులు, పురస్కారాలు ఆయనను వరించాయి. స్థానం నరసింహారావు (సెప్టెంబర్ 23, 1902 – ఫిబ్రవరి 21, 1971) ప్రసిద్ధ రంగస్థల, తెలుగు సినిమా నటులు. సత్యభామ, చిత్రాంగి మొదలైన అనేక స్త్రీ పాత్రలను సుమారు 40 సంవత్సరాలకు పైగా ధరించి 3వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేక్షకాభిమానంతో సహా పద్మశ్రీ పురస్కారం పొందాడు. స్థానం నరసింహారావు 1902, సెప్టెంబర్ 23 న హనుమంతరావు, ఆదెమ్మ దంపతులకు గుంటూరు జిల్లా బాపట్ల లో జన్మించారు. ఆయన చిన్నతనంలో కూచిపూడి భాగవతులు వచ్చి బాపట్లలో ప్రదర్శనలు ఇచ్చేవారు. అందులో వెంపటి వెంకటనారాయణ అనే ఆయన భామ వేషం అద్భుతంగా కట్టేవారట. ఆ స్త్రీ వేషం తన మనసులో ఎంతో ఆదరంతో మనసులో నిలిచి పోయి ఉండేదని చెప్పారు. ఈ దృశ్యాలన్నీ ఆయన రంగస్థల ప్రవేశం చేయడానికి దోహదం చేశాయి. 1921లో బాపట్లలోనే జంట కవులైన తిరుపతి వేంకటకవులకు, కొప్పరపు కవులకు శతావధానం పోటీ జరిగింది. నెగ్గిన తిరుపతి వేంకటకవులని సత్కరించాలని భావించారు. ఆ సందర్భంగా ప్లీడరు గుమస్తాల బృందం చేత సత్య హరిశ్చంద్ర నాటకం వేయించాలని నిర్ణయించారు. ఆహ్వానాలు వెళ్లిపోయాయి. కానీ చంద్రమతి వేషధారి అస్వస్థుడై రాలేకపోతున్నట్టు చివరి నిమిషంలో తెలిసింది. ప్రత్యామ్నాయం ఏదీ సాధ్యం కాలేదు. చంద్రమతి పాత్రధారి మరొకరు దొరకలేదు. మరో నాటకం వేద్దామంటే పాత్రధారులంతా లేరు. గుండెల్లో రాయి పడింది. అప్పుడే ఆపద్బాంధవుడిలా స్థానం దొరికాడు చోరగుడి హనుమంతరావుకి. వారి నాటకం రిహార్సల్స్ జరుగుతున్నప్పుడు వెళ్లి కూర్చోవడంతో పద్యాలన్నీ వచ్చేశాయి. ఒకసారి ఎవరూ లేనప్పుడు పాడుకుంటూ ఉంటే హనుమంతరావు విన్నారు. ఆ ధైర్యంతోనే చంద్రమతి వేషం వేయించారు. స్థానం వారికి చిన్నతనంలోనే చిత్రలేఖనం కూడా అబ్బింది. ఆ కళతోనే, వేరే ఒకరి ఇంట రహస్యంగా తన వేషం తనే వేసుకున్నారాయన. చిన్న చిన్న లోపాలు ఉన్నా అరంగేట్రంలోనే తిరుపతి కవుల ఆశీస్సులు అందుకున్నారు స్థానం. తెనాలిలోని శ్రీరామ విలాస సభలో ప్రవేశించి ఆకాలంలోని గొప్ప నటులందరి సరసన పాత్రలు ధరించి దేశమంతటా పర్యటించి అపారమైన అనుభవం సంపాదించారు. వరంగల్‌లో 'కృష్ణలీల' నాటకంలో యశోద వేషం వేసినందుకు ఆయన జీవితంలో తొలి బంగారు పతకం వచ్చింది. అనతికాలంలోనే ఆయన పేరు మారుమోగిపోయింది. కాపురం బాపట్ల నుంచి తెనాలికి మారింది. శ్రీరామవిలాస సభ అనే నాటక సమాజాన్ని స్థాపించి నటననే జీవికగా చేసుకున్నారు. రోషనార (రోషనార నాటకం), తామీనా (రుస్తుం సొహరాబ్ నాటకంలో), సంయుక్త (రాణీ సంయుక్త), శకుంతల (అభిజ్ఞాన శాకుంతలం), సత్యభామ (శ్రీకృష్ణ తులాభారం), చిత్రాంగి (సారంగధర), దేవదేవి (విప్రనారాయణ), కోకిల (కోకిల నాటకం), మల్లమ్మ (బొబ్బిలి), మధురవాణి (కన్యాశుల్కం), అనసూయ (అనసూయ నాటకం), మురాదేవి (చంద్రగుప్త), చింతామణి (చింతామణి), సుభద్ర (వీరాభిమన్య), సరళ (ఛత్రపతి శివాజీ), విద్యాధరి (కాళిదాసు), చండిక (చండిక నాటకం) వంటి పాత్రలు వేశారు. ఎన్ని పాత్రలు పోషించినా, ఆయన వేసిన సత్యభామ పాత్ర పోషణ న భూతో న భవిష్యతి. మీర జాల గలడా నా యానతి అన్న పాటకు ఆయన చేసిన గాత్రం, చూపిన అభినయం నాటక ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయాయి. ఆంధ్రదేశంలో దాదాపు 3,000 సార్లు రంగస్థలం మీద పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించి ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. శృంగార రసాన్ని ప్రతిబింబించే రీతిలో సత్యభామ పాత్ర, ప్రణయానికి చిత్రాంగిగా, వీరరసాన్ని చిత్రించడంలో రోషనార నాటకంలో రోషనారగా, వలపుల చింతామణిగా, ప్రణయదేవతగా, భక్తురాలిగా, దేవదేవిగా, మధురాతి మధురమైన మధురవాణిగా నవరసాలు కలిగిన పాత్రలను ప్రతిభావంతంగా పోషించాడు. వేషధారణ, వస్త్రాలంకరణలో స్థానం వారిది ఒక ప్రత్యేకత. రకరకాల చీరకట్టు సొగసులతో మనోహరంగా రంగస్థానం మీదకు ప్రవేశించి ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేశారు. వీరు సినీ రంగంలో రాధాకృష్ణ (1939), సత్యభామ) వంటి కొన్ని సినిమాలలో నటించారు. 1931 నుండి 1942 వరకు మద్రాసులో సినీనటుడిగా వున్నారు. ఆయన పాడిన పాటలు, పద్యాలు గ్రామ ఫోన్ రికార్డులుగా వచ్చి శ్రోతల్ని ఎంతగానో అందించాయి. తన నటనానుభవాలను చేర్చి "నటస్థానం" అనే గ్రంథాన్ని ఆయన రచించారు. స్థానం నరసింహారావు 1971 ఫిబ్రవరి 21 తేదీన మరణించారు. 1956లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన ఈ బహుమతిని పొందిన తొలి ఆంధ్రుడు, కళాకారుడు. ఆయన రంగ స్థలం పై చూపించిన సమయస్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగు వాచకంలో ఒక పాఠం కూడా పెట్టింది. అయన నటనకు ముగ్ధులైన రంగూన్ ప్రజలు 1938లో బంగారు కిరీటాన్ని బహూకరించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# భారత పరిశోధన శాలల పితామహుడు భట్నాగర్ - ఫిబ్రవరి 21...శాంతి స్వరూప్ భట్నాగర్ జయంతి



శాంతి స్వరూప్ భట్నాగర్ (ఫిబ్రవరి 21, 1894 %–% జనవరి 1, 1955) గురించి తెలియని వారుండరు. భారతదేశం గర్వించదగ్గ శాస్త్రజ్ఞుడు భట్నాగర్. భట్నాగర్ ను భారత పరిశోధన శాలల పితామహుడిగా అభివర్ణిస్తారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (%జూ×=%) ప్రథమ డైరెక్టర్. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (%ఖ+జ%) తొలి మొదటి ఛైర్మన్. దేశంలో మొత్తం 12 పరిశోధన శాలలను ఆయన స్థాపించాడు. ఆయన జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారం స్థాపించింది. శాంతి స్వ రూప్ భట్నాగర్ బ్రిటిష్ ఇండియా లోని పంజాబ్ ప్రాంతంలోని, ఇప్పటి పాకిస్తాన్లో ఉన్న షాపూర్లో, హిందూ కాయస్థ కుటుంబంలో 1894 ఫిబ్రవ రి 21న భట్నాగర్ జన్మించాడు. చిన్ననాటి నుండి సాహిత్యమన్నా, విజ్ఞాన శాస్త్రమన్నా విపరీతమైన ఆసక్తిని పెంచు కున్నాడు. కవిత్వం లో మంచి ప్రవేశ ముండేది. బాల్యం నుండే బొమ్మలు, యంత్ర పరికరా లు చేయటంలో ఆసక్తి కనబరిచే వాడు. తన ప్రాథమిక విద్యను దయానంద్ ఆంగ్లో–వేద ఉన్నత పాఠశాల, సికింద్రా బాద్ (బులంద్ షహర్ ) నుండి పూర్తి చేశాడు. 1911లో లాహోర్ లోని కొత్తగా స్థాపించ బడిన దయాల్ సింగ్ కాలేజీలో చేరాడు. భట్నాగర్ 1913లో పంజాబ్ విశ్వ విద్యాలయం ఇంటర్మీడియట్ పరీక్షలో ఉత్తీర్ణుడ య్యాడు. ఫోర్మాన్ క్రిస్టియన్ కళాశాలలో చేరాడు. 1916లో భౌతిక శాస్త్రంలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. విదే శాల్లో చదువుకోవడానికి దయాళ్ సింగ్ కాలేజ్ ట్రస్ట్ ద్వారా స్కాలర్ షిప్ పొంది, యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లో 1921 లో సైన్స్‌లో డాక్టరే ట్ పొందాడు. భారతదేశానికి తిరిగి వచ్చి, కొత్తగా స్థాపించ బడిన బనా రస్ హిందూ విశ్వవిద్యాలయం లో రసాయన శాస్త్ర ప్రొఫెసర్‌గా చేరా డు. తర్వాత విశ్వ విద్యాలయం లోని ఫిజికల్ కెమిస్ట్రీ ప్రొఫెసర్, యూనివర్సిటీ కెమికల్ లాబొరే టరీస్ డైరెక్టర్‌గా లాహోర్‌కు మారాడు. మాగ్నెటోకెమిస్ట్రీ, ఫిజిక ల్ కెమిస్ట్రీ ఆఫ్ ఎమల్షన్ రంగాలలో పరిశోధనతో పాటు, అప్లైడ్ కెమిస్ట్రీ లో కూడా గణనీయమైన కృషి చేసాడు. రావల్పిండి ప్రాంతంలో ఒక బ్రిటిష్ కంపెనీ చమురు అన్వేషణా కార్యక్రమం చేపట్టిన రోజుల్లో ఒక సమస్య ఎదురైంది. చమురు ఉన్న ప్రాంతం బురదమయంగా ఉండేది. పైగా డ్రిల్ చేసిన బురద ఉప్పు నీటితో కలిసి గట్టిగా రాయిలాగా మారి, డ్రిల్లింగ్ కు అంతరాయం కలిగించేది. ఒక దశలో పనిపూర్తిగా ఆగిపోయేది. అపుడు కంపెనీవారు భట్నాగర్ ను సలహా కోరారు. భట్నాగర్ ఈ సమస్యను కూలంకషంగా పరిశీలించి అతిసులభ మైన, చవకైన పరిష్కారాన్ని సూచించాడు. డ్రిల్ చేసిన బురదకు జిగురు కలపమని సలహా ఇచ్చా డు. జిగురు కలిపిన బురదకు స్నిగ్ధత తక్కువై గట్టిపడకుండా ఉండటంతో బ్రిటీష్ కంపెనీ కొన్ని లక్షల రూపాయల నష్టం నుండి బయట పడింది. వెంటనే కంపెనీ వారు ఆయనకు లక్షాయాభై వేల రూపాయలు బహుకరించారు. ఆ సొమ్మును లాహెరు యూనివర్శిటీకి చమురు పరిశోధనల కోసం విరాళంగా ఇచ్చాడు. భట్నాగర్ చమురు పరిశోధనా భివృద్ధికి ఎంతో కృషి చేశాడు. మైనాన్ని వాసన లేకుండా ఎలా రూపొందించాలో ఆయన తెలియ చేశాడు. కిరోసిన్ ను శుద్ధి చేయ డం, వెలుగును ఎక్కువ చేయటం, ఆదా చేయడం గురించి భట్నాగర్ విలువైన సమాచారాన్ని అందించా డు. పెట్రోలియం నుండి విడుదల య్యే వ్యర్థ పదార్థాలను చమురు పరిశ్రమలో ఎలా ఉపయోగించాలో పరిశోధించాడు. ఆయన %జూ×=% కు డైరెక్టరయ్యాడు. వ్యర్థ పదార్థాల నుండి ప్లాస్టిక్స్ చేయడం, రబ్బరు వస్తువులను రూపొందించడం వంటి పరిశోధనలను ముమ్మరం చేశాడు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ స్వయం ప్రతిపత్తి సంస్థగా, 28 సెప్టెంబర్ 1942న అమలులోకి వచ్చింది. 1943లో ఆయనను ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ (%ఖీ=చా%) గా ఎన్ను కున్నారు. శాంతి స్వరూప్ భట్నాగర్... హోమీ జహంగీర్ భాభా, ప్రశాంత చంద్ర మహలనోబిస్, విక్రమ్ సారాభాయ్ తదితరులతో పాటు భారతదేశ స్వాతంత్ర్యానంతర శాస్త్ర సాంకేతి క మౌలిక సదుపాయాలు, విధానా ల నిర్మాణంలో గణనీయమైన పాత్ర పోషించాడు. విద్యా మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా మరియు ప్రభుత్వ విద్యా సలహాదారుగా కూడా పని చేశాడు. నేషనల్ రీసెర్చ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (%చీ=ఐజ%) ఆఫ్ ఇండియా స్థాపనలో అతను కీలక పాత్ర పోషించి, దేశంలో ఇండస్ట్రి యల్ రీసెర్చ్ అసోసియేషన్ ఉద్యమానికి నాంది పలికాడు. భట్నాగర్ భారత దేశములో వివిధ ప్రాంతాలలో... సెంట్రల్ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నలాజికల్ ఇన్‌స్టిట్యూట్ మైసూర్ , నేషనల్ కెమికల్ లాబొరేటరీ పూణే , నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ న్యూఢిల్లీ , నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ జంషెడ్‌పూర్ , సెంట్రల్ ఫ్యూయల్ ఇన్‌స్టిట్యూట్ ధన్‌బాద్ వంటి మొత్తం 12 జాతీయ ప్రయోగ శాలలను స్థాపించాడు. నెహ్రూ హయాంలో ప్రభుత్వం నుండి నిధులను సమకూర్చి చమురు పరిశోధనా వనరులను అభివృద్ధి చేశాడు. దేశంలో చమురు వనరు లు, చమురు నిక్షేప స్థావరాలు, అణుఖనిజ పరిశ్రమలు అభివృద్ధి చెందాయంటే అది భట్నాగర్ కృషే ప్రధాన కారణం. భట్నాగర్ 1955 జనవరి 1వ తేదీన మరణించాడు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శాస్త్ర వేత్తలు కనబరిచిన ప్రతిభకు నిదర్శనంగా, ఆయా రంగాలకు వారు అందించిన సేవలకు గుర్తింపు గా ప్రతి ఏటా ఇచ్చే శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులు భారత శాస్త్ర రంగంలో అత్యున్నతమైనదిగా పరిగణిస్తారు. ఈ పురస్కారం మొదటి సారి 1958 లో యివ్వబడి నది. 45 సంవత్సరాల వయసు వరకు, శాస్త్ర మరియు సాంకేతిక రంగాలలో పరిశోధన చేస్తూ ఉంటే ఈ పురస్కారానికి అర్హత పొందు తాడు. ఈ పురస్కారం ఒక పతకం, నగదు బహుమతి 5 లక్షలు అందజేయ బడుతుంది. అదనంగా ఆ పురస్కార గ్రహీత 65 వ సంవత్సరం వరకు ప్రతీ నెలా రూ. 15,000 అందజేయ బడుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# ఇందిరమ్మ ఇళ్ల వైపు.. అందరి చూపు!

ఖమ్మం : నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల జాబితాను మూడు భాగాలు (ఎల్-1, ఎల్-2, ఎల్-3)గా విభజించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు జోరందుకునేలా ప్రణాళికలు రచిస్తోంది. ఎల్-2 జాబితాలోని వారికి రెండు పడక గదుల ఇళ్లు కేటాయించనుంది. ఇల్లు ఉండి దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్-3 జాబితాలో చేర్చింది.

**తొలి విడతలో 4,994 మందికి లబ్ధి**

ప్రజాపాలన కార్యక్రమంతో పాటు ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. ఖమ్మం జిల్లాలో 37,444, భద్రాద్రి జిల్లాలో 32,092 అర్జీలందాయి. ఖమ్మం జిల్లాలో 21 మండలాల్లోని 21 గ్రామాలు, భద్రాద్రి జిల్లాలో 23 మండలాల్లోని 23 గ్రామాల వారీగా ప్రత్యేక జాబితా రూపొందించి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని జనవరి 26న సర్కారు ప్రారంభించింది. సొంతంగా ఇంటి స్థలం కలిగిన వారిని ఎల్-1 జాబితాలో చేర్చింది. వీరందరూ తొలి విడతలో ఇళ్లు నిర్మించుకునేలా సర్కారు చేయూతనందించనుంది. ఇంటి నిర్మాణానికి దశల వారీగా రూ.5లక్షలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తుంది. ఎల్-1 జాబితాలో ఖమ్మం జిల్లాలో 1,017 మంది, భద్రాద్రి జిల్లాలో 3,897 మంది ఉన్నారు.




**820 కుటుంబాలకు రెండు పడక గదుల ఇళ్లు**

గత ప్రభుత్వ హయాంలో నిర్మించి కేటాయించని రెండు పడక గదుల గృహాలను ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు అందించాలని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. సొంతంగా ఇంటి స్థలాలు లేని వారిని ఎల్-2 జాబితాలో చేర్చింది. ఈ జాబితాలో ఖమ్మం జిల్లాలో 244, భద్రాద్రి జిల్లాలో 576 మంది ఉన్నారు. ఖమ్మం జిల్లాలో రెండు పడక గదుల ఇళ్లు 526 పూర్తవగా 655 గృహాలు వివిధ దశల్లో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. భద్రాద్రి జిల్లాలో 2,975 ఇళ్లు పూర్తవగా 890 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన వారికి రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఇంటి నిర్మాణానికి స్థలంతోపాటు రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం అందించనుంది. ఇళ్ల నిర్మాణాలపై వచ్చేవారంలో మేస్త్రీలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించనుంది.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు పూనుకుంటాం. ఎంపిక చేసిన గ్రామాల్లో తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. మార్చి ఆఖరు నాటికి లబ్ధిదారుల ఖాతాల్లో మొదటి దఫా బిల్లు రూ.లక్ష జమవుతుంది. ఎల్-2 జాబితాలోని వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు పడక గదుల ఇళ్లు కేటాయిస్తాం.ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్

# సెస్.. తుస్

కొత్తగూడెం : విజ్ఞాన భాండాగారాలు అరకొర సదుపాయాలు, నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని ప్రజా గ్రంథాలయాల సెస్ పెండింగ్‌లో ఉండటంతో పాటు ప్రభుత్వాలు నిధులు విదల్చటం లేదు. మార్కెట్‌లోకి వస్తున్న వివిధ రకాల అకడమిక్, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, సాంకేతిక వసతులను పాఠకులు, నిరుద్యోగులకు సమకూర్చలన్నా.. సౌకర్యాలు మెరుగుపరచాలన్నా.. సెస్ నిధులే ఆధారం. పంచాయతీలు, పురపాలికలు, కార్పొరేషన్లు.. ప్రజల నుంచి ఇంటిపన్ను వసూలు సమయంలోనే 8 శాతం (అంటే రూపాయిలో 8 పైసలు) లైబ్రరీ సెస్ వసూలు చేస్తాయి. ఇలా వసూలు చేసిన పన్నులను ఎప్పటికప్పుడు గ్రంథాలయాల సంస్థలకు జమ చేయటం లేదు.



**నిరుద్యోగులకు ఇబ్బందులే..**

ప్రస్తుతం రాష్ట్రంలో పోటీ పరీక్షల కాలం నడుస్తోంది. ప్రభుత్వ కొలువు సాధించేందుకు ఎంతో కీలకమైన ఈ దశలో పేద, మధ్యతరగతికి చెందిన నిరుద్యోగులు స్థానిక గ్రంథాలయాల్లోనే ఎక్కువ సమయం గడుపుతుంటారు. అభ్యర్థులు కోరిన పుస్తకాలను కొనేందుకు నిధులు లేని దుస్థితి తలెత్తుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు బాసటగా నిలవాల్సిన గ్రంథాలయాలు వారిలో తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి. ప్రజల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేసే పంచాయతీలు, పురపాలికలు, కార్పొరేషన్లు.. గ్రంథాలయాల అభివృద్ధికి సెస్‌ను క్రమం తప్పకుండా చెల్లించకపోవటం గమనార్హం.

**40 గ్రంథాలయాలు.. రూ.5 కోట్ల బకాయిలు**

ఖమ్మం జిల్లాలో 22, భద్రాద్రి కొత్తగూడెంలో 18 ప్రజా గ్రంథాలయాలు ఉన్నాయి. రోజూ సగటున 3వేల మంది పాఠకులు వస్తుంటారు. అన్ని గ్రంథాలయాల నిర్వహణకు అంటే విద్యుత్తు బిల్లులు, పత్రికలు, పారిశుద్ధ్యం, తాగునీరు, స్వల్ప మరమ్మతులకు నెలకు రూ.లక్షల్లో ఖర్చవుతోంది. గ్రంథాలయాలకు రావాల్సిన సెస్ బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించకపోవటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఖమ్మం జిల్లాలో సెస్ బకాయిలు సుమారు రూ.3.19కోట్లు, భద్రాద్రి జిల్లాలో రూ.1.74కోట్లు పేరుకుపోయాయి. నిధుల లేమితో కొన్నిచోట్ల దాతలపై గ్రంథాలయాలు ఆధారపడాల్సి వస్తోంది.

ప్రస్తుతం అందుబాటులోని అరకొర నిధులతోనే సాధ్యమైనంత వరకు పాఠకులకు ఇబ్బందులు కలగకుండా గ్రంథాలయాలను నిర్వహిస్తున్నాం. సెస్ బకాయిలు చెల్లిస్తే గ్రంథాలయాల్లో అధునాతన సౌకర్యాలు కల్పిస్తాం. నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతాం.అర్జున్, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల గ్రంథాలయాల కార్యదర్శి

# అధిక భారం.. అంతరాయం



భగత్‌నగర్: వేసవిలో విద్యుత్తు వినియోగం పెరిగే అవకాశం ఉండటంతో మెరుగైన సరఫరాకు ట్రాన్స్‌కో, ఉత్తర విద్యుత్తు పంపిణీ (ఎన్‌పీడీసీఎల్) సంస్థలు సిద్ధమవుతున్నాయి. ఈనెల గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 731.78 మెగావాట్లకు చేరుకుంది. ఇదే సమయంలో ఈ నెల 10న 11.255 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం జరిగింది. ఈ లెక్కన నడివేసవి నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈక్రమంలో వినియోగానికి అనుగుణంగా మౌలిక సౌకర్యాలు పెంచడంతోపాటు ఆయా విద్యుత్తు పరికరాల సామర్థ్యాన్ని పెంచుతున్నారు. సరఫరాలో అంతరాయం నివారించడానికి విద్యుత్తు ఉపకేంద్రాలను ఒకదానికొకటి అనుసంధానం చేస్తున్నారు. వీటితోపాటు క్షేత్రస్థాయిలో పంపిణీ చేసే నియంత్రికలకు అనుబంధంగా కొత్తవి ఏర్పాటుచేయడంతోపాటు అవసరమైన చోట వాటి సామర్థ్యం పెంచుతున్నారు.

**50 ఎంవీఏ సామర్థ్యంతో..**

ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో నిర్వహించే 132 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాల్లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచారు. కరీంనగర్‌లో పద్మనగర్‌లోని ఉపకేంద్రంలో 31.5 ఎంవీఏ సామర్థ్యమున్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 50 ఎంవీఏ సామర్థ్యమున్న నియంత్రికను ఏర్పాటు చేశారు. ఇలా హుస్నాబాద్, జగిత్యాల, మెట్‌పల్లి మండలం గోదూరు, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచారు.

**ఆరు కేంద్రాల్లో కొత్తవి..**

ఉమ్మడి జిల్లాలో మెరుగైన, అంతరాయం లేని విద్యుత్తు సరఫరా చేయడానికి మౌలిక సౌకర్యాలు ముమ్మరం చేశారు. దీనికోసం కరీంనగర్ జిల్లాలో ఆరు 33 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాల్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయగా.. 5 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచారు. పలుకారణాలతో విద్యుత్తు సరఫరా నిలిచిపోతే ఇతర ఉపకేంద్రాల నుంచి వాటికి ప్రత్యామ్నాయ మార్గంలో పునరుద్ధరించడానికి కొత్తగా 39 లైన్లను వేసి అనుసంధానం చేశారు. ఫీడర్లపై అధిక భారం పడితే తగ్గించేందుకు 178 నియంత్రికలను ఏర్పాటు చేశారు. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలో శరవేగంగా పనులు జరుగుతున్నాయి.

**యుద్ధప్రాతిపదికన పనులు**

వేసవిలో విద్యుత్తు డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని నగరంతోపాటు గ్రామాల్లో నియంత్రికల సంఖ్య పెంచుతున్నాం. కరీంనగర్‌లో ఒక్కరోజే ఒకటో సెక్షన్‌లో 100కేవీఏ మూడు, 160కేవీఏ 5 నియంత్రికలను ఏర్పాటుచేశాం. పనులు యుద్ధప్రతిపాదికన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. - రమేశ్‌బాబు ఎస్ఈ, కరీంనగర్ సర్కిల్

# రహదారుల విస్తరణ.. మెరుగవనున్న రవాణా



గోదావరిఖని: ఉమ్మడి జిల్లాలో రవాణా వ్యవస్థ మెరుగుకు అడుగులు పడుతున్నాయి.. నలువైపులా జాతీయ రహదారుల విస్తరణ పనులు సాగుతున్నాయి.. మరోవైపు నాలుగు కొత్తవాటికి ప్రతిపాదనలు వెళ్లాయి.

**మంచిర్యాల-వరంగల్ (ఎన్‌హెచ్ 163)**

ఈ హరిత జాతీయ రహదారి పెద్దపల్లి జిల్లాలోని మంథని, రామగిరి, ముత్తారం మండలాల మీదుగా సాగుతుంది. మూడు ప్యాకేజీల కింద చేపట్టే పనులను మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ గ్రామం నుంచి మొదలు పెట్టి జిల్లాలోని మంథని మండలం పుట్టపాక, రామగిరి, ముత్తారం మండలాల్లోని 16 గ్రామాల మీదుగా 39.96 కిలోమీటర్ల మేర సాగుతుంది. ప్రస్తుతం భూసేకరణ పనులు సాగుతున్నాయి. రహదారి నిర్మాణం కోసం ప్రాథమిక పనులు జరుగుతున్నాయి. భూసేకరణ కోసం రూ.94 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.71 కోట్ల పరిహారం చెల్లించారు.

**ఎల్కతుర్తి- సిద్దిపేట (ఎన్ 765డిజి)**

ఈ జాతీయ రహదారి ఉమ్మడి జిల్లాలో 133 కిలోమీటర్లు విస్తరించనుంది. భూసేకరణ పూర్తయింది. రెండు ప్యాకేజీల్లో చేపడుతున్న పనులు ఉమ్మడి జిల్లాలోని ఎల్కతుర్తి, ములుకనూరు, భీమదేవరపల్లి, కొత్తపల్లి, మంగళపల్లి, రాంనగర్‌ల మీదుగా నాలుగు వరుసల రహదారి నిర్మాణం పనులు సాగుతున్నాయి. ఈ రహదారికి కేంద్ర ప్రభుత్వం రూ.1,458 కోట్లు కేటాయించింది. రహదారి విస్తరణలో 25 కల్వర్టులు నిర్మించనున్నారు.

జగిత్యాల-కరీంనగర్-వరంగల్ (ఎన్‌హెచ్ 563)

ఈ జాతీయ రహదారి ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, కరీంనగర్ మీదుగా వరంగల్ చేరుకుంటుంది. దీన్ని రెండు ప్యాకేజీలుగా విభజించారు. కరీంనగర్ నుంచి వరంగల్, జగిత్యాల నుంచి కరీంనగర్ వరకు రెండు విభాగాలుగా పనులు చేపడుతున్నారు.

కరీంనగర్ నుంచి వరంగల్ వరకు రహదారి విస్తరణకు కేంద్రం రూ.2,146 కోట్లు కేటాయించింది.

ఇప్పటికే 325 హెక్టార్ల భూమిని సేకరించారు.

కరీంనగర్ నుంచి మానకొండూర్, శంకరపట్నం, హుజూరాబాద్, ఎల్కతుర్తి మీదుగా 68 కిలోమీటర్లు నాలుగు వరుసల రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

జగిత్యాల నుంచి కరీంనగర్ వరకు రహదారి నిర్మాణానికి రూ.2,223 కోట్లు కేటాయించారు.

భూసేకరణ ప్రక్రియ పూర్తయింది.

రహదారి నిర్మాణానికి టెండర్ ప్రక్రియ చేపట్టారు.

ఆర్మూర్- జగ్దల్‌పూర్ (ఎన్‌హెచ్ 63)

ఈ రహదారి ఉమ్మడి జిల్లాలో 69 కిలోమీటర్లు సాగుతుంది. మెట్‌పల్లి, కోరుట్ల, మేడిపల్లి, జగిత్యాల, బుగ్గారం, ధర్మపురి, వెల్గటూరు మండలాల్లోని 28 గ్రామాల మీదుగా మంచిర్యాల జిల్లాకు చేరుకుంటుంది. మెట్‌పల్లి నుంచి రాయపట్నం వరకు 224 హెక్టార్ల భూసేకరణ చేపట్టారు. రహదారి నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తయింది. పరిహారం విషయంలో కొన్ని చోట్ల భూసేకరణ సమస్యలు తలెత్తాయి. అవి పూర్తి కాగానే పనులు చేపట్టనున్నారు.


విస్తరణకు ప్రతిపాదనలు ఇవి..

సిద్దిపేట నుంచి సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల వరకు 65 కిలోమీటర్లు.

జగిత్యాల - పెద్దపల్లి- మంథని- కాటారం 130 కిలోమీటర్లు.

కరీంనగర్- వేములవాడ- సిరిసిల్ల మీదుగా కామారెడ్డి 165 కిలోమీటర్లు.కరీంనగర్ నుంచి రాయపట్నం వరకు 60 కిలోమీటర్లు.

# ప్రభుత్వ భూముల్లోకి చొరబాట్లు



కరీంనగర్ : జగిత్యాల సమీపంలోని ప్రధాన రహదారికి ఆనుకొని కూతవేటు దూరంలో ఉన్న సర్వే నంబరు 437లోని ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా కొందరు చొరబడ్డారు. అసలు పట్టాదారుల వలే అందినకాడికి భూమిని వారి పేరిట రాయించుకున్నారు. ఇదే స్థలంలోని ఆక్రమణల తీరుని బట్టబయలు చేయాలని పలు ఆధారాలతో సహా జిల్లా కలెక్టరుకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. మొత్తం విస్తీర్ణం దాదాపు 378 ఎకరాలు కాగా 77 ఎకరాల వరకు పలువురు పేదలకు అసైన్డ్ చేశారు. ఇది పోనూ మిగులు భూమిలో దర్జాగా అక్రమార్కులకు పట్టాలు పుట్టుకొచ్చాయి. ఏకంగా కొందరు ప్రజాప్రతినిధుల సంబంధీకులు ఈ భూముల్లో కొంత విస్తీర్ణాన్ని తమపేరిట మార్చుకున్నారు. ఈ విషయాన్ని ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన రెవెన్యూ అధికారులు కూడా ధ్రువీకరించారు. నోటీసులు అందించి ఆక్రమిత స్థలాన్ని తిరిగి స్వాధీనపర్చుకునే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

**అనధికారికంగా ఎక్కువే..!**

అధికారుల లెక్కల ప్రకారం 957 ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఆక్రమణల్లో ఉంది. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఇందుకు రెండు, మూడింతల భూమి ఇతరుల చెరల్లోకి చేరిపోయింది. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో చాలా చోట్ల రెవెన్యూ సిబ్బంది ఆక్రమిత స్థలాల విషయంలో నిర్లక్ష్యాన్ని చూపించారనే విమర్శలున్నాయి. దీంతో ప్రభుత్వ భూమి సర్వేనంబరులో బైనంబర్లతో కొత్త పట్టాలు పలుచోట్ల పుట్టుకొచ్చాయి. రికార్డుల్లో పట్టాభూమి విస్తీర్ణానికి అదనంగా పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కలుపుకొని రికార్డులను తారుమారు చేసిన ఉదంతాలున్నాయి. దీంతో వేలాది ఎకరాల విషయంలో సరైన పర్యవేక్షణ లేదు. కనీసం ఎక్కడ ఏ ప్రభుత్వ స్థలం ఉందనే విషయమై కూడా హద్దులు, సూచికల్ని చాలాచోట్ల ఏర్పాటు చేయలేదు.

**స్పందించి.. రక్షిస్తేనే..!** ప్రజావాణితోపాటు జిల్లాపాలనాధికారికి వివిధ సందర్భంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్న తీరుపై ఆయా గ్రామాల నుంచి పలు విన్నపాలు అందుతున్నాయి. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి స్థలాన్ని సంరక్షించే చర్యలు తీసుకుంటే బాగుంటుంది. కానీ సకాలంలో స్పందించకపోవడంతో భూమి విషయంలో వివాదం ఇంతకింతకు పెరుగుతోంది. కొన్ని కబ్జాల విషయంలో గతంలో పనిచేసిన రెవెన్యూ సిబ్బంది సహకారాలు సంపూర్ణంగా అందినట్లు ఉన్నతాధికారులు గతంలో చేపట్టిన విచారణల్లోనూ బయటపడ్డాయి. ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకుంటూ ఉన్న భూమిని కాపాడుకునే దిశగా యంత్రాంగం చొరవచూపించాల్సిన అవసరముంది. హద్దులు గుర్తించే వీలుగా ఇది ప్రభుత్వ భూమి అనే హెచ్చరిక సూచికలను ఏర్పాటుచేయాలి.

# భద్రాచలం ఆలయ అన్నదాన సత్రం ఎదుట స్థలం స్వాధీనం

భద్రాచలం : భద్రాచలం రామాలయానికి సమీపంలో అన్నదాన సత్రం ముందు వైపు ఉన్న స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. విస్తా కాంప్లెక్స్‌కు ఆనుకుని శిల్పినగర్ కాలనీకి సమీపంలోని ఈ ప్రదేశంలో రెవెన్యూ అధికారులు బోర్డులను ఏర్పాటు చేశారు. 124/3/పి సర్వే నంబరులో 6.98 ఎకరాల స్థలం ప్రభుత్వానిదిగా పేర్కొన్నారు. రూ.కోట్ల విలువైన ఈ స్థలం ప్రభుత్వానికి చెందిందేనని హైదరాబాద్ లోని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) తీర్పునిచ్చిందని ఆర్డీఓ దామోదర్‌రావు తెలిపారు.



సుదీర్ఘ న్యాయపోరాటం.. 6.98 ఎకరాల విస్తీర్ణంలో ఖాళీ స్థలంతోపాటు పలు దుకాణాలు, అద్దె గదులు ఉన్నాయి. ఇందులో అన్నపూర్ణ రామలింగేశ్వర స్వామి ఆలయం, శ్రీగురు గోవింద స్వామి మఠం ఉంది. కాపా రామలక్ష్మమ్మ సేవా సమితి తరఫున వీటిని కొందరు నిర్వహిస్తున్నారు. సుదీర్ఘ కాలం నుంచి ఈ స్థలంపై ఇరు వర్గాలు న్యాయ పోరాటం సాగిస్తుండగా సీసీఎల్‌ఏ తీర్పును రెవెన్యూ అధికారులు స్వాగతిస్తున్నారు. దీనిపై కాపా రామలక్ష్మమ్మ సేవా సమితి నిర్వాహకులు మాట్లాడుతూ సీసీఎల్‌ఏ తీర్పును తాము సవాల్ చేయగా యథాతథ స్థితి కొనసాగించేందుకు సోమవారం స్టేటస్ కో వచ్చిందని పేర్కొంటున్నారు.

# పట్టు తప్పింది

ఉట్నూరు : నీటి వనరులు తక్కువగా ఉన్న ఆదివాసీ గిరిజన రైతులకు ఏడాది పొడవునా జీవనోపాధి కల్పించాలనే సదాశయంతో ఉట్నూరులో పట్టు పరిశ్రమను గతంలో ఏర్పాటు చేశారు. పట్టు పురుగులు పెంపకం, గూళ్ల ఉత్పత్తి, మల్బరీ, దసలి సాగు, పట్టుదారం తీయడం, టస్సర్ వస్త్రాలు నేయడం వంటి యూనిట్లను నెలకొల్పారు. ఆదాయంతోపాటు గిరిజనులకు ఆర్థికంగా ఊతమివ్వాలన్న సర్కారు ఆశయం బాగానే ఉన్నా నిధులు, నియామకాల సమస్యతో పరిశ్రమ కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికే అన్ని యూనిట్లలో ఉత్పత్తి నిలిచిపోయి పరిశ్రమ మూతపడే దిశలో ఉంది. ఉట్నూరులో 1983 సంవత్సరంలో అప్పటి సర్కారు పట్టు పరిశ్రమను ఏర్పాటు చేసింది. పట్టు పురుగుల పెంపకం, గూళ్ల ఉత్పత్తి, మల్బరీ, దసలి సాగు, పట్టుదారం తీయడం, టస్సర్ వస్త్రాలను నేయడం వంటి యూనిట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. పట్టు పరిశ్రమశాఖ సహాయ సంచాలకులు(ఏడీ), పట్టు పరిశ్రమ అధికారి(ఏవో), సహాయ అధికారులు, సిబ్బంది, పరిశ్రమలో పని చేయడానికి కార్మికులను నియమించారు.

**ఒక్కొక్కరుగా బదిలీ..**

తొలుత పట్టు పరిశ్రమ సహాయ సంచాలకులు(ఏడీ) అధికారి పోస్టును తొలగించింది. ఆ తర్వాత పట్టు పరిశ్రమ అధికారి(ఎస్‌వో)ను బదిలీ చేసింది. ఇక్కడ పని చేసిన సహాయ అధికారులు, సిబ్బంది ఒకొక్కరు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లినా వారి స్థానంలో కొత్తవారిని నియమించలేదు. ఒక్కో యూనిట్ బాధ్యతలు నిర్వహించేవారు లేక మూతపడింది. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా పట్టు పరిశ్రమశాఖ ఏడీ పార్వతిని ఇక్కడ ఇన్‌ఛార్జి అధికారిగా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆమె ఒక్కరే ఉన్నారు. మిగతా సిబ్బంది లేక పరిశ్రమలోని యూనిట్లు మూగబోయాయి. ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు తగ్గిపోయింది. ఆదివాసీ గిరిజన రైతులకు ఉపాధి కల్పించే పట్టు పరిశ్రమ మూతపడే దశలో ఉన్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు స్పందించి పరిశ్రమను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**గతమెంతో ఘనం..**

పట్టు పరిశ్రమశాఖ సహాయ సంచాలకులు(ఏడీ) పర్యవేక్షణలో గతంలో పట్టు పరిశ్రమ మూడు పువ్వులు ఆరు కాయలుగా విరసిల్లింది. అధికారులు, సిబ్బందిని నియమించడంతోపాటు ఉచిత శిక్షణ, రాయితీపై పరికరాలను అందించేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసేది. మల్బరీ, దసలి సాగు చేస్తున్న రైతులకు ఐటీడీఏ ద్వారా రాయితీపై బిందు సేద్యం పరికరాలు, మొక్కలు అందజేస్తూ ప్రోత్సహించేవారు. పట్టు పురుగులు పెంచి గూళ్ల ఉత్పత్తి చేసే వారికి ప్రోత్సాహకాలు అందించేవారు. ఉట్నూరులోని కుమురంభీం ప్రాంగంలో ఏర్పాటు చేసిన యూనిట్‌తో దసలి పట్టు వస్త్రాలు నేస్తూ ఉపాధి పొందేవారు.

# ఎరువు తయారీ ఏదీ?

ఆదిలాబాద్ : నివాస గృహాల్లోని సెప్టిక్ ట్యాంకుల్లోంచి సేకరించిన మానవ విసర్జితాలను ఊరి బయట ఎక్కడపడితే అక్కడ పడేయడంతో పర్యావరణానికి హాని కలుగుతోంది. ఇటు పరిసర ప్రాంతాల్లో దుర్వాసనతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలను దూరం చేయడంతోపాటు ఎరువుగా మార్చి పొలాలు, మొక్కల పెంపకానికి సరఫరా చేసి ఆదాయం వచ్చేలా గత ప్రభుత్వం పురపాలక సంఘాల్లో మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆదిలాబాద్ పట్టణ శివారులోని బంగారుగూడ చెత్త డంపింగ్‌యార్డులో పక్కనే కొంత స్థలంలో రూ.2.56 కోట్లు వెచ్చించి యంత్రంను ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య వనరుల ఉద్యానవనం పేరిట ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ప్లాంటు తొలుత విద్యుత్తు సరఫరా లేక నాలుగేళ్లు నిరుపయోగంగా ఉండటంతో అప్పటికే పరికరాలు పాడవుతున్నాయి.

**నాలుగేళ్ల కిందట ప్రారంభించినా..**

నాలుగేళ్ల కిందట 2021 ఆగస్టులో యంత్రం పని ప్రారంభించినా అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. మలాన్ని, నీటిని వేరు చేయడంతోపాటు ఆ నీటిని మొక్కలకు వినియోగించాలనేది ఉద్దేశం. శుద్ధి చేసిన మలాన్ని అక్కడే 15 రోజులపాటు ఎండబెట్టేందుకు ప్రత్యేకంగా సోలార్ విద్యుత్తు ఉన్న షెడ్డు సౌకర్యం కల్పించారు. నీటిని శుద్ధి చేసేందుకు ప్రత్యేక యంత్రం అందుబాటులో ఉంది. ఆ వ్యర్థాలు పూర్తిగా ఎండిన తరువాత పొడి చేసి పంట చేన్లకు ఎరువులను సరఫరా చేయాలనేది లక్ష్యం. కానీ ఆచరణలో కనిపించడం లేదు.

**ఒక్కరైతుకూ అందని ఎరువు**

2 వేల లీటర్ల సామర్థ్యం ఉండే ట్యాంకులు ప్రతి రోజు నాలుగు చొప్పున వస్తే ఎరువుల తయారీకి సులువుగా ఉంటుంది. వారానికి రెండు మూడు ట్యాంకులు మాత్రమే వస్తుండటం, పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో ఆశించిన రీతిలో ఎరువు తయారు కావడం లేదు. ఇప్పటి వరకు ఒక్క రైతుకు ఎరువు ఇచ్చిన దాఖలాలు లేవు. ఆదాయం దేవుడికెరుక. పైగా విద్యుత్తు బిల్లు రూపేణా పురపాలికపైనే భారం పడుతోంది. హైటెన్షన్ విద్యుత్తు సరఫరా ఉండటంతో నెలకు రూ.లక్షపైనే విద్యుత్తు బిల్లు తడిసి మోపెడవుతోంది. ఇవన్నీ చూస్తే అసలు యంత్రం ఎందుకని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

చురకలు



## అడుగంటుతున్న భూగర్భ జలాలు

కరీంనగర్ : జిల్లాలో భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతోంది. నెల వ్యవధిలోనే సుమారు మీటరు లోతుకు భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. జనవరి నెలాఖరులోనే ఈ పరిస్థితి ఉంటే రాబోయే రెండు నెలల్లో మరింత లోతుకు వెళ్తుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. మార్చి నాటికి జిల్లాలోని పలు మండలాల్లో నాలుగు మీటర్ల వరకు పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. వ్యవసాయ, బోరుబావులు ఎండిపోయి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని భూగర్భ జల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల ద్వారా పంటలకు నీరందిస్తుండడంతో ప్రస్తుతం పంటలు ఎండిపోయే పరిస్థితి లేదు. లేకపోతే ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటి పంటలు



ఎండిపోయే ప్రమాదం ఉండేది.

జిల్లాలోని 16 మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఫిజియోమీటర్లు ద్వారా ప్రతి నెలా నీటి మట్టాన్ని అధికారులు కొలుస్తున్నారు. 2024 జనవరిలో జిల్లా సగటు భూగర్భజల మట్టం 6.64 మీటర్లు ఉండగా, 2025లో 7.01 మీటర్లు ఉంది.

2024 డిసెంబరు నెలతో పోల్చితే గంగాధర, వీణవంక, కేశవపట్నం, మానకొండూరు మండలాల్లో నీటి మట్టం పైకి రాగా మిగతా అన్ని మండలాల్లో నీటి మట్టం తగ్గిపోయింది. సాగునీటి ప్రాజెక్టుల ఆధారంగా ఈ మండలాల్లో నీటిమట్టం పైకి వచ్చింది.

అందరూ వరిపంట వేసి బోర్లు, బావుల ద్వారా నీటిని తోడేస్తుండడంతో నీరు వేగంగా అడుగంటుతోందని భూగర్భ జలశాఖ అధికారులు చెబుతున్నారు. రాబోయే రెండు నెలల్లో మరింత పడిపోయే ప్రమాదం ఉండగా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

## చూపిన స్థలంలో నిర్మించాల్సిందే..!

నల్గొండ : పేదలకు ప్రభుత్వ సాయంతో నిర్మించే ఇళ్లకు తొలిసారి జియో ఫెన్సింగ్ చేయనున్నారు. దీనికోసం కృతిమ మేధ సాయంతో ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేశారు. ఇందిరమ్మ ఇళ్లతో దీన్ని అమల్లోకి తేనున్నారు. 2013లో రాష్ట్రంలో జియో ట్యాగింగ్ విధానాన్ని అమలు చేయడానికి అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించినా అమలు కాలేదు. ఈసారి ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలు జరిగినట్లు తేలితే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులు ఇవ్వబోమని కేంద్రం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వంజియో ఫెన్సింగ్ విధానం అమలుకు నిర్ణయం తీసుకుంది.

**తేడా వస్తే రద్దు..**మొదటి విడతలో సొంతంగా ఇంటి జాగా ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవల సర్వేచేసిన అధికారులు సొంత జాగా ఉన్న నిరుపేదలతో కూడిన ఎల్1 జాబితాను సిద్ధం చేశారు. ఇళ్లు కట్టే స్థలాన్ని సర్వే సమయంలోనే చూపారు. ఇప్పుడా స్థలం జియో ఫెన్సింగ్ చేయనున్నారు. ఆ స్థలంలోనే ఇంటి నిర్మాణానికి ముగ్గు పోయాల్సి ఉంటుంది. ముగ్గు పోసే రోజు గ్రామ కార్యదర్శికి, వార్డు అధికారికి సమాచారం ఇవ్వాలి. సర్వేలో చూపిన స్థలం అదేనా కాదా అని వారు ధ్రువీకరించాలి. తర్వాతే ప్రత్యేక యాప్‌లో స్థలం వివరాలు, అక్షాంశ, రేఖాంశాల వివరాలతో జియో ఫెన్సింగ్ చేస్తారు. తర్వాత తనిఖీకి వచ్చినప్పుడు ఆ స్థలం వద్ద నిల్చొని యాప్ ద్వారా పరిశీలిస్తారు. గతంలో ఇచ్చిన వివరాలు మ్యాచ్ అయితేనే ఫొటోలు, వివరాలు అప్‌లోడ్ అవుతాయి. ఏమాత్రం తప్పుడు సమాచారం ఉన్నా యాప్ తిరస్కరిస్తుంది.

**ఉమ్మడి జిల్లాకు 42 వేలు**

ఒక్కో నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలో 42 వేల ఇళ్లు మంజూరు కానున్నాయి. ఎమ్మెల్సీ కోడ్ జిల్లాలో అమల్లో ఉన్నందున ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టేందుకు ఇంకో 20 రోజులు పడుతుంది. ఇక ఎల్1 జాబితా ఇన్‌ఛార్జి మంత్రి అనుమతితో ఆమోదించనుండటంతో స్థానిక ఎమ్మెల్యేలే కీలక పాత్ర పోషించనున్నారు. **పాత ఇళ్లను చూపితే అంతే సంగతి**

గతంలో ఇందిరమ్మ ఇళ్లలో చాలా అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలున్నాయి. ఒక స్థలంలో చూపించి మరో స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడం.. పాత ఇళ్లకే రంగులు వేసి కొత్తవిగా చూపించి బిల్లులు తీసుకోవడం.. బేస్‌మెంట్ లెవల్‌లో మొదటి బిల్లు ఉపాధి నిధుల నుంచి కావడంతో అందినకాడికి దోచుకున్నారు. ఇకపై అలాంటి వాటికి అవకాశం ఉండదు.

## చివరికి మేతగా..

భువనగిరి : 'మూగజీవాలు మేస్తున్నది గడ్డి కాదు.. ఎండిన వరి పొలం.. సంస్థాన్ నారాయణపురం మండలం తుంబాయితండాకు చెందిన జర్పుల రఘు రెండెకరాల్లో రూ.60 వేల పెట్టుబడి పెట్టి వరి సాగుచేశారు. బోరుబావి ఇంకిపోయింది. వేసిన పొలం ఎండిపోయింది. దిక్కుతోచని పరిస్థితుల్లో ఎండిన పొలాలన్నీ పశుగ్రాసం కోసం రూ.5 వేలకు విక్రయించారు. మార్చి రానేలేదు.. ఎండల తీవ్రత పెరుగుతోంది. భూగర్భ జలం శరవేగంగా అడుగంటుతోంది. బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. చేతికి అందాల్సిన పంటచేలు ఎండిపోతున్నాయి. పంటలు వేసిన రైతన్నల పరిస్థితి దైన్యంగా మారింది. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 2,75,316 ఎకరాల్లో సాగు చేశారు. దాదాపు లక్ష ఎకరాలకు సాగునీటి గండం పొంచి ఉందని అధికారులు అంచనా వేస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత యాసంగి సీజన్‌తో పోల్చుకుంటే ఈసారి వరిసాగు 17,976 ఎకరాల్లో తగ్గింది. నారాయణపురం మండలంలో మరీ దైన్యస్థితి నెలకొంది. గతేడాది కంటే వరిసాగు విస్తీర్ణం సగానికి తగ్గగా.. వేసిన పంట కాస్తా నీళ్లు అందక ఎండిపోతోంది. తుంబాయి తండా, వాచ్యతండా, శేరిగూడెం, జనగామ, వాయిల్లపల్లితో సహా పలుగ్రామాల్లో పంటలు ఎండిపోయియి. గుండాల మండలం బండ కొత్తపల్లి, వస్తకొండూరు, పెద్ద పాడిశాల గ్రామాల్లో, ఆత్మకూర్(ఎం) మండలంలో ఇదే పరిస్థితి నెలకొంది.గేదెలు మేపుతున్నా నాకున్న రెండున్నర ఎకరాల్లో యాసంగికి రూ.60 వేల పెట్టుబడితో వరి సాగుచేశా. పదిహేను రోజుల కిందట బోరు బావి పూర్తిగా వట్టిపోయింది. బావిలో ఊరిన నీరు 40 నిమిషాలు పంపు పోస్తుంది

# దోమల చెరువులు!



హైదరాబాద్: చేపలను సాగు చేసే తటాకాలను చేపల చెరువులని అంటారు. అలాగే.. దోమలతో నిండిన గ్రేటర్‌లోని జలవనరులను దోమల చెరువులుగా పిలవడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తటాకాల్లో గుర్రపుడెక్కను పెంచుతూ.. వాటి కింద దోమలను ఉత్పత్తి చేస్తున్నారని జీహెచ్ఎంసీ అధికారులపై విమర్శలొస్తున్నాయి. ఏడాదిగా బల్దియా యంత్రాంగం చెరువులను గాలికొదిలేసింది. గుర్రపుడెక్క తొలగింపు పనులు ఆపేసింది. మొక్కుబడిగా అంచుల్లోని మొక్కలను మాత్రమే తొలగిస్తోంది. దాంతో.. ఆర్.సి.పురం, మల్కాజిగిరి, బండ్లగూడ, మీరాలం, కాప్రా, తదితర చెరువుల్లో ఆ మొక్క వేళ్లూనుకుపోయింది. దోమలు భారీగా వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రం కాగానే.. చుట్టుపక్కల జనావాసాలపై దాడి చేస్తున్నాయి. కాలనీవాసులకు నిద్ర పట్టనివ్వట్లేదు.

సుందరీకరణ పేరుతో రామచంద్రాపురం చెరువుపె రూ.కోట్లు వెచ్చించినా పరిస్థితిలో మార్పు లేదు. మురుగుతో నిండిన చెరువును గుర్రపుడెక్క కప్పేసింది.

మల్కాజిగిరి బండ చెరువులో 70శాతం గుర్రపుడెక్క పేరుకుపోయింది. కాప్రా పెద్దచెరువు మురుగు కూపంలా మారింది. రూ.కోట్లు వెచ్చించి, అభివృద్ధి పనులను మధ్యలో నిలిపేయడం, డెక్కను అలాగే వదిలేయడంతో పరిస్థితి దారుణంగా మారింది.

ఉప్పల్ నల్లచెరువు, సరూర్‌నగర్ పెద్దచెరువు, పాతబస్తీలోని మీరాలం, తదితర జలవనరుల్లోనూ భారీగా డెక్క విస్తరించింది. మైసమ్మచెరువు, కామునిచెరువు, హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ పక్కనున్న ముల్లకత్వ చెరువులు పచ్చని మైదానాలుగా మారాయి.

**ఆరు నెలలుగా అదనపు బాధ్యతలు..**

ఆరోగ్య విభాగం అదనపు కమిషనర్‌కు చీఫ్ ఎంటమాలజిస్టు బాధ్యతను అప్పగించడంతో.. 6 నెలలుగా పూర్తి స్థాయి చీఫ్ ఎంటమాలజిస్టు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. జోన్లవారీగా దోమల నియంత్రణ చర్యలు, సమీక్షలు, తనిఖీలు, కొత్త విధానాలను అమలు చేయడంలో లోపాలు తలెత్తుతున్నాయి.

**నిలిచిన నివారణ చర్యలు..**

గుర్రపుడెక్కను తొలగించేందుకు కొన్నేళ్లుగా జీహెచ్ఎంసీ ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్లు(ఎఫ్‌టీసీ) అని పిలిచే యంత్రాలను ఉపయోగిస్తోంది. ఆరునెలల క్రితం వాటి పని కాలం పూర్తయింది. మళ్లీ టెండరు పిలిచేందుకు ఆసక్తి చూపట్లేదు.డ్రోన్లతో చెరువుల్లోని గుర్రపుడెక్కను అంతం చేసే పనులు కూడా నిలిచిపోయాయి. అవకతవకలు జరుగతున్నాయనే ఉద్దేశంతో.. ప్రక్రియను పూర్తిగా అటకెక్కించారు. ఇంటింటికీ తిరిగి దోమల మందును పిచికారి చేసే ఏఎల్ఓ(యాంటీ లార్వా ఆపరేషన్స్) కార్యక్రమాలు, ఫాగింగ్ మొక్కుబడిగా మారాయి.

# సంపదలో 'భాగ్య'నగరమే



హైదరాబాద్ : హైదరాబాద్ సంపదలో భాగ్యనగరమే. రాష్ట్రంలోని బ్యాంకు డిపాజిట్లలో నగంపైగా డిపాజిట్లు హైదరాబాద్‌లోనే ఉండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా 2024-2025 మొదటి త్రైమాసికంలో బ్యాంకుల్లో 7.69 లక్షల కోట్ల రూపాయల డిపాజిట్లు ఉండగా హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోనే రూ.5.18 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. ఇందులో హైదరాబాద్ జిల్లా వాటా రూ.4.62 లక్షల కోట్లు. తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉండగా హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలు తర్వాతిస్థానంలో ఉన్నాయి. జిల్లా స్థూల ఉత్పత్తిలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉండగా హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. రాష్ట్ర ప్రణాళికశాఖ సోమవారం తెలంగాణ రాష్ట్ర గణాంకాల సంకలనం (అట్లాస్)ను విడుదల చేసింది. జనాభా, ఆర్థిక, విద్య సహా వివిధ అంశాలకు సంబంధించిన గణాంకాలను విశ్లేషించింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో తొలి త్రైమాసికంలో రూ.4.63 లక్షల కోట్ల రుణాలు అందజేశారు.

ఎస్సీలు, ఎస్టీలు అత్యల్పంగా ఉన్న జిల్లాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉంది.

హైదరాబాద్ జనసాంద్రత 18,161. రాష్ట్ర సగటు జన సాంద్రత 312 మాత్రమే

కొత్త వాహనాలు: రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అవుతున్న కొత్త వాహనాల్లో 53 శాతం వాహనాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోనే ఉన్నాయి. రాష్ట్రంలో 9,76,073 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా ఇందులో 5,18,375 ఈ మూడు జిల్లాలోనే ఉన్నాయి.

తల్లులకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ హైదరాబాద్‌లో 51.79 శాతం మందికి మాత్రమే అందింది. పిల్లలకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ నమోదు చేసుకున్న వారిలో 60.3 శాతం మందికే అందింది.

జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 9013 కిలోమీటర్ల రోడ్లు ఉండగా ఇందులో 2846 కిలోమీటర్లు బీటీ రోడ్లు, 6167 కిలోమీటర్లు సిమెంట్ కాంక్రీట్ రోడ్లు.

అత్యధిక డొమెస్టిక్ విద్యుత్ కనెక్షన్లు ఉన్న జిల్లా హైదరాబాద్. ఇందులో 79 వ్యవసాయ కనెక్షన్లు ఉండటం గమనార్హం.

రాష్ట్రంలో ఉన్న పాఠశాలల్లో అత్యధికంగా మొదటి మూడు స్థానాల్లో రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి ఉన్నాయి.

రంగారెడ్డిలో 2907 స్కూళ్లు - విద్యార్థులు 7.70 లక్షలు

హైదరాబాద్‌లో 2865 - విద్యార్థులు 9.02 లక్షలు

మేడ్చల్-మల్కాజిగిరి 2070 - విద్యార్థులు 7.67 లక్షలు

# ఇష్టానుసారంగా చెత్త సేకరణ



కరీంనగర్ : జిల్లాలోని పురపాలికలు, నగరపాలక సంస్థల పరిధిలో పారిశుద్ధ్య పనులను మెరుగుపర్చేందుకు ఇంటింటా చెత్త సేకరణ చేస్తున్నారు. వార్డులు, డివిజన్ల వారీగా ప్రతీ ఇంటి నుంచి చెత్త తీసుకెళ్లేందుకు ప్రైవేటు కార్మికులతో స్వచ్ఛ ఆటోలను నడిపిస్తున్నారు. కొన్నింటిని నగర పాలక సంస్థనే డ్రైవర్ కం ఓనర్లుగా ఎంపిక చేసి ఆటోలు అందించింది. ఇక్కడి వరకు బాగానే ఉండగా, క్షేత్రస్థాయిలో వీరి పని తీరు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. అప్పగించిన ఇళ్ల నుంచి ప్రతీ రోజు చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాల్సి ఉండగా కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులు సమయపాలన పాటించడంలేదు. కొన్ని ప్రాంతాల్లో రోజు విడిచి రోజు వచ్చేందుకు నిర్ణయించగా దానిని కూడా అమలు చేయడంలేదు. వారంలో రెండు రోజులు దుమ్మాలు కొట్టడం, వాహనాలు పాడయ్యాయనే రకరకాల కారణాలు చెబుతున్నారు. ఉద్యోగులు, దుకాణాల్లో పని చేసేందుకు వెళ్లిపోయిన తర్వాత రావడం ఆటోలు వస్తుండటంతో చెత్త పేరుకుపోతుందని అంటున్నారు.

తడి, పొడి వేర్వేరుగా సేకరించాలని పలుమార్లు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాలు ఇస్తుండగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. డంపింగ్‌యార్డుకు చెత్త తగ్గించి, పొడి, తడి వేరు చేయాలనే లక్ష్యం సాధ్యం కావడంలేదు. తడి పూర్తిగా రీసోర్స్ పార్కుకు తరలించాలని కోరుతున్నా పట్టింపు లేకుండా పోతుంది.

గత ప్రభుత్వం స్వచ్ఛ ఆటోల విధానం ప్రవేశపెట్టింది. పురపాలికలు, నగరపాలికలతోనే ఆటోలు ఇప్పించి ఇంటింటా యూజర్ వసూలు చేసుకోవాలని నిర్ణయించింది. ఆటోలు రాని వారు కూడా సొంతంగా కొనుగోలు చేసి కార్పొరేటర్ల పైరవీలతో ఏర్పాటు చేసుకున్నారు. వీరికి 500 ఇళ్లను అప్పగించి చెత్త సేకరణ చేపట్టారు. ఒక్కో ఇంటికి రూ.50 తీసుకోవాల్సి ఉండగా, లెక్క లేకుండా నోటికి వచ్చినట్లు, రెండు, మూడు నెలలకు ఒకసారి పెంచుకుంటూ పోతున్నారు.

స్వచ్ఛ ఆటో కార్మికులు గత పదేళ్లుగా ఒకే డివిజన్‌లో పని చేస్తుండటంతో ఇంటి యజమానులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలున్నాయి. పైగా జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అంటే భయం లేకుండా పోయింది. తాజాగా వార్డు అధికారులు ఉండగా వీరి ఆదేశాలు కూడా బేఖాతారు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వీరికీ డివిజన్లు మార్చితే చెత్త సేకరణలో మార్పునకు అవకాశముంది.

ఆదేశాలు జారీ చేశాం

స్వచ్ఛ ఆటో కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి చెత్త సేకరణపై పలు ఆదేశాలు జారీ చేశాం. ఫిర్యాదులు వస్తే వారినీ తొలగిస్తాం.

- కె.వేణుమాధవ్, సహాయ కమిషనర్, నగరపాలిక

## వ్యవసాయ బావులవైపు.. అన్నదాత చూపు

కోనరావుపేట: జిల్లాలో మూడేళ్లుగా ఆశించిన వర్షపాతం నమోదైంది. వనరుల్లో పుష్కలంగా నీరుండటంతో భూగర్భ జలాల లభ్యత ఆశాజనకంగా ఉంది. పలు ప్రాంతాల్లో రైతులు బోర్లు వేయడం కంటే బావుల తవ్వకంపైనే ఆసక్తి కనబరుస్తున్నారు. నూతన సాంకేతికతను సద్వినియోగం చేసుకుని యంత్రాల ద్వారా వ్యవసాయ బావులను ఏర్పాటు చేసుకుంటున్నారు. పూడికతీతకు సైతం యంత్రాలను వినియోగిస్తున్నారు.

అధిక విస్తీర్ణంలో వరి సాగు



రాజన్న సిరిసిల్ల జిల్లా మెట్ట ప్రాంతం. యాసంగిలో అత్యధిక విస్తీర్ణంలో వరిపంటను సాగుచేశారు. అన్ని రకాల పంటలు కొలుపుకొని మొత్తం 1,77,004.5 ఎకరాల్లో సాగవగా అందులో సుమారు 1.75 లక్షల ఎకరాల్లో వరిపంటను వేశారు. నీటి లభ్యత ఆధారంగా చెరువులు, కుంటలు, పంపుసెట్ల ద్వారా వరిసాగు చేస్తుంటారు. భూగర్భ జలాలు కొంతమేర ఆశాజనకంగా మారటంతో వరి సాగుచేసిన రైతులు దాదాపుగా బావులపైనే నీటికోసం ఆధారపడుతున్నారు. పలుచోట్ల కూరగాయలు, మొక్కజొన్న, ఉల్లి, నువ్వులు తదితర పంటలు సాగు చేస్తున్నారు. చాలాచోట్ల బోర్లు వేస్తున్నా ఆశించిన ఫలితం ఉండటం లేదు. వేసిన పంటలను కాపాడుకోవటానికి సాగునీటికోసం రైతులు బావుల తవ్వకంపైనే ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందుకోసం భారీ పొక్లెయిన్లను వినియోగిస్తున్నారు.

**సమయం, డబ్బులు ఆదా**

కూలీలతో వ్యవసాయ బావి తవ్వకం చేపట్టడంతో నెలల తరబడి సమయం వృథాతో పాటు అధిక వ్యయం అవుతోంది. భారీ పొక్లెయిన్‌తో బావుల తవ్వకం చేపడితే నూతన వ్యవసాయ బావికి రూ.1.10 లక్షల నుంచి రూ.1.30 లక్షల వరకు ఖర్చువుతోంది. వ్యవసాయ బావుల ద్వారా వచ్చే నీటి లభ్యత అధికంగా ఉంటోంది. పంటలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయటానికి వీలవుతోంది.

- ఉప్పుల గంగయ్య రైతు సుద్దాల

## ఆయుష్షు పెంచేదెలా..!

నల్గొండ : అల్లోపతి మందులతో నయం కాని రోగాలతో పాటు, ఇతర రోగాల బారిన పడకుండా ఉండేందుకు ప్రకృతి సిద్ధమైన మాత్రలను వాడేవారు ఇటీవల పెరిగిపోతున్నారు. ఆయుష్షు విభాగంలోని ఆయుర్వేద, యునాని, హోమియో, యోగా పద్ధతుల ద్వారా సరఫరా అవుతున్న చికిత్సలు, మాత్రలను వాడుతున్నారు. అయితే వీరికి అనుగుణంగా జిల్లాలో వైద్య సేవలు అందడం లేదు. జిల్లాలోని ఆయుష్షు విభాగం అంధకారంలో కన్పిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 21 డిస్పెన్సరీల ద్వారా సేవలు అందించడానికి ఏర్పాట్లు చేశారు. వాటిలో ఆయుర్వేద-8, హోమియో-6, యునాని-7 ఉన్నాయి. వీటితో పాటు 21 ప్రాంతాల్లో యోగా కేంద్రాలు ఏర్పాటు చేసి 40 మంది యోగా శిక్షకులను ఎంపిక చేశారు. అవగాహన లేకపోవడంతో ఎక్కడా యోగా కేంద్రాలు పూర్తి స్థాయిలో కొనసాగడం లేదు.

**సిబ్బంది ఇలా..**

జిల్లాలో ప్రస్తుతం ఉన్న 21 డిస్పెన్సరీల్లో 11 మంది వైద్యాధికారులు అందుబాటులో ఉన్నారు. మరో పది ప్రాంతాల్లో వైద్యులు లేక ఖాళీ కుర్చీలు కన్పిస్తున్నాయి. ఎనిమిది మంది ఫార్మసిస్టులు మాత్రమే అందుబాటులో ఉండగా 13 ప్రాంతాల్లో ఖాళీగా ఉన్నాయి. ఇందుర్తి, మాడ్గులపల్లి ప్రాంతాల్లో ఉన్న డిస్పెన్సరీలు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

**ఏదీ సమయపాలన..!**

ఆయుష్షు పరిధిలోని డిస్పెన్సరీలు ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు రోగులకు అందుబాటులో ఉండాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న డిస్పెన్సరీలు ఉదయం 10 గంటలకు తెరుచుకొని మధ్యాహ్నం 3 గంటలకే మూసి వేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ఆయుర్వేద, యునాని, హోమియో డిస్పెన్సరీల్లో కింది స్థాయి సిబ్బంది మాత్రమే 12 గంటల వరకు కన్పిస్తున్నారు. వైద్యులు వారానికి రెండు, మూడు రోజులు వస్తున్నారని అది కూడా సమయపాలన పాటించడం లేదని రోగులు వాపోతున్నారు. ఇతర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న డిస్పెన్సరీల పరిస్థితి మరీ దయనీయంగా మారింది.

**సమాచారం తెలుసుకుంటాం**నేను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. జిల్లాకు సంబంధించిన పూర్తి వివరాలు అంతగా తెలియదు. కొద్ది రోజుల్లో పూర్తి వివరాలు తెలుసుకొని అన్నిరకాల సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తాను. సిబ్బంది సమయపాలన పాటించాల్సిందే.

డా.నర్సింహారావు, ఆయుష్షు జిల్లా ఇన్‌ఛార్జి

## హుజూర్‌నగర్ కేంద్రంగా నాసిరకం దందా

మేళ్లచెరువు : హుజూర్‌నగర్, మిర్యాలగూడ కేంద్రంగా నాసిరకం మందుల రాకెట్ నడుస్తుందా.. అంటే అవుననే పరిస్థితి కన్పిస్తోంది. ఈ పట్టణాల నుంచి వివిధ ప్రాంతాలకు ప్రముఖ కంపెనీల పేరుతో నాసిరకం మందులను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాజాగా విజిలెన్స్ అధికారులు జరిపిన తనిఖీలతో ఈ దందా తేటతెల్లం అవుతోంది. విజిలెన్స్ అధికారుల సమాచారం మేరకు హుజూర్‌నగర్, మేళ్లచెరువులలో సోమవారం దాడులు నిర్వహించి ఓ ప్రముఖ కంపెనీ పేరుతో దిగుమతైన పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో సగం వరకు నాసిరకం ఉన్నట్టు కంపెనీ ప్రతినిధులు చెబుతున్న వివరాలను బట్టి తెలుస్తోంది.

దిగుమతి చేసుకుంటున్నారిలా... ప్రముఖ కంపెనీల పేరుతో ఇక్కడ కొందరు వ్యాపారులు పురుగు మందులను ఒక ఆర్డర్ పెడతారు. ఇవి రాగానే వాటిని విప్పి బాక్సల్‌లో ఉన్న కేజీ ప్యాకెట్‌లను కొన్నింటిని తీసి వాటి స్థానంలో నకిలీవి పెట్టి తిరిగి వాటిని రిటైల్ దుకాణదారులకు పంపిస్తూ అమ్మకాలు చేస్తున్నారు. సోమవారం పట్టుబడిన వాటిలో హరియాణాలోని ఒక సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో డీలర్ కొనుగోలు చేసినట్టు ఉంది. ఇలా.. రకరకాల చిరునామాలలో కొనుగోలు చేసినట్టుగా.. నకిలీ మందులు నింపిన ఆ ప్యాకెట్ల బాక్సులను నేరుగా దుకాణం ఉన్న ప్రాంతానికి కాకుండా మరో ప్రాంతంలోని దిగుమతి కొరియర్ కేంద్రాలకు తెప్పించుకుంటున్నారు. తిరిగి వాటిని యథేచ్ఛగా తమ దుకాణాలకు, రైతులకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఇందులో కీలకంగా హుజూర్‌నగర్‌కు చెందిన ఒక డీలర్ ఉన్నట్లు సమాచారం.

## మార్చి నెలలో చర్లపల్లి నుంచి మరిన్ని రైళ్ల పరుగులు

హైదరాబాద్: చర్లపల్లి టెర్మినల్ నుంచి చెన్నై, గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపడానికి పచ్చజెండా ఊపిన దక్షిణమధ్య రైల్వే మార్చిలో మరో ఎనిమిది రైళ్లను ఇక్కడి నుంచి నడపాలని నిర్ణయించింది. అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌పై ఒత్తిడి తగ్గిస్తూ నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. రైలు ప్రయాణాలకు సంబంధించి ముందస్తు రిజర్వేషన్ సమయం 60 రోజులు ఉండటంతో.. గడువు ముగుస్తున్న కొద్దీ రైళ్ల రాకపోకలను చర్లపల్లి మీదుగా సాగించాలని నిర్ణయించింది.

**50వేల మంది రాకపోకలు సాగించేలా...**

సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లలో పెరిగిన రైళ్ల ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి స్టేషన్ విస్తరణ చేపట్టిన సంగతి తెలిసిందే. రోజూ సుమారు 50వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా చర్లపల్లి టెర్మినల్‌ను విస్తరించారు. సరకు రవాణా పార్శిల్ కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. రోజుకు 200కు పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కొన్ని రైళ్ల రాకపోకలను నియంత్రించాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు సుమారు 40శాతం వరకు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబరులోగా మొత్తం పనులు పూర్తి చేసి ప్రారంభించాలని దక్షిణ మధ్య రైల్వే లక్ష్యం నిర్దేశించుకుంది.



రోజూ 2లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న ఈ స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు, నిర్మాణ పనులు చేపట్టడంలో సమతూకం పాటించడంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్ని రైళ్లను చర్లపల్లి నుంచి నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేస్తోంది. సికింద్రాబాద్ స్టేషన్‌లో పది ప్లాట్‌ఫామ్‌లు ఉండగా.. రెండు ప్లాట్‌ఫామ్‌ల చొప్పున దఫదఫాలుగా పనులు పూర్తి చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో తెలిపారు. ఈ మేరకే చర్లపల్లి నుంచి రైళ్లను నడపడం, హాల్టింగ్ తదితర అంశాలను నిర్ణయించనున్నట్టు వెల్లడించారు.

**వచ్చి పోయే రైళ్లు ఇవే...**

చెన్నై ఎక్స్‌ప్రెస్, గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ, కృష్ణా ఎక్స్‌ప్రెస్, గుంటూరు ఇంటర్ సిటీ, పుష్‌పుల్ (సికింద్రాబాద్, వరంగల్), శబరి ఎక్స్‌ప్రెస్, రేపల్లె ఎక్స్‌ప్రెస్ (మధ్యాహ్నం), శాతవాహన, కాకతీయ ఎక్స్‌ప్రెస్, కాచిగూడ– మిర్యాలగూడ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి, ఘట్‌కేసర్ ఎంఎంటీఎస్, రేపల్లే ఎక్స్‌ప్రెస్ (రాత్రి).

## జేబీఎస్ చెంత మెట్రో రైల్ హబ్

మేడ్చల్ : మెట్రోరైలు రెండోదశలో భాగంగా జేబీఎస్ వద్ద మెట్రోరైల్ హబ్ ఏర్పాటు చేయబోతున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్ఏఎంఎల్) వెల్లడించింది. మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్ల ప్రారంభ స్థానాన్ని జేబీఎస్ వద్ద ఏకీకృతం చేసి.. ప్రపంచస్థాయి ఇంటిగ్రేటెడ్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఇందుకోసం జేబీఎస్ పరిసరాల్లో రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖకు చెందిన సుమారు 30 ఎకరాల భూమిని సమీకరించవచ్చని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ప్రతిపాదిత మార్గంతో మేడ్చల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 60 కి.మీ. సుదీర్ఘ మెట్రో కారిడార్ అవుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన మేడ్చల్, శామీర్‌పేట మెట్రో మార్గాలను రూపొందించే కసరత్తును అధికారులు ప్రారంభించారు. ప్యారడైజ్–మేడ్చల్(23 కి.మీ.), జేబీఎస్–శామీర్‌పేట(22 కి.మీ.) ప్రతిపాదిత కారిడార్ల అలైన్‌మెంట్ రూపొందించడంలో ఉన్న సాంకేతిక సవాళ్లను పరిష్కరించడానికి సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక సలహాదార్లతో కలిసి హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ రెండు కారిడార్ల ఏర్పాటులో ఎదురవుతున్న కొన్ని సంక్లిష్ట అంశాలను గుర్తించారు.



**భూగర్భ మార్గాన్ని నివారించేలా..**

క్లిష్టమైన మలుపులు, బేగంపేట విమానాశ్రయం రన్‌వే తర్వాత భూగర్భంలో అలైన్‌మెంట్‌ను తీసుకుకెళ్లే ఆవశ్యకతను నివారించేలా, ప్రైవేటు ఆస్తుల సేకరణను వీలైనంత తగ్గించేలా ప్రత్యామ్నాయ మార్గాల లాభనష్టాలను అంచనా వేయాలని మెట్రో ఎండీ అధికారులకు సూచించారు. సొరంగం ద్వారా కాకుండా బోయిన్‌పల్లి రోడ్ (సరోజినీ పుల్లారెడ్డి బంగ్లా పక్కన) చివరన ఉన్న జాతీయ రహదారి జంక్షన్ వద్ద అలైన్‌మెంట్‌ను అనుసంధానించవచ్చని తెలిపారు. అక్కడి నుంచి ఇప్పటికే విస్తరించిన జాతీయ రహదారి సర్వీస్ లేన్‌పై మెట్రో స్తంభాలను నిర్మించవచ్చని అన్నారు. దీంతో మేడ్చల్ –జేబీస్–ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట–శంషాబాద్ విమానాశ్రయం వరకు 60 కి.మీ. సుదీర్ఘ మెట్రో కారిడార్ ఏర్పాటవుతుందని తెలిపారు. జేబీఎస్–శామీర్‌పేట మెట్రో మార్గం సికింద్రాబాద్ క్లబ్ సమీపంలో ప్రస్తుతమున్న మొదటి మెట్రో స్తంభం నుంచి డబుల్ ఎలివేటెడ్‌గా కరీంనగర్ రహదారిపై హెచ్ఎండీఏ నిర్మించబోయే ఎలివేటెడ్ కారిడార్‌గా నేరుగా పొడిగించవచ్చని ఎన్వీఎస్‌రెడ్డి వివరించారు.

స్టేషన్ స్థానాల నిర్ధారణ, వాటి సమీపంలో ఖాళీగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ, రక్షణ భూముల లభ్యత, మెరుగైన పార్కింగ్, ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలను గుర్తించాలని ఆదేశించారు.

## అటకెక్కిన హిమాయత్‌సాగర్ సర్వే!



మొయినాబాద్ : హిమాయత్‌సాగర్ జలాశయ హద్దులు గుర్తించడంలో ఎడతెగని జాప్యం చోటుచేసుకుంటోంది. జాతీయ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ), సర్వే ఆఫ్ ఇండియా(ఎస్ఓఐ) పటాల ఆధారంగా వాస్తవ విస్తీర్ణాన్ని కనుగొనాలని హైడ్రా నిర్ణయించగా ప్రక్రియ ముందుకు సాగడం లేదు. సర్వే చేపట్టి పూర్తిస్థాయి నీటిమట్టం, బఫర్‌జోన్ల హద్దులు గుర్తించాల్సి ఉంది. అయితే సర్వే తంతు అటకెక్కిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నగర వాసుల దాహార్తి తీర్చడంలో..**

నగర వాసుల దాహార్తి తీర్చడంలో కీలక భూమిక పోషించిన హిమాయత్‌సాగర్ జలాశయానికి సంబంధించి గతంలోనూ చేపట్టిన సర్వే అర్ధంతరంగా నిలిచిపోయింది. నాలుగు మాసాల కిందట ఈ ప్రాంతంలో పర్యటించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హిమాయత్‌సాగర్ జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి చొచ్చుకొచ్చిన నిర్మాణాలను పరిశీలించారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వెలిసిన నిర్మాణాలను గుర్తించి రంగులు సైతం వేశారు. అనంతరం చేపట్టాల్సిన చర్యలపై ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు. వాస్తవానికి హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతం 1,311 చ.కి.మీ ఉండగా.. జలాశయ నిర్మాణ సమయంలో దాని సామర్థ్యం 3.232 టీఎంసీలు, ప్రస్తుతం 1.480 టీఎంసీలకు కుంచించుకుపోయింది. జలాశయం 5,938 ఎకరాల్లో ఉండగా.. 15ఏళ్ల క్రితం హెచ్ఎండీఏ, నీటి పారుదల, రెవెన్యూ, జలమండలి సంయుక్తంగా జలాశయం వద్ద కొంతమేర కొలతలు తీయగా 49.25 ఎకరాలు కబ్జాకు గురైనట్లు తేల్చారు.

**సమస్యలు ఎదురయ్యే అవకాశం..**

జలాశయంలో ఇప్పటివరకు పూడిక తొలగించలేదు. దీంతో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధి కొంతమేర పెరిగింది. పూడిక తీయకుండా సర్వే చేస్తే హద్దులు గుర్తించడంలో సమస్యలు ఎదురవుతాయి. సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొలతలు తీశారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేల్లో భారీ వ్యత్యాసం ఉండటంతో ప్రస్తుతం సర్వే ఎలా చేపట్టాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జలాశయానికి ఆనుకొని ఉన్న మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, బాకారం జాగీర్, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ, నర్కూడ, కవ్వగూడ రెవెన్యూ పరిధిల్లో విస్తరించి ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో సుమారుగా 150కుపైగా ఫాంహౌస్‌లున్నట్లు అధికారులు గుర్తించారు. ఆక్రమణల తొలగింపులు ఇప్పుడిప్పుడే చేపట్టే అవకాశాలు లేవు. సర్వే నిర్వహించి హద్దులు గుర్తించిన తర్వాతే ప్రక్రియ ముందుకు సాగుతుందని జలమండలికి చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు.

## ఉపాధ్యాయుల పరస్పర బదిలీలలు



కరీంనగర్ : ప్రభుత్వం ఉపాధ్యాయులకు కల్పించిన పరస్పర బదిలీల అవకాశం పలువురికి కలిసివస్తోంది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోరిక మేరకు విద్యాశాఖ ఈ అవకాశాన్ని కల్పించింది. అయితే కొందరు దీన్ని ఆసరా చేసుకొని ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. పరస్పర బదిలీల కోసం డబ్బుల దందా కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకొని అంగీకార పత్రాలను అధికారుల పరిశీలనకు అందించేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా పదవీ విరమణకు దగ్గరలో ఉండే వారితో ఒప్పందం చేసుకొని జిల్లా నుంచి స్థాన చలనం పొందనున్నారు. జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే వారు, ఆయా జిల్లాల నుంచి వచ్చే వారితో రూ.లక్ష నుంచి రూ.13 లక్షల వరకు ఒప్పందం కుదుర్చుకున్నారని సమాచారం.

**నేడు ధ్రువపత్రాల పరిశీలన**

పరస్పర బదిలీలకు జిల్లాలో 78 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట, సంగారెడ్డి, మేడ్చల్, ఆసిఫాబాద్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు వెళ్లేందుకు అక్కడి ఉపాధ్యాయులతో పరస్పర అంగీకారం కుదుర్చుకొని దరఖాస్తులు సమర్పించారు. వీరి సర్వీసు బుక్, అండర్ టేకింగ్ సర్టిఫికెట్, 317 జీవో అలాట్‌మెంట్ కాపీ వంటి ధ్రువపత్రాల పరిశీలనను కరీంనగర్‌లోని డీఈవో కార్యాలయంలో సోమవారం పరిశీలన చేసి వివరాలను రాష్ట్ర విద్యా శాఖకు పంపించనున్నారు. వీరిలో కొందరు అర్హులూ ఉన్నారు. మరికొందరు జిల్లా నివాసులై ఉండి, ఇక్కడే స్థిరపడిన పలువురు బదిలీల్లో పరస్పర అంగీకారం తెలుపుతూ ఇతర జిల్లాలకు వెళ్లడం వెనుక అంతర్యం ఏమిటన్నది అందరిని ఆశ్చర్యపరుస్తోంది.

**కొన్ని దృష్టాంతాలు..**

జిల్లాలో పని చేస్తూ పరస్పర బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్తున్న తీరుపై మిగిలిన ఉపాధ్యాయుల్లో సంశయం నెలకొంది.

దరఖాస్తుదారుల్లో ఈనెల 31న పదవీ విరమణ పొందే ఆరుగురు ఉండటం గమనార్హం.ఏప్రిల్‌లో పదవీ విరమణ పొందే 13 మంది పరస్పర బదిలీ జాబితాలో ఉండగా.. రెండేళ్లలో పదవీ విరమణ చేసేవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

పరస్పర బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లే జాబితాలో సింహాభాగం ఎస్జీటీలే ఉన్నారు.

ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి పరస్పర బదిలీపై వచ్చి.. మళ్లీ దరఖాస్తు చేసుకున్న వారు ఆరుగురు ఉన్నారు.

స్థానికత ఆధారంగా జిల్లా నుంచి పక్క జిల్లాకు కేటాయించిన ఓ టీచర్ తప్పిదం జరిగిందని, తిరిగి కరీంనగర్ జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం పరస్పర బదిలీ కింద పక్క జిల్లాకు మొగ్గుచూపారు.

జిల్లాల కేటాయింపుల్లో పక్క జిల్లాలో నియమించగా పదోన్నతి పొందిన ఒకరు తిరిగి ఇక్కడకు బదిలీపై రానున్నారు. ఆయనతో నియామకమైన ఉపాధ్యాయులు అదే కేడర్‌లో ఉండగా, అతను మరో కేడర్‌లో వస్తుండటంతో సర్వీసులో జూనియర్లుగా మారనున్నామని అభ్యంతరం తెలుపుతున్నారు.

పరస్పర బదిలీపై ఇతర ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చిన ఓ ఉపాధ్యాయుడు ప్రస్తుతం మరో జిల్లాకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

## పర్యవేక్షణ లోపం.. నిర్వహణ అధ్వానం

గోదావరిఖని : గోదావరిఖనిలోని రామగుండం నగరపాలక కూరగాయల, మాంసం మార్కెట్ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం పారిశుద్ధ్య నిర్వహణ మినహా శిథిలమవుతున్న మార్కెట్ భవనానికి తగిన మరమ్మతు చేయించడంతో పాటు వ్యాపారులకు సదుపాయాలు కల్పించడం పట్ల ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్ భవనం వ్యాపారాలకు అనుగుణంగా లేదంటూ విక్రయదారులు బయటకు వచ్చి కారిడార్‌లో వ్యాపారాలు చేసుకుంటున్నారు. మార్కెట్ భవనాన్ని ఆధునికీకరించాలని కూరగాయల వ్యాపారుల విన్నపాలను ఏమాత్రం పట్టించుకోని నగరపాలిక అదనంగా భవనంపై సుమారు రూ.కోటి వ్యయంతో షెడ్లు నిర్మించగా ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నాయి. భవనం గోడలు, స్లాబులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. చిరు వ్యాపారుల కోసం నిర్మించిన కొన్ని షెడ్లు సైతం నిరుపయోగంగా మారాయి. మార్కెట్కు మరో వైపు నిర్మించిన షెడ్లు శిథిలం కావడంతో కూల్చేశారు. ప్రధాన భవనంలోని సుమారు పది రిటైల్ దుకాణాలు శిథిలమయ్యాయి. బకాయిలతో సహా అద్దెలను వసూలు చేసుకుంటున్న నగరపాలిక మార్కెట్లో అవసరమైన వసతుల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వసతుల లేమి... ట్రాఫిక్ ఇక్కట్లు**

నగరపాలక హోల్‌సేల్, రిటైల్ మార్కెట్ ఒకేచోట నిర్మించడంతో ఉదయం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. తెల్లవారక ముందే వివిధ గ్రామాల నుంచి కూరగాయలను తెచ్చే లారీలు, ఆటో ట్రాలీలతో మార్కెట్ పక్కనే ఉన్న ప్రధాన రహదారి రద్దీగా మారుతోంది. కనీసం ద్విచక్ర వాహనం సైతం బయటకు వెళ్లలేని పరిస్థితులు



నెలకొంటున్నాయి. ప్రత్యామ్నాయ చర్యల కోసం గతంలో సమాలోచన చేసిన అధికారులు ఆచరణను విస్మరించారు. ప్రధాన రహదారి పక్కనే కొన్ని దుకాణాలు నిరుపయోగంగా ఉండడంతో శిథిలమైపోతున్నాయి. వీటిని తొలగిస్తే కొంతమేరకు రహదారి వెడల్పు కావడంతో పాటు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పే అవకాశముందని స్థానికులు భావిస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్లో రైతులు, హమాలీల నడుమ వివాదాలు నెలకొంటున్నాయి. రైతుల నుంచి కూరగాయలు తీసుకోవడంతో పాటు సకాలంలో సరకు దించడం లేదని అన్నదాతలు పలుమార్లు ఆందోళన చేపట్టిన సంఘటనలున్నాయి. చీకటి పడిందంటే చాలు మార్కెట్ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. మార్కెట్ దుకాణ సముదాయాల పక్కనే కొందరు బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో మార్కెట్లోని వ్యాపారులతో పాటు కొనుగోలు దారులు దుర్గంధంతో ఇక్కట్లు పడుతున్నారు. పారిశుద్ధ్యలోపం ఆవరణ అధ్వానంగా మారింది. నగరపాలక అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలు పరిష్కరించాలని... వసతుల కల్పనపై దృష్టి సారించాలని వ్యాపారులు, కొనుగోలు దారులు కోరుతున్నారు.

## రూ.500 కోట్లతో మంజీరా కొత్త పైపులైను

హైదరాబాద్: సుమారు 60 ఏళ్లుగా నగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న మంజీరా తాగునీటి పైపులైను స్థానంలో రూ.500 కోట్లతో కొత్త పైపులైను ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధమవుతోంది. సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న ఈ పైపులైను పాతది కావడంతో తరచూ మరమ్మతులకు గురవుతూ.. నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఒక్కోసారి వారం నుంచి 15 రోజులు సరఫరా నిలిచిపోతోంది. పైపులైను సామర్థ్యం 45 ఎంజీడీలు అయినా 33 నుంచి 37 ఎంజీడీలకు మించి నీటిని సరఫరా చేసే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

**1965లో ఏర్పాటు చేసి...**

ఈ పైపులైన్‌ను 1965లో ఏర్పాటు చేయగా.. అక్కడక్కడ దెబ్బతింది.



ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జలమండలి బోర్డు సమావేశంలో కొత్త పైపులైన్ ఏర్పాటుపై చర్చించారు. కొత్తగా 20 టీఎంసీల నీటిని నగరానికి తీసుకువచ్చే గోదావరి ఫేజ్–2తో పాటు దీన్ని కూడా చేపడితే నీటి సమస్యలు తగ్గడమే కాకుండా ఐదారు దశాబ్దాలు పైపులైను మన్నిక ఉంటుందని జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి బోర్డు సమావేశంలో వివరించారు. పాత లైను వెంట ప్రత్యామ్నాయంగా మరో అధునాతన లైన్ నిర్మించేలా కొత్త ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ప్రతిపాదనలకు బోర్డు ఆమోదం తెలపడంతో జలమండలి అధికారులు కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.450 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు అవుతుందని అంచనా వేశారు. ఈ నిధుల సమీకరణపై అధికారులు దృష్టిసారించారు. పురపాలకశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించి జల్‌జీవన్ మిషన్ నుంచి నిధులు తీసుకునేందుకు అవకాశాలపై అధ్యయనం చేస్తున్నారు. ముందుగా కేంద్రానికి ప్రతిపాదనలను పంపేందుకు వీలుగా ప్రాజెక్ట్ నివేదికను రూపొందిస్తున్నారు.

## పాతబస్తీ మెట్రో మార్గంలో ఆస్తుల కూల్చివేతలు షురూ

హైదరాబాద్: పాతబస్తీలో మెట్రోరైలు కోసం రహదారి విస్తరణకు సేకరించిన ఆస్తుల కూల్చివేత పనులు మొదలయ్యాయి. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. మెట్రో మార్గంలో దాదాపుగా పదకొండు వందల ఆస్తులను సేకరించాల్సి ఉంది. ఈ ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. ఇటీవల 34 ఆస్తులకు సంబంధించిన 41 మంది యజమానులకు తొలివిడతగా పరిహారం చెక్కులను కలెక్టర్ కార్యాలయంలో పంపిణీ చేశారు. చదరపు గజానికి రూ.81 వేలుగా పరిహారం నిర్ణయించారు. దీనికి సమ్మతించిన యజ



మానులు పరిహారం చెక్కులు తీసుకుని ఆస్తులను ఖాళీ చేస్తున్నారు. ఈ భవనాలను ఒక్కొక్కటిగా కూల్చివేస్తున్నారు. మొగల్‌పురా నుంచి అలిజాకోట్లా మార్గంలో కూల్చివేత పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. మార్చి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. కొంతమంది ఆస్తుల యజమానులు పరిహారం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

## పోలీస్ సారూ.. ఇదేం తీరు!

హైదరాబాద్: నగర పరిధిలో కీలకమైన జోన్‌లోని ప్రధాన పోలీస్‌స్టేషన్ అది. దొంగతనం కేసులో పట్టుబడిన నిందితులకు స్టేషన్ బెయిల్ ఇప్పిస్తామంటూ రూ.లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అంతర్గత విచారణకు ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల జరిగిన చోరీ ఘటనపై ఆ ఠాణాలో కేసు నమోదైంది. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. కొన్ని రోజుల క్రితం వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో తప్పనిసరిగా జైలుకు వెళ్లాల్సి ఉంటుందని, 14 రోజుల రిమాండ్ తప్పదంటూ పోలీసులు హెచ్చరించారు. స్టేషన్ బెయిలిచ్చి సహకరిస్తామంటూ నిందితులకు భరోసా ఇచ్చారు. దీంతో పోలీసులకు రూ.3 లక్షల నగదు, బంగారు ఆభరణాలు ఇచ్చారు. న్యాయస్థానం రిమాండ్ విధించడంతో కథ అడ్డం తిరిగింది. విషయం బయటపడటంతో పోలీసులు తీసుకున్న ఆభరణాలు తిరిగి ఇచ్చేసినట్లు తెలిసింది. నగదు ఇవ్వకుండా కుటుంబసభ్యులను ఠాణా చుట్టూ తిప్పుతున్నట్లు ఆరోపణలున్నాయి.

**నోటీసులిచ్చి పంపిస్తామని..**నిందితుల్లో ఒకరు పోలీసు ఉద్యోగి కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో విషయం ఉన్నతాధికారుల దృష్టికి చేరింది. నిందితులకు నోటీసులిచ్చి పంపుతామని ఇద్దరు కానిస్టేబుళ్లు డబ్బులు వసూలు చేశారు. సొమ్ములో కొంత వాటా డీఐ, ఎస్సైలకు ఇవ్వాలని చెప్పినట్లు తెలిసింది. డీఐ, ఎస్సైల పేరు చెప్పి కానిస్టేబుళ్లు వసూలు చేశారా.. డీఐ ఆదేశాలతోనే అలా చేశారా.. అనేది అంతర్గత విచారణలో తేలాల్సి ఉంది. స్టేషన్ బెయిల్ ఇప్పిస్తామని వసూళ్లకు పాల్పడిన విషయం దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ జరుగుతున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

# క్లాప్.. ఫ్లాప్!

ధర్మవరం : పట్టణంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే క్లాప్ ఆటోలకు (వాహనాలు) సంబంధించిన కంతులు రెడ్డి ఎంటర్ ప్రైజెస్ ఏజెన్సీ చెల్లించకపోవడంతో ఓ సంస్థ ప్రతినిధులు స్వాధీనం చేసుకుని తీసుకెళ్లిపోయారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టణంలో చెత్త తరలించేందుకు స్వచ్ఛ భారత్ మిషన్ కింద ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలకు మొత్తం 80 క్లాప్ ఆటోలను కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా వాటి నిర్వహణ బాధ్యతలను అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన చెందిన రెడ్డి ఎంటర్ ప్రైజెస్ ఏజెన్సీకి అప్పగించింది. క్లాప్ ఆటోలను నిర్వహిస్తున్నందుకు ప్రతి నెలా రూ. 63,000 చొప్పున సంబంధిత మున్సిపాలిటీ ఆ ఏజెన్సీకి చెల్లించేలా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ ఏజెన్సీకి అంత మొత్తం చెల్లించేందుకు గత వైకాపా ప్రభుత్వం ప్రతి ఇంటికి రూ. 60 చొప్పున.. ప్రతినెలా ప్రజల నుంచి చెత్త పన్ను ముక్కు పిండి వసూలు చేసింది. ఇలా నాలుగేళ్లపాటు సాగింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై గుదిబండగా మారిన చెత్త పన్నును రద్దు చేసింది. గత ఏడాది ఆగస్టుతో రెడ్డి ఏజెన్సీతో చేసుకున్న ఒప్పందం గడువు ముగియగా.. ప్రభుత్వం పునరుద్ధరించలేదు. అయితే ఆ సంస్థ ఆ వాహనాలను ఏజెన్సీ నిర్వాహకులు తీసుకెళ్లకుండా మున్సిపాలిటీ కార్యాలయాల్లోనే ఉంచారు.

**బకాయిలు చెల్లించకుండా..**

2021లో రెడ్డి ఏజెన్సీ నిర్వాహకులు ఓ వాహన సంస్థ నుంచి చెత్త ఆటోలను ఫైనాన్స్‌లో కొనుగోలు చేశారు. గత 9 నెలలుగా వాహనాల కంతులు చెల్లించలేదు. ఒక్కో ఒక వాహనానికి రూ. 2 లక్షల వరకు కంతుల బకాయిలు పేరుకుపోయాయి. ఆ వాహన సంస్థ నోటీసులి



చ్చినా స్పందించలేదు. దీనిపై కోర్టును ఆశ్రయించడంతో వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలిచ్చింది. దీంతో ఆ సంస్థ ప్రతినిధులు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మున్సిపాలిటీ కార్యాలయాల్లో ఉన్న చెత్త ఆటోలను స్వాధీనం చేసుకుని తీసుకెళ్లిపోయారు. హిందూపురం మున్సిపాలిటీలో ఉన్న ఆ వాహనాలను మంగళవారం తీసుకెళ్తామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎస్‌బీఐ బ్యాంకు కూడా ఫైనాన్స్ ఇచ్చిన వాహనాలను స్వాధీనం చేసుకోనుంది. దీనిపై ధర్మవరం కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను సంప్రదించగా.. 'రెడ్డి ఎంటర్ ప్రైజెస్ ఏజెన్సీతో చేసుకున్న వాహనాల ఒప్పందం రద్దయ్యింది. టాటా వాహన కంపెనీ ప్రతినిధులు వచ్చి కోర్టు ఉత్తర్వులు చూపించి చెత్త ఆటోలను తీసుకెళ్లారు. మున్సిపాలిటీకి సంబంధం లేదు.' అని అన్నారు.

**ఇబ్బందుల్లేకుండా చూస్తాం**

క్లాప్ వాహనాలు తీసుకెళ్లిన విషయం నా దృష్టికి రాలేదు. వాహనాలు తీసుకెళ్లిన చోట ప్రత్యామ్నాయ వాహనాలు ఏర్పాటు చేసుకుని చెత్త సేకరణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. విశ్వనాథ్, మున్సిపల్ ఆర్‌డీ, అనంతపురం

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో క్లాప్ ఆటోల వివరాలు..
ధర్మవరం 24 కదిరి 4 అనంతపురం – 18 హిందూపురం 16 గుంతకల్లు 20

# భూ సేకరణలో మాయ

అనంతపురం: రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు అండగా నిలవాల్సిన కొందరు రెవెన్యూ అధికారులే.. అక్రమాలకు పాల్పడ్డారు. ఎంతోకొంత ఇస్తే తప్ప పరిహారం ఫైలును ముందుకు కదిలించడం లేదు. ఎన్‌హెచ్ 716–జి పరిధిలో ముద్దనూరు నుంచి హిందూపురం వరకు రహదారి నిర్మాణంలో కదిరి మండలానికి చెందిన కొందరు రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శించారు. కమీషన్ ఇస్తేనే పరిహారం సొమ్ము ఖాతాలో జమవుతుందని చెప్పి రైతుల నుంచి అందినకాడికి లాగేసుకున్నారు. రోడ్డు కోసం సేకరించిన భూమి విస్తీర్ణాన్ని అధికంగా చూపి వచ్చే పరిహారంలోనూ సగం నొక్కేసినట్లు తెలుస్తోంది. దీనిపై బాధిత రైతులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.



**ముద్దనూరు-హిందూపురం మార్గానికి...**

ఎస్‌హెచ్ 60 (కదిరి–జమ్మలమడుగు), ఎస్‌హెచ్ 61 (కదిరి–హిందూపురం) రహదారుల్ని కలిపి ఎన్‌హెచ్ 716–జిగా అభివృద్ధి చేస్తున్నారు. ముద్దనూరు–బి.కొత్తపల్లి, బి.కొత్తపల్లి–గోరంట్ల, గోరంట్ల–హిందూపురం ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టారు. కదిరి మండలం పరిధిలోని భూసేకరణను ఓ వీఆర్వోకు అప్పగించారు. కదిరి, ముత్యాలచెరువు, కుటాగుళ్ల రెవెన్యూ గ్రామాల పరిధిలోని భూసేకరణకు సంబంధించి రైతుల నుంచి పెద్దమొత్తంలో వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కదిరి రెవెన్యూ గ్రామంలో ఎకరాకు రూ. 30 లక్షలు, మిగిలిన గ్రామాల్లో రూ. 16 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు. ఏ రైతు నుంచి ఎంత సేకరించారు? ఎంత పరిహారం ఇవ్వాలి? అనే నివేదిక రూపకల్పన బాధ్యతలను వీఆర్వోకు అప్పగించడంతో వసూళ్ల పర్వానికి తెరతీసినట్లు తెలుస్తోంది.

ఫిర్యాదు చేసినా..రహదారి నిర్మాణానికి భూసేకరణ మొదలైన తర్వాత ముగ్గురు తహసీల్దార్లు మారిపోయారు. అయినా సదరు వీఆర్వోనే భూసేకరణ బాధ్యతలు చూస్తూ వచ్చారు. పరిహారం డబ్బుల కోసం వీఆర్వో తమ నుంచి కమీషన్లు వసూలు చేస్తున్నారని కొందరు రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా విచారణ చేపట్టలేదు. ఇటీవల కొందరు బాధిత రైతులు స్థానిక ప్రజాప్రతినిధి వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నారు. దీంతో వీఆర్వోను మందలించిన ప్రజాప్రతినిధి రైతుల నుంచి తీసుకున్న సొమ్మును తిరిగి ఇప్పించారు. వివాదం ముదురుతోందని గమనించిన ఉన్నతాధికారులు సదరు వీఆర్వోను ఆగమేఘాల మీద మరో మండలానికి బదిలీ చేయడం గమనార్హం.

**అభియోగాలు రావడంతో బదిలీ చేశాం**

వీఆర్వోపై అభియోగాలు రావడంతో బదిలీ చేశాం. రైతుల నుంచి వసూళ్ల చేసిన అంశంపై ఎవరైనా లిఖితపూర్వకంగా విచారించి తగిన చర్యలు తీసుకుంటాం. వి.వి.ఎస్. శర్మ, ఆర్డీవో, కదిరి

# స్వయం ఉపాధికి సర్కారు ఊతం



అనంతపురం : వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల పేదలు (ఈబీసీ) చిన్న తరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆయా వర్గాలవారు దరఖాస్తు చేసుకోవడానికి సోమవారంతో తుది గడువు ముగియడంతో యూనిట్లు నెలకొల్పేందుకు భారీగా స్పందన లభించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆయా కులాల దామాషా ప్రకారం స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేశారు. వైకాపా ఐదేళ్ల కాలంలో స్వయం ఉపాధికి కనీసం ఒక్కటి అంటే ఒక్క యూనిట్ కూడా ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించకుండా నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఆర్థిక సంవత్సరంలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్ల ద్వారా యూనిట్ల మంజూరుకు అవకాశం కల్పించింది.

వడబోత కత్తిమీద సామే..

పలు నియోజకవర్గాల్లో దరఖాస్తుల వడబోత కత్తిమీద సాములా మారనుంది. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో బీసీలకు 257 యూనిట్లు ఉంటే 4,233 మంది దరఖాస్తు చేయడంతో ఒక్కో యూనిట్‌కు 17 మంది వరకు పోటీ పడుతున్నారు. ధర్మవరంలో బీసీ కులాలకు 242 యూనిట్లు ఉండగా ఏకంగా 3,343 దరఖాస్తులు అందాయంటే ఒక్కో యూనిట్‌కు సరాసరిగా 14 మంది పోటీ పడుతున్నారు. అనంతపురం జిల్లాలో బీసీలకు 1,728 యూనిట్లు ఉండగా 19,098 దరఖాస్తులు, శ్రీసత్యసాయి జిల్లాలో 1,472 యూనిట్లు ఉంటే 14,031 దరఖాస్తులు అందాయి. ఈనెల 20వ తేదీ వరకు కమిషనర్లు, ఎంపీడీఓలు అర్హతలను పరిశీలించి కలెక్టరుకు నివేదిస్తే ఈనెల 25వ తేదీలోగా తుది జాబితా ప్రకటిస్తారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ నుంచి రాయితీ సొమ్మును ఈనెల 28వ తేదీలోగా బ్యాంకులకు జమ చేస్తే బ్యాంకర్లు అన్ని ప్రక్రియలు పూర్తి చేసి మార్చి 6 నుంచి 9వ తేదీ వరకు రాయితీ, బ్యాంకు అప్పు అంతా కలిసి లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తారు. జనరిక్ యూనిట్లకు సంబంధించి అనంతపురం జిల్లాలో 72 యూనిట్లు ఉంటే 51 మంది, శ్రీసత్యసాయిలో 61 ఉంటే 67 మంది దరఖాస్తు చేశారు.

జిల్లా: అనంతపురం
దరఖాస్తులు: 22,943
యూనిట్లు: 2,369
నిధులు: రూ. 54 కోట్లు

# వర్సిటీల్లో వేతన వెతలు




అనంతపురం: 'జేఎన్‌టీయూలో ఏ ఉద్యోగిని పలకరించినా వేతనాల గురించే మాట్లాడుతున్నారు. జీతాలు ఎప్పుడొస్తాయో.. ఏమో అంటున్నారు. 3 నెలలుగా జేఎన్‌టీయూ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొరుగుసేవల కింద పనిచేసే ఉద్యోగుల వెతలు వర్ణనాతీతం. అటెండరుతో మొదలుకొని ఆచార్యుల వరకూ అందరి నోటా వేతన వెతలు ఉన్నాయి'శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జనవరి వేతనాలు ఇప్పటికీ అందలేదు. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందుతుండగా ఒక్కసారిగా జీతాలు ఆగిపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారు.'జేఎన్‌టీయూ, ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 1న వేతనాలు అందుకుంటున్నారు. కానీ, జిల్లాలోని జేఎన్‌టీయూ, ఎస్కేయూ ఉద్యోగులకు కొంతకాలంగా వేతనాలు అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన కొత్తలో వేతనాలు సకాలంలో అందాయి. జేఎన్‌టీయూలో 3 నెలలుగా, ఎస్కేయూ ఒక నెల వేతన బకాయిలున్నాయి. ఈ పాపం వైకాపా ప్రభుత్వానిదే. కారణం వర్సిటీలకు బడ్జెట్‌లో కోత విధించడమే. బ్లాక్‌గ్రాంటులో కోత విధించింది. దీంతో ఆర్థిక సంవత్సరం ముగింపులో ఉద్యోగులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

ఒక్కో విశ్వవిద్యాలయానికి రూ. 20 కోట్లు కోత

వైకాపా ప్రభుత్వం ఒక్కో విశ్వవిద్యాలయానికి రూ. 20 కోట్లు కోత విధించింది. జేఎన్‌టీయూ ఉద్యోగుల వేతనాలకు బ్లాక్‌గ్రాంట్ రూపంలో సంవత్సరానికి రూ. 78 కోట్లు విడుదల చేయాలి. కానీ, 2023–24 బడ్జెట్‌లో రూ. 58 కోట్లు మాత్రమే కేటాయించారు. వర్సిటీలోని ఉద్యోగుల వేతనాలకు నెలకు సుమారు రూ. 6.50 కోట్లు అవసరమవుతాయి. విడుదలైన నిధులు 3 నెలల వేతనాలకే సరిపోయాయి. 3 నెలల నుంచి వేతనాలు చెల్లించలేని పరిస్థితి.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం ఏటా రూ. 100 కోట్ల బ్లాక్ గ్రాంట్ ఇచ్చేది. గత బడ్జెట్‌లో రూ. 100 కోట్లు కేటాయించినా, సుమారు రూ. 20 కోట్ల బిల్లులు బకాయిలుగా మిగిలిపోయాయి. గ్రాంటు రాకపోవడంతో వేతనాలు, పెన్షన్ల బకాయిలున్నాయి. నెలకు జీతాలు, పెన్షన్లకు రూ. 7.50 కోట్లు అవసరం.

**అదనపు బడ్జెట్ కోసం నివేదించాం**

బడ్జెట్‌లో రూ. 20 కోట్లు తగ్గించారు. దీంతో వేతన బకాయిలున్నాయి. అదనపు బడ్జెట్ కోసం నివేదించాం. రాష్ట్ర ఫైనాన్స్ విభాగంలో దస్త్రం ఉంది. నాలుగైదు రోజుల్లో మంజూరయ్యే అవకాశం ఉంది. నిధులు రాగానే వేతనాలు చెల్లిస్తాం. ఆచార్య సుదర్శనరావు, ఇన్‌ఛార్జి వీసీ, జేఎన్‌టీయూ

# ఉల్లం'గనుల' ఉత్తుత్తి నిలిపివేతలు

కర్నూలు : గత ఐదేళ్ల వైకాపా హయాంలో కొండలను పిండేశారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు చేపట్టారు.. రాయల్టీకి ఎగనామం పెట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో దృష్టి సారించి విచారణ చేయించింది.. అక్రమ తవ్వకాలను గనులశాఖ రద్దు చేసింది.. అయినా అత్యధిక క్వారీల్లో తవ్వకాలు ఆగలేదు. బ్లాక్ చేసిన గనుల్లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టి పెద్ద మొత్తంలో ఖనిజం కొల్లగొడుతున్నారు.

**ఇష్టానుసారంగా తవ్వేశారు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాపరాయి, కంకర క్వారీలు కలిపి 133 వరకు ఉన్నాయి.. చిన్న తరహా ఖనిజాలకు సంబంధించి 352 చోట్ల లీజులిచ్చారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాయల్టీ రుసుము భారీగా పెంచారు. దీంతో చాలా మంది క్వారీ యజమానులు ఖనిజాల తవ్వకాలకు ముందుకురాలేదు. దీన్ని అదను తీసుకొని వైకాపాకు చెందిన పలువురు అప్పటి ప్రభుత్వ అండతో క్వారీల్లో తిష్ఠ వేశారు. చిల్లిగవ్వ రాయల్టీ చెల్లించకుండానే తవ్వకాలు సాగించి సొమ్ము చేసుకున్నారు.

**బకాయిల వసూలుకు చర్యలు**

రాయల్టీ ఎగ్గొట్టిన 'ఘనులకు' పెద్దల అండ ఉంది. వీరి నుంచి ముందుగా పన్నులు వసూలు చేసి ఆ తర్వాత శాఖాపరమైన చర్యలు తీసుకొనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా బకాయిలు వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అక్రమాల నిగ్గు తేల్చేందుకు కసరత్తు



జరుగుతోంది.

**ఎక్కడెక్కడ**

గనుల్లో నిబంధనల ఉల్లంఘనలపై 'కూటమి' ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేయించింది. బనగానపల్లి గనుల కార్యాలయం పరిధిలోని బనగానపల్లి, కొలిమిగుండ్ల, బేతంచెర్ల మండలాల్లోని 5 క్వారీల్లో మైనింగ్ నిలిపివేతకు ఉత్తర్వులిచ్చారు. ఇప్పటికీ పలు చోట్ల తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి.పాణ్యం మండలం తమ్మరాజుపల్లె కొండల్లో నాలుగు క్వారీల్లో తవ్వకాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. రాత్రి వేళల్లో తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి.

ఉలిందకొండ, వెల్దుర్తి ప్రాంతాల్లో దాడులు చేసి నిలిపివేశారు. తవ్వకాలు చేయకూడదని ఆదేశాలిచ్చారు. అధికారుల ఆదేశాలను క్వారీ యజమానులు పట్టించుకోవడం లేదు.

# బుగ్గానిపల్లి భూదందా

కర్నూలు : జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్ కోసం డోన్ నియోజకవర్గం.. బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లిలో చేపట్టిన భూసేకరణలో భారీఎత్తున ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 234/1, 233, 225/2, 234/1, 233 (పి), 225/2లో 14.57 ఎకరాల భూమిని గత వైకాపా ప్రభుత్వం సేకరించింది. అందుకు రూ. 8.74 కోట్లు వెచ్చించారు. బుగ్గానిపల్లిలో భూముల రిజిస్ట్రేషన్ ఎకరా రూ. 4.50 లక్షలుండగా, రెండేళ్ల కిందట మార్కెట్ విలువ రూ. 8 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఉంది. రెవెన్యూ అధికారులు మాత్రం ఏకంగా ఎకరా రూ. 60 లక్షల చొప్పున కొనుగోలు చేశారు.

**అధికారులు వంతపాడారు**

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్ కోసం మొత్తం 11 మంది నుంచి భూములు సేకరించారు. వారిలో పది మంది వైకాపాకు చెందినవారే. గతంలో వారు అక్కడ వ్యవసాయం చేసిన దాఖలాలు లేవు. టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తున్నట్లు ముందస్తుగా సమాచారం అందుకొన్న వారు రైతుల వద్ద తక్కువ ధరకు భూములు కొనుగోలు చేశారు. అనంతరం రెవెన్యూ దస్త్రాల్లో తమ పేర్లు నమోదు చేయించుకున్నారు. ఆ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాక అధికారులు భూసేకరణ చేపట్టడం గమనార్హం. మార్కెట్ ధరతో ఏమాత్రం సంబంధం లేకుండా భారీఎత్తున ధరలు పెంచి భూసేకరణ చేయడంపై అప్పటి ఆర్డీవో, కలెక్టర్ అభ్యంతరం చెప్పలేదు. దీంతో భారీ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు బీజం పడింది.



**బాధితులు గప్‌చుప్....**

వైకాపా హయాంలో కీలకపాత్ర పోషించిన నాటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగ్రామం బేతంచెర్ల. ఆ గ్రామ సర్పంచి స్థాయి నుంచి మంత్రి వరకు ఎదిగిన ఆయనకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తిరుగులేని పట్టుంది. బేతంచెర్లకు అనుకునే ఉన్న బుగ్గానిపల్లిలో తమ భూములను కొనుగోలు చేసింది ఆయన అనుచరులే. ఈ నేపథ్యంలో ఆయనకు ఫిర్యాదు చేసినా ఉపయోగం ఉండదని బాధితులు మిన్నకుండిపోయారు. ఓ రైతు ధైర్యం చేసి తన భూమిని అమ్మనని చెప్పడంతో అప్పటి నుంచి అతనికి పోలీసుల నుంచి తీవ్రమైన వేధింపులు ఎదురైనట్లు సమాచారం.

**లోకాయుక్తలో కేసు వేశా : హనుమంతరెడ్డి, బేతంచెర్ల**

బుగ్గానిపల్లిలో భూసేకరణ పేరుతో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగింది. భూసేకరణ చేసేందుకు కొద్దిరోజుల ముందే పది మంది భూములను కొనుగోలు చేసి వెంటనే ప్రభుత్వానికి విక్రయించారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందన్న విషయం ఆయా లావాదేవీలను గమనిస్తే స్పష్టంగా అర్థమవుతుంది. దీనిపై గతేడాది లోకాయుక్తకు ఫిర్యాదు చేశా. అప్పటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అండదండలతో వైకాపాకు చెందిన ఆయన సన్నిహితుల భూములనే అధికారులు తీసుకున్నారు. 'కూటమి' ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలి.

# ఎండుతున్న సర్వజనం గొంతులు

నంద్యాల : " నా భార్యకు ఆరోగ్య బాగలేకపోవడంతో వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకొచ్చా. ఇక్కడ తాగునీరు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో బయట లీటరు రూ. 20 చెల్లించి కొనుగోలు చేసి దాహం తీర్చుకున్నాం. ఇంత పెద్దాసుపత్రిలో తాగునీరు లేకపోతే ఎలా? అధికారులు నీటి వసతి కల్పించాలి."

**తడారిన నాగశేషులు ఆవేదన ఇది..!!**

నంద్యాల సర్వజన ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులు, వారి సహాయకుల గొంతులు ఎండుతున్నాయి. దాతలు ఏర్పాటు చేసిన నీటిశుద్ధి యంత్రాలను చిన్న చిన్న మరమ్మతులు చేయించకుండా అధికారులు నిరుపయోగంగా వదిలేశారు. దీంతో దాహమేస్తే బయటికెళ్లి నీళ్లు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. రాత్రిళ్లు దాహమేస్తే కొందామన్నా నీరు



దొరకని పరిస్థితి.

**అవసరంలో సగమే సరఫరా**

ఆసుపత్రిలో రోగులకు రోజుకు 4 లక్షల లీటర్ల మంచినీరు అవసరం అవుతుంది. ప్రస్తుతం ఆసుపత్రికి పురపాలక సంఘం నుంచి లక్ష లీటర్లు, ఎన్జీవోకాలనీలోని బోరు ద్వారా మరో లక్ష లీటర్ల నీటిని ట్యాంకులకు సరఫరా చేస్తున్నారు. అవసరమైన వాటిలో సగమే ఇస్తుండటంతో తీవ్ర నీటి కొరత నెలకొంది. కొన్ని వార్డుల్లో మరుగుదొడ్లను మూసి వేశారు. దీంతో రోగులు మల, మూత్ర విసర్జనకు బహిర్భూమికి వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. " నా కుమారుడికి నాలుగు రోజుల కిందట శస్త్రచికిత్స జరిగింది. ఆసుపత్రిలో ఎక్కడా తాగునీరు లేదు. దీంతో బయట కొనుగోలు చేస్తున్నాం. రోజూ తాగునీళ్లకే రూ. 50 ఖర్చవుతోంది. నాలుగు రోజుల నుంచి ఇదే పరిస్థితి" ఉందని మిట్నాలకు చెందిన వెంకటరమణ వాపోయారు.

**ట్యాంకర్లతో కొన్నా తీరని కష్టాలు**

గతేడాది ఎన్జీవోకాలనీ నుంచి వచ్చే బోరు మరమ్మతులకు గురైంది. దీంతో పురపాలక సంఘం ఇచ్చే లక్ష లీటర్ల నీరు ఏమాత్రం సరిపోకపోవడంతో రోజుకు 10 ట్యాంకర్ల నీళ్లు కొనుగోలు చేయాల్సి వచ్చింది. అయినాసరే నీటి అవసరాలు తీరక రోగులు, సిబ్బంది సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వేసవిలో కూడా వైద్యాధికారులు నిర్లక్ష్యంగా ఉంటే మళ్లీ ట్యాంకర్ల ద్వారా కొనాల్సిన పరిస్థితి తప్పేలా లేదు.

**మరమ్మతుల భారమూ దాతలపైనే..**

ఆసుపత్రి ఆవరణలో గతంలో శిల్పా శుద్ధజల కేంద్రాన్ని నిర్మించారు. రోగులు ఆ నీటినే తాగేవారు. వాటితో పాటు ఆసుపత్రి లోపల మాఘం పుల్లయ్య చల్లటి శుద్ధజల యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ రెండు శుద్ధజల కేంద్రాలు ప్రస్తుతం పాడయ్యాయి. చల్లని నీటియంత్రం గతంలోనూ పాడవగా దాతే మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం మళ్లీ పాడైంది. ఆసుపత్రి అధికారులు వీటి గురించి పట్టించుకోవడం లేదు. దాతలు మరమ్మతులు చేయిస్తేనే రోగుల నీటికష్టాలు తీరుతాయి లేదంటే కొనుగోలు చేసి దాహం తీర్చుకోవాల్సిందే. నిత్యం ఓపీ: 1000– 1200 మంది
ఆసుపత్రిలో చికిత్స పొందే వారు: 350 మంది
మొత్తం వార్డులు: 18
పడకలు: 400 నిత్యం వచ్చే రోగుల సహాయకులు: 500 మంది

చురకలు



# భూ దస్త్రాలే... మాయగాళ్ల అస్త్రాలు!!

విశాఖ : విశాఖ గ్రామీణ మండల పరిధిలో విలువైన భూముల రికార్డుల తారుమారు(ట్యాంపరింగ్) వ్యవహారంపై లోతైన విచారణ చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ నిర్ణయించారు. 2004-2007 మధ్యకాలంలో గ్రామీణ మండల పరిధిలోని పరదేశిపాలెం, కొమ్మాది, మధురవాడ ప్రాంతాల్లోని నాలుగు సర్వే సంఖ్యల్లో దాదాపు 40 ఎకరాలకు చెందిన భూముల రికార్డులు తారుమారయ్యాయి. వీటి విలువ ప్రస్తుత మార్కెట్‌లో రూ.800 కోట్ల వరకు ఉంటుంది. దస్త్రాల తారుమారు వ్యవహారంపై అభియోగాలు ఎదుర్కొంటున్న ఏడుగురిపై ఈనెల 22న జేసీ మయూర్ అశోక్ విచారణ చేయనున్నారు. మరో వైపు విశాఖ గ్రామీణం, భీమిలి, ఆనందపురం, పెందుర్తి మండలాల పరిధిలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూముల రికార్డులు తారుమారయ్యాయి. వీటిపై ఇప్పటికే అనేక మంది బాధితులు ప్రజా వినతుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో తమ గోడు వినిపిస్తూనే ఉన్నారు.

**ఎందుకు కొలిక్కి రాలేదు?:** దాదాపు 20 ఏళ్ల క్రితం నాటి ట్యాంపరింగ్ కేసు ఇప్పటికీ కొలిక్కిరాకపోవడంపై అనుమానాలు రేగుతున్నాయి. ట్యాంపరింగ్‌లో విశాఖ కలెక్టరేట్ ఎఫ్ సెక్షన్ పర్యవేక్షులుగా పనిచేసిన నలుగురి ప్రమేయం ఉంది. దీనిపై 2011లో తొలిసారి విచారణ జరిగింది. ఆ నివేదిక వెలుగులోకి రాలేదు. అది బయటకొస్తే అభియోగాలు ఎదుర్కొంటున్న వారికి పదోన్నతులు వచ్చే అవకాశం లేదని, అందుకే తొక్కిపెట్టారని సమాచారం. ప్రస్తుతం అభియోగాలు ఎదుర్కొంటూ పార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేస్తున్న ఓ అధికారి తన పలుకుబడిని ఉపయోగించి ఉన్నత స్థాయిలో చక్రం తిప్పారనే చర్చ కూడా సాగుతోంది. అభియోగాలు ఎదుర్కొంటున్న వారిపై



విచారణ జరపాలని గత ఏడాది మార్చి 3న జీవో 273 విడుదలవడంతో ఈ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. సర్వే సంఖ్య 367 పరిధిలోని భూముల్లో కొన్ని భవనాలను నిర్మించారనే సమాచారం ఉండటంతో ఆయా అంశాలపై కూడా ఆరా తీస్తున్నారు.

**ఇకపై క్రిమినల్ కేసులు**

తాజా పరిణామాల నేపథ్యంలో రికార్డుల తారుమారు వ్యవహారాలకు సంబంధించి కఠినంగా వ్యవహరించాలని, ఫిర్యాదు అందిన వెంటనే క్రిమినల్ కేసులు పెట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల ఒక కేసు విషయంలో ఉన్నత న్యాయస్థానంలో యంత్రాంగానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రికార్డుల తారుమారు వ్యవహారంలో లోగడ ఒక తహసీల్దార్ విషయంలో యంత్రాంగం మెతకగా వ్యవహరించడంతో ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని హైకోర్టు నిలదీసింది. ఆ కేసుకు సంబంధించి మళ్లీ న్యాయపరమైన చర్యలు ఆరంభించారు. ఇటువంటి పరిస్థితి మరోసారి ఎదురవకుండా జాగ్రత్తపడుతున్నారు.

# పర్యాటక శాఖకు ఊపిరి

తిరుపతి : సీఎం చంద్రబాబు నిర్ణయంతో పర్యాటక శాఖ ఊపిరి పీల్చుకుంది. తితిదే తిరుమల టూర్ ప్యాకేజీల పునరుద్ధరణకు ఆమోదం లభించడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆధ్యాత్మిక పర్యాటకంలో ముందంజలో ఉంది. ముఖ్యంగా తిరుమల శ్రీవారి దర్శన టూర్ ప్యాకేజీలకు దశాబ్దాలుగా ఆదరణ ఉంది. సంస్థకు వోల్వోలు 6, హైటెక్ 6, మరో ఆరు బస్సులు ఉండగా రెండు నెలలుగా గ్యారేజీకే పరిమితం అయ్యాయి. స్థానిక ఆలయాల దర్శన ప్యాకేజీలు ఆదాయపరంగా గిట్టుబాటు కాకపోవడంతో కాంట్రాక్టు సిబ్బంది 500 మందివరకు విధులకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో సీఎం నిర్ణయంతో సంస్థకు ఊరట లభించినట్లయింది.

**నెలకు రూ.కోటి ఆదాయం**ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థకు రోజుకు వెయ్యి రూ.300 టికెట్లను తితిదే కేటాయించగా వీటిని పర్యాటక శాఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచేవారు. వివిధ మార్గాల్లో నెలకు రూ.3 కోట్ల విలువైన ప్యాకేజీలకుగాను ఖర్చులుపోను రూ.కోటి వరకు ఆదాయం ఉండేది.

**ఏజెంట్ల చేతివాటంతో..** పర్యాటకశాఖ అధీకృత ఏజెంట్లు విక్రయించే టూర్ ప్యాకేజీల్లో ఎక్కువ మంది దర్శనం టికెట్ కోసం మాత్రమే పర్యాటకశాఖ ఏజెంట్లను ఆశ్రయించడంతో వారు చేతివాటం ప్రదర్శించారు. దూరప్రాంత భక్తులు ఇబ్బందులు పడ్డారు.

# అచేతనంగా ఎస్వీయూ ఆరోగ్య కేంద్రం

తిరుపతి : ఎస్వీయూకు అనుబంధంగా ఉన్న ఆరోగ్య కేంద్రంలో సరైన వైద్య సేవలు అందక, రోగానికి తగ్గ మందులు దొరకక ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఏటా మందుల కొనుగోలు, రక్త పరీక్షలకు వినియోగించే రసాయనాలు, ఎక్స్‌రేలు తదితర వైద్య విభాగానికి కావలసిన వస్తువుల సరఫరా నిమిత్తం రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షలు వినియోగించేవారు. వార్షిక బడ్జెట్‌లో రూ.75 లక్షలను వర్సిటీ పాలకవర్గం కేటాయించింది. అందుకు తగ్గట్లుగా నిధులు విడుదలయ్యాయి. మందులు కొనుగోలుకు డిసెంబర్ 12వ తేదీన టెండర్లను పిలవగా ఆరుగురు పాల్గొన్నారు. మూడు మాసాలు గడుస్తున్నా ఇంతవరకు ఖరారు చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. ఆర్థిక సంవత్సరంలో మరో 40 రోజులు ఉండగా అత్యవసర నిధులు సైతం వినియోగించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రూ.2.25 లక్షల మందులు మాత్రమే కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఎస్వీయూలో బోధన, బోధనేతర, విశ్రాంత, టైం స్కేల్, ఎంఆర్ ఉద్యోగులు 3,000 మంది వరకు, విద్యార్థులు మరో 3,000 మంది ఉన్నారు.

**మందుల కొరతపై విద్యార్థుల ధర్నా**

మందుల కొరతపై విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఏజబ్బు వచ్చినా డోలో 650, పారాసెట్‌మాల్ టాబ్లెట్ తప్ప ఇతర మందులు ఇవ్వడం లేదని ఏఐఎస్ఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్ కుమార్, చిన్న ఆరోపించారు. సీనియర్ డాక్టర్ వెంకట సుబ్బారెడ్డి విద్యార్థులను దుర్భాషలాడుతూ వైద్యం సరిగా చేయడం లేదని ఆరోపించారు. వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు సమస్యలు తెలుసుకుని రూ.లక్ష విలువైన ఔషధాలు కొనుగోలు చేయాలని అప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు.

**ఆరోపణలపై విచారణ ఏదీ?**గతంలో ఆరోగ్య కేంద్రంలో పనిచేసిన వైద్యుడు, ఎస్వీయూ ఉద్యోగి వరుసగా 15 ఏళ్లపాటు ఆరోగ్య కేంద్రంలో మందుల కొనుగోళ్లలో తమ చేతివాటం చూపించారనే ఆరోపణలు ఉన్నాయి. కనీసం వారు ఏ మందులు కొన్నారనే అంశాన్ని పరిశీలించిన దాఖలాలు లేవని తెలుస్తోంది.

# గురుకులం.. పేద విద్యార్థులకు వరం..!




విశాఖ : గతంతో పోలిస్తే గురుకుల పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగయ్యాయి. పదో తరగతి, ఇంటర్‌లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగడంతోపాటు ఉత్తమ మార్కులు కూడా సాధిస్తున్నారు. దీంతో ఏటా గురుకులాల్లో ప్రవేశాలకు పోటీ పెరుగుతోంది. ఈ ఏడాది(2025-26) 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. గురుకులాల్లో ఎన్ని సీట్లు ఉన్నాయి.. అర్హులు ఎవరు..ఎప్పటిలోగా దరఖాస్తు చేసుకోవాలనే విషయాలను విశాఖ, అనకాపల్లి జిల్లాల గురుకుల విద్యాలయాల సమన్వయకర్త సి.ప్రభావతమ్మ వివరించారు.

వయస్సు: 5వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు 1-9-2012 నుంచి 31-8-2016 మధ్య జన్మించి ఉండాలి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 31-8-2025 నాటికి 17 సంవత్సరాలు మించకూడదు.

ఆదాయం : తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించకూడదు.

విద్యార్హతలు : 5వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి పూర్తి చేసి ఉండాలి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

ఖాళీలు : జిల్లాలోని ప్రతి గురుకుల పాఠశాలలో బైపీసీ గ్రూపులో 40, ఎంపీసీలో 40 చొప్పున ఖాళీలు ఉన్నాయి. సబ్బవరం బాలుర గురుకుల పాఠశాలలో ఎంఈసీ, సీఈసీ గ్రూపులు కూడా అందుబాటులో ఉన్నాయి. 5వ తరగతిలో ఒక్కో పాఠశాలలో 80 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

దరఖాస్తు చేసుకునే విధానం

విద్యార్థులు నెట్ సెంటర్ లేదా సమీపంలోని గురుకుల పాఠశాలల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్, పాస్‌పోర్టు ఫొటో, స్టడీ సర్టిఫికెట్, తల్లి బ్యాంకు పాస్ పుస్తకం (మొదటిపేజీ), ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నెంబరుతో %apbragcet.apcfss.in% వెబ్‌సైటు ద్వారా 6-3-2025 మధ్యాహ్నం 12 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.

బాలికల విద్యాలయాలు: మేహాద్రి గెడ్డ, కొమ్మాది సెంటర్‌ఫర్ ఎక్సలెన్స్, కోనాం, కొక్కిరాపల్లి, తాళ్లపాలెం, నక్కపల్లి, నర్సీపట్నం

బాలుర విద్యాలయాలు : సబ్బవరం, శ్రీకృష్ణాపురం, దేవరాపల్లి, గొలుగొండ

ప్రవేశ పరీక్ష తేదీ : 6-4-2025న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతికి, అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి పరీక్ష ఉంటుంది.

విద్యార్థులకు మెరుగైన విద్య, సదుపాయాలు: గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేస్తున్నాం. ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణలో నాణ్యమైన విద్యాబోధన అందుతోంది. అన్ని రకాల పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నాం. సీబీఎస్ఈ పాఠ్యప్రణాళిక అమలు చేస్తున్నాం. సాంకేతిక శిక్షణ కూడా ఇస్తున్నాం. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

సి.ప్రభావతమ్మ, విశాఖ, అనకాపల్లి జిల్లాల సమన్వయకర్త

# నిరంతర విద్యుత్తుకు కసరత్తు



విశాఖ : వేసవిలో అంతరాయం లేని విద్యుత్తు సరఫరా అందించేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నామని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు అన్నారు. సరఫరాలో ఇబ్బందులను అధిగమించేందుకు రూ.4.71 కోట్లతో డీటీఆర్ కెపాసిటీని పెంపొందించడం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కొత్త తీగలు, కాసారాల ఏర్పాటు, అవసరమైన చోట విద్యుత్తు స్తంభాలు అమర్చామన్నారు. ఈ వార్షిక ఏడాదికి సంబంధించి చేపట్టిన ఈ పనులు దాదాపు పూర్తి కావచ్చాయన్నారు.

**కొత్తగా రెండు ఫీడర్ల ఏర్పాటు**

మధురవాడ, కొమ్మాది, సాగర్‌నగర్, పీఎంపాలెం ప్రాంతాల్లో మొత్తంగా 4 ఫీడర్ల ద్వారా విద్యుత్తు సరఫరా జరుగుతుంది. వేసవిలో వినియోగం పెరుగుతుండటంతో మరో రెండు కొత్త ఫీడర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో హనుమంతువాక దరి విమ్స్ నుంచి పీఎంపాలెం, ఆనందపురం నుంచి ఐటీహిల్స్ సమీప హరిత వరకు ఫీడర్లు అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. దీని వల్ల సరఫరాలో అవాంతరాలను అధిగమించేందుకు వీలవుతుంది.

జోన్-3 ఈపీడీసీఎల్ పరిధిలో

సెక్షన్లు : 16

ఉప కేంద్రాలు: 54

11కేవీ ఫీడర్లు: 220

33కేవీ ఫీడర్లు : 26

**సరఫరాలో ఇబ్బందులు కలగకుండా**

పీఎంపాలెం, మిధిలాపురి వుడా కాలనీ, రెవెన్యూ, ధర్మపురి కాలనీలు, కొమ్మాది ప్రాంతాల్లో విద్యుత్తు అవాంతరాలు ఎదురవ్వకుండా రూ.78 లక్షలతో 33కేవీ పీఎంపాలెం ఫీడర్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించి కొత్త లైన్ ఏర్పాటు పనులు దాదాపు పూర్తయ్యాయి.

**సుద్దగెడ్డ, చిల్లపేట వద్ద ఉప కేంద్రాలు**

కొత్తగా రెండు చోట్ల 33కేవీ ఉప కేంద్రాలు నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు. ఈ మేరకు మధురవాడ దరి సుద్దగెడ్డ సమీపంలో రూ.3.71 కోట్లు, చిల్లపేట వద్ద రూ.2.55 కోట్లతో కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు త్వరలోనే ప్రారంభించి వేసవిలోనే వినియోగానికి సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆరిలోవ, పైనాపిల్ కాలనీల్లో విద్యుత్తు అంతరాయాన్ని అధిగమించేందుకు రూ.1.11 కోట్లతో 5ఎంఏ సామర్థ్యం కలిగిన పీటీఆర్‌లను 8 ఎంఏ పీటీఆర్‌లుగా మారుస్తున్నారు. ఈ పనులు చివరి దశకు చేరుకున్నాయి.

# లయ తప్పిన ఆలయ పనులు..

విశాఖ : పద్మనాభం క్షేత్రంలో అనంతుని గిరిపై ఉన్న శ్రీ పద్మనాభ స్వామివారి ఆలయ మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం సి.జి.ఎఫ్ నిధులు రూ.60 లక్షలు మంజూరు చేయగా మరమ్మతు పనులకు గత ఏడాది ఫిబ్రవరిలో శంకుస్థాపన జరిగింది. మార్చిలో పనులు ప్రారంభించారు. పిడుగుపాటుకు గురైన ఆలయ శిఖరం తొలగించి పునఃనిర్మించడం, అర్థమండపం, ముఖమండపం మరమ్మతు పనులు చేయాలి. పనులు పూర్తి కాకపోవడంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ స్వయంగా పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆలయ శిఖరం పనులు మాత్రమే గత డిసెంబర్‌కి పూర్తి చేశారు.

**మొదట్నుంచీ నిర్లక్ష్యమే:** గుత్తేదారు తనకు ఇష్టం వచ్చినప్పుడు పనులు చేస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన అనంతుని జయంత్యుత్సవాలకు మరమ్మతు పనులు పూర్తవుతాయని ఎదురు చూసిన భక్తులకు నిరాశే మిగిలింది. దీపోత్సవం నాటికి (నవంబర్ 30) అయినా పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించినా అలా కాలేదు. దీపోత్సవం వారం రోజులు ఉందనగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఉత్సవ నిర్వహణపై సమీక్ష నిర్వహించినప్పుడు అధికారులపై తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో రోడ్డు నిర్మాణ పనులు, ఆలయ మరమ్మతులు, శిఖర ప్రతిష్ఠ చేసి తీరాలన్నారు. దీంతో తొలగించిన ఆలయ శిఖర భాగాన్ని పూర్తి చేశారు. మిగిలిన పనులు ఎక్కడవి అక్కడే ఉన్నాయి. ఇటీవలే శిఖరంపై విగ్రహాల పనులు ప్రారంభించినా మందకొడిగా సాగుతున్నాయి.



**నాలుగు ముహూర్తాలు:**

ఆలయం శిఖర ప్రతిష్ఠాపనకు అర్చకులు ఇప్పటికి మూడు ముహూర్తాలు పెట్టారు. 2024 దీపోత్సవం ముందు రెండు ముహూర్తాలు పెట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఒక ముహూర్తం పెట్టారు. ఈ మూడు ముహూర్తాలకు పనులు పూర్తి కాలేదు. స్వామివారి కల్యాణోత్సవాల (మార్చి 9 నుంచి 15) తరువాత మార్చి 17న ఆలయ శిఖర ప్రతిష్ఠకు మళ్లీ ముహూర్తం పెట్టారు. పనులు ఇలాగే సాగితే వచ్చే దీపోత్సవం నాటికి అయినా అయ్యే పరిస్థితి లేదని భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సౌకర్యం అందుబాటులోకి వచ్చిన తరువాత నిత్యం వందలాది మంది భక్తులు కార్లు, ద్విచక్ర వాహనాలపై కొండపైకి వెళుతున్నారు. అక్కడ మూసి ఉన్న ఆలయ ప్రాంగణాన్ని, చిందర వందరగా పడి ఉన్న నిర్మాణ సామగ్రిని చూసి ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. ఆలయ ఈవో ఎస్.నానాజీ బాబు వద్ద ప్రస్తావించగా మార్చి17న ప్రతిష్ఠాపన జరగడం కష్టమని పేర్కొన్నారు.

# ఇంజినీరింగ్ విభాగాల్లో ఇన్‌ఛార్జిలే దిక్కు

చిత్తూరు : గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగాలకు పర్యవేక్షక ఇంజినీర్లుగా ఇన్‌ఛార్జులే చాలాకాలంగా కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వారే కొనసాగుతుండడం గమనార్హం. దీంతో ఆ అధికారులు వారి ఉద్యోగానికి న్యాయం చేయలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ పనుల పర్యవేక్షణలో ఇబ్బందులు పడుతున్నారు.

**పంచాయతీరాజ్‌లో..**

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో ఇన్‌ఛార్జిగా ఉన్న ఎస్ఈ రికార్డుల ప్రకారం పెనుగొండ ఈఈగా పనిచేస్తున్నారు. వైకాపా పాలనలో జిల్లాకు చెందిన మంత్రి అండదండలతో పాటు ఈఎన్సీ మౌఖిక ఆదేశాలతో జిల్లాకు ఓడీ(ఆన్ డ్యూటీ)పై పీఆర్ఐ ఈఈగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న అధికారి శ్రీనివాస్ పెనుగొండకు అదేవిధంగా వెళ్లారు. ఇక్కడ ఉన్న అధికారి పెనుగొండ డిజిటల్ కీ,



అక్కడ అధికారి చిత్తూరు డిజిటల్ కీని వినియోగిస్తున్నారని సమాచారం. అక్కడ పనులకు సంబంధించి ఇక్కడి నుంచి డిజిటల్ కీ ద్వారా ఆమోదం తెలుపుతుండగా అక్కడ అధికారి ఇక్కడి పనులను ఆమోదిస్తున్నారని తెలిసింది. జీతాలు కూడా అదేవిధంగా తీసుకుంటున్నారు. ఈ విధంగా పనిచేయడం నిబంధనలకు విరుద్ధమని పలువురు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేసిన ఇన్‌ఛార్జి ఎస్ఈ అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లగా అప్పటి నుంచి ఓడీపై వచ్చిన ఈఈకి ఇన్‌ఛార్జి ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో అధికారులు, రాజకీయ నాయకులు, గుత్తేదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**ఆర్‌డబ్ల్యూఎస్‌లో..**

తిరుపతి ఈఈగా ఉన్న విజయ్‌కుమార్ చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్ఈగా గత వైకాపా, ఇప్పటి కూటమి ప్రభుత్వంలో కొనసాగుతున్నారు. జిల్లాల విభజన జరిగిన సమయంలో చిత్తూరు ఈఈగా ఉన్న అధికారి తిరుపతి ఈఈగా బదిలీపై వెళ్లారు. ఇప్పుడు తిరుపతి, చిత్తూరు జిల్లాల ఇన్‌ఛార్జి ఎస్ఈగా పనిచేస్తున్నారు. ఆ అధికారి 2015 ఫిబ్రవరి 11 నుంచి ఇప్పటి వరకు ఐదుసార్లు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్ఈగా పనిచేయడంతో పాటు ఇంకా కొనసాగుతున్నారు. రెండు జిల్లాలకు ఒకే అధికారి పనిచేయడం ద్వారా పర్యవేక్షణ లోపంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నారని ఉన్నతాధికారులు నిర్వహించే సమీక్షలో బహిర్గతం అవుతున్నాయి.

# రుయాలో జీతం.. బయట సొంత వైద్యం

తిరుపతి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో లేక సామాన్య రోగులు నాణ్యమైన వైద్యానికి దూరమవుతున్నారు. పడకల సామర్థ్యం మేరకు నియామకం జరుగుతున్నా.. రోగులకు మాత్రం అందుబాటులో ఉండటం లేదు. కొంతమంది ఉదయం, సాయంత్రం వచ్చి వెళ్తూ సొంత క్లినిక్‌లపై దృష్టి పెడుతున్నారు. మరికొందరు అనధికార సెలవులో ఉంటూ సొంత క్లినిక్‌లు, ఆసుపత్రుల నిర్వహణలో నిమగ్నమవుతున్నారు. మరోవైపు ఆస్పత్రుల్లో వైద్యులను నియమించాం.. అక్కడ మెరుగ్గా వైద్యసేవలు అందుతున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. నిజానికి ప్రభుత్వ ఆస్పత్రుల్లోని కొందరు వైద్యులు పీజీ, హౌస్‌సర్జన్లపై భారం మోపి పూర్తిగా సొంత పనులకు పరిమితమవుతున్నారు. అలాంటి వారిపై ప్రభుత్వం దృష్టి సారించింది. మొదటగా అనధికార సెలవులో ఉన్నవారిని గుర్తించి షోకాజ్ నోటీసులు



పంపింది. 15 రోజుల్లోపు స్పందించకుంటే నియామకాలు రద్దు చేయనున్నట్లు ఈనెల 10వ తేదీన స్పష్టం చేసింది. ఇలాంటివారు రాష్ట్రంలో 91 మంది ఉండగా రుయాలోనే 14 మంది ఉన్నారు.

రుయా ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాబ్ మినహా 18 విభాగాలు ఉండగా 158 మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. అందులో 14 మంది వైద్యులు దీర్ఘకాలంగా విధులకు హాజరు కావడం లేదు. నెఫ్రాలజీ విభాగానికి చెందిన వైద్యురాలు పావని, ఓబీజీ విభాగానికి చెందిన వైద్యులు తనూజ, గీతావాణి, వంశీప్రియ, మంజు యాదవ్, న్యూరాలజీ విభాగంలో జి.రాజశేఖర్, పీడియాట్రిక్స్‌కు చెందిన జి.సాయిప్రసన్న, దిలీప్ సత్య, రామగణేష్, జనరల్ సర్జరీ విభాగానికి చెందిన వైద్యులు అజయ్‌బాబు, అజగముత్తు, రేడియోథెరపీ విభాగం వైద్యులు ఆర్ముగం, జనరల్ మెడిసిన్ విభాగం వైద్యుడు రంగనాథం, సైకియాట్రీ విభాగం వైద్యుడు రాధాకృష్ణరాజు ఈ జాబితాలో ఉన్నారు. వీరిలో కొందరు గత ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో రుయాకు రాగా అప్పటి నుంచి విధులకు హాజరుకానట్లు సమాచారం.

చురకలు




# ఉల్లంఘనులు

నంద్యాల : జిల్లాలో గనులను లీజుకు తీసుకున్న కొందరు వాటిలో మైనింగ్ చేయడం లేదు. ఫలితంగా అటు ప్రభుత్వం ఆదాయం కోల్పోవడమేకాక ఇతర ఔత్సాహికులు ఈ రంగంలో రాలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లా పరిధిలో 13 వేల ఎకరాల్లో గనులు విస్తరించి ఉన్నాయి. నంద్యాల గనుల శాఖ కార్యాలయ పరిధిలో 19 సున్నపురాయి గనులు, 66 నాపరాయి గనులు, ఆరు మెటల్ క్వారీ లీజులు ఉన్నాయి. బనగానపల్లి కార్యాలయం పరిధిలో 82 పెద్ద గనులు, 199 చిన్న తరహా గనులు ఉన్నాయి. నాపరాయి, కంకర గనుల లీజులు పదేళ్లకు ఒకసారి.. మిగతా పెద్ద తరహా గనులను 20 ఏళ్లకు ఒకసారి లీజుకు ఇస్తారు. నంద్యాల పరిధిలో 25, బనగానపల్లి కార్యాలయ పరిధిలో నాలుగు మండలాలు ఉన్నాయి. జిల్లాలో సున్నపురాయి, బైరటీస్, ఇనుప ఖనిజం, పైట్ పేల్, క్వార్ట్జ, సిలికాశాండ్, గ్రానైట్ తదితర ఖనిజాలు ఉన్నాయి. వీటి లీజులు చాలాకాలంగా కొందరి చేతుల్లోనే ఉన్నాయి.

**అక్రమ రవాణా చేసి..**

జిల్లాలో గనుల లీజు అనుమతులకు సంబంధించి గత వైకాపా ప్రభుత్వ



హయాంలో కొందరు అడ్డగోలుగా వ్యవహరించారు. పర్యావరణ అనుమతులు రాకున్నా క్వారీల నుంచి పెద్దఎత్తున రవాణా చేశారు. ఒకవైపు మైనింగ్ జరగలేదని చెబుతున్నా పెద్దఎత్తున అక్రమంగా మైనింగ్ చేసి రాయల్టీ, జీఎస్టీ ఎగ్గొట్టారు. ఒకచోట అనుమతి తీసుకుని మరోచోటు నుంచి రవాణా చేశారు. అప్పట్లో అధికార పార్టీ అండతో ఇష్టారాజ్యంగా కంకర, నాపరాయి, డోలమైట్ తదితరాల రవాణా జరిగింది. ప్రత్యేకించి డోన్, ప్యాపిలి నుంచి క్వార్ట్జ అక్రమంగా రవాణా చేశారు. గ్రానైట్ అక్రమ రవాణాకూ అడ్డూఅదుపు లేకుండా పోయింది. గడివేముల మండలం ఎల్‌కే తండా, గని, శకునాల తదితర ప్రాంతాల్లో క్వారీలకు అనుమతులు లేకున్నా మైనింగ్ చేశారు. బేతంచెర్ల మండలంలో.. రంగాపురం, యంబాయి గ్రామాల్లో ఐరన్‌ఓర్‌కు అనుమతులున్నా కొన్నిచోట్ల తవ్వకాలు జరగలేదు. పేరుకు లీజుకు తీసుకున్న చోట్ల మైనింగ్ చేయకుండా ఆ పేరుతో మరోచోట తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకున్నారు.

**పర్యావరణ అనుమతుల పేరిట..**

గనులు లీజులు తీసుకున్న తర్వాత పర్యావరణ అనుమతులు (ఈసీ) తీసుకోవడం తప్పనిసరి. ఈ అనుమతులుంటేనే మైనింగ్ చేయడం, రవాణా చేయాలి. గత వైకాపా ప్రభుత్వం.. గనుల నుంచి పెద్ద ఎత్తున ఆదాయం రాబట్టుకునేందుకు రాయల్టీని ఒకేసారి 10 రెట్లు పెంచింది. ఫలితంగా చాలామంది మైనింగ్ చేయడం మానుకున్నారు. ఇదేమని మైనింగ్ అధికారులు ప్రశ్నిస్తే పర్యావరణ అనుమతులు రాలేదని చెప్పి మైనింగ్ చేయడం లేదు. జిల్లాలో 160కు పైగా గనుల్లో మైనింగ్ జరగడం లేదు. బనగానపల్లి కార్యాలయం పరిధిలో 281 గనులు ఉండగా ఇందులో 160 గనుల్లో మాత్రమే మైనింగ్ జరుగుతోంది. నంద్యాల కార్యాలయం పరిధిలో 82 మైనింగ్ లీజుల్లో 39 వరకు పనిచేయడం లేదు.

జిల్లాలో గనుల విస్తీర్ణం : 13 వేల ఎకరాలు
ఆదాయ లక్ష్యం : రూ.177.55 కోట్లు
జిల్లాలో వివిధ రకాల లీజులు : 372
ప్రస్తుతం మైనింగ్ జరిగే విస్తీర్ణం : 6 వేల ఎకరాలు
జిల్లా పరిధిలో లభించే ఖనిజాల సంఖ్య : 16

# 53 మండలాలు.. 53 గ్రామాలు

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మండలంలో ఒక గ్రామం చొప్పున రెండో విడత రీసర్వే చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం 53 మండలాల్లో.. 53 గ్రామాల్లో రీసర్వే చేయనున్నారు. ఎలాంటి తప్పులకు తావులేకుండా పకడ్బందీగా సర్వే చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. తక్కువ విస్తీర్ణం ఉండే గ్రామాల్లో రెండేసి బృందాలు, ఎక్కువ విస్తీర్ణం ఉన్న గ్రామాల్లో నాలుగేసి బృందాలు సర్వే చేస్తాయి. ఒక్కో బృందంలో ఒక వీఆర్వో, ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక రెవెన్యూ సహాయకులు ఉంటారు. ఒక్కో బృందం రోజుకు 20 ఎకరాల్లో సర్వే చేసి.. అదే రోజు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

**రైతుల సమక్షంలోనే..**గత ప్రభుత్వ హయాంలో రీసర్వే ప్రక్రియ గందరగోళంగా మారింది. బృందానికి ప్రతిరోజూ లక్ష్యం విధించడం.. తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడంతో వారు ఇష్టానుసారంగా సర్వే చేశారు. రైతులు లేకపోయినా కొలతలు వేశారు. ఫలితంగా చాలామంది భూ విస్తీర్ణాల్లో తేడాలు వచ్చాయి. సమస్యను అధికారులకు, పాలకులకు



విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుల సమక్షంలోనే సర్వే చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. ఫలితంగా ఎలాంటి తప్పులకు తావులేకుండా పారదర్శకంగా రీసర్వే పూర్తి చేయొచ్చు. **ఆయా డివిజన్ల పరిధిలో..**

కర్నూలు జిల్లాలో ఆదోని డివిజన్ పరిధిలో తొమ్మిది మండలాల్లో ఎంపిక చేసిన 9 గ్రామాల్లో, కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏడు గ్రామాలు, పత్తికొండ డివిజన్ పరిధిలో 9 గ్రామాల్లో కలిపి మొత్తం 25 గ్రామాల్లో 1,29,015.07 ఎకరాల్లో సోమవారం నుంచి రెండో విడత రీసర్వే ప్రారంభించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 53 మండలాల పరిధిలో ఎంపిక చేసిన 53 గ్రామాల్లో 2,21,791.97 ఎకరాల్లో సర్వే చేయనున్నారు.

# కబ్జాదారులపై కొరడా ఝుళిపించేదెప్పుడో?



కొత్తూరు : అనకాపల్లిలోని శారదానదిని ఆనుకొని జిల్లా పరిషత్తుకు చెందిన రూ. కోట్ల రూపాయలు విలువ చేసే 11 ఎకరాల స్థలం కబ్జాపై ఇంకా యంత్రాంగం నిర్లక్ష్యం వీడటం లేదు. ఇక్కడి ఆక్రమణల విషయంపై అధికారుల నిర్లిప్త ధోరణిపై ప్రజా ప్రతినిధుల్లోనూ ఆగ్రహం పెల్లుబికుతోంది. కొత్తూరు పంచాయతీ పరిధిలో ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ తుమ్మపాల రెవెన్యూ పరిధిలోని సర్వే సంఖ్య 582(2), 583(1), 584, 588(4), 590(18), 593(3), 597(1) లలో సుమారు 11 ఎకరాలను కొనుగోలు చేశారు. ఇందులోని 3.40 ఎకరాల భూమిని ముత్రాసుకాలనీ ప్రాథమికోన్నత పాఠశాలకు కేటాయించారు. ఈ పాఠశాలను భవిష్యత్తులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా చేయాలనే ఉద్దేశం. ప్రస్తుతం ఈ పాఠశాల ఆధీనంలో 40 సెంట్ల భూమి కూడా లేదు. జిల్లా పరిషత్ మినిస్టీరియల్ ఉద్యోగుల నివాసాలకు, సంఘ భవనానికి 1.80 ఎకరాలను కేటాయించినా ఇది కూడా కానరావడం లేదు. ఈ స్థలాలు కబ్జాలకు గురి కావడంతో పాటు ఆ ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం, కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. వీటిని కాపాడటానికి ఈ ప్రాంతానికి చెందిన సహ చట్టం కార్యకర్త చింతా గోపి సుమారు 02.03.2021న అధికారులకు ఫిర్యాదు చేశారు. 2021 మే నెలలో అప్పటి జిల్లా పరిషత్తు ముఖ్యకార్యనిర్వహణాధికారి నాగార్జున సాగర్, అనకాపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి వసంతరాయలు, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. పక్కాగా సర్వే చేసి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించినా ఇంతవరకూ ఎటువంటి దాఖలాలు లేవు. విశాఖలో రెండు రోజుల క్రితం జిల్లా పరిషత్తు సమావేశంలో అనకాపల్లి జడ్పీటీసీ సభ్యుడు పెతకంశెట్టి జోసఫ్ ఇక్కడి ఆక్రమణలపై ఎండగట్టారు. ఈ నేపథ్యంలో కొత్తూరుతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న స్థలాలపై మార్చి నెలాఖరులోగా సర్వే చేసి పూర్తి వివరాలు అందజేయాలని జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర ఆదేశించారు. సీఈఓ పి.నారాయణమూర్తి జడ్పీ స్థలాలను కాపాడతామని, ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని సభకు హామీ ఇచ్చారు.

**త్వరలోనే సర్వే..**

జిల్లా పరిషత్తుకు పెద్ద ఎత్తున ఆస్తులు, భూములు, స్థలాలు, వసతి గృహాలు ఉన్నట్లు శనివారం జరిగిన సమావేశంలో ప్రకటించారు. నాతోపాటు పలువురు సభ్యులు వివరణ కోరగా కొత్తూరులో సుమారు 11 ఎకరాలు భూములు ఉన్నాయని చెప్పారు. ఇక్కడ మొత్తం నిర్మాణాలే తప్ప ఎటువంటి ఖాళీ స్థలాలు లేవు. త్వరలోనే సర్వే ప్రారంభం అవుతుంది. పెతకంశెట్టి శివ సత్యనారాయణ జోసఫ్, జడ్పీటీసీ సభ్యుడు

**ఆరేళ్లుగా కృషి చేస్తున్నా...**

కొత్తూరులో ఆక్రమణలకు గురైన స్థలాలను పరిరక్షించడానికి కృషి చేస్తున్నాను. ప్రజావసరాలకు జిల్లా పరిషత్తు కొనుగోలు చేసిన స్థలాన్నే కబ్జా చేశారు. పాఠశాల స్థలం కూడా కబ్జా చేసిన కారణంగా ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసే అవకాశం లేకపోయింది. భూములను ఆక్రమించుకుని భారీ భవనాలను నిర్మించుకున్నారు. దీనిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలి. చింతా గోపి, సహ చట్టం కార్యకర్త, కొత్తూరు

# ఆ దాడి.. మనకే ఎదురైతే?



నర్సీపట్నం : ముంబయిలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై ఈనెల 16న జరిగిన దాడి దేశవ్యాప్తంగా కలకలం సృష్టించడం తెలిసిందే. ఈ హీరో తన ఇంట్లోనే ఓ దుండగుడు చేతిలో కత్తిపోట్లకు గురై ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆ ఇంట్లో ఇద్దరు పిల్లలు, సహాయకురాలైన ఓ మహిళ ఉన్న గదిలోకి ఈ దుండగుడు ప్రవేశించి హల్‌చల్ చేశాడు. ఇందుకు కారణాలు ఏవైనప్పటికీ ఈ ఘటన అందరికీ గుణపాఠంగా మారింది.

ప్రస్తుతం జిల్లాలోని అన్ని పట్టణాల్లో శివారు ప్రాంతాలు విస్తరిస్తున్నాయి. జన సంచారం తక్కువగా ఉండేచోటా నివాసాలు పెరిగాయి. ఇలాంటి ప్రాంతాల్లో దొంగలు, దోపిడీదారుల భయం ఎక్కువగానే ఉంటుంది. యువతులు ఒంటరిగా ఉన్నప్పుడు ఆకతాయిల నుంచి వేధింపులూ ఎదురవుతుంటాయి. ఇలాంటి ఆపదల ఎదురైనప్పుడు భయపడకుండా చిన్నపాటి మెలకువలు తెలిస్తే దుండగులను ఎదుర్కోవచ్చు... శరీర బలంతో సంబంధం లేకుండా వ్యూహాత్మకంగా శత్రువుని మట్టి కరిపించవచ్చు. ముంబయిలో సైఫ్‌పై దాడి తరహా ఘటనలు ఎదురైతే చురుగ్గా ఎలా వ్యవహరించాలో.. ఆపద నుంచి ఏ విధంగా బయటపడాలో యుద్ధవిద్యల్లో నైపుణ్యం ఉన్నవారు వివరిస్తున్నారు.

**కత్తితో వస్తే..**

కత్తితో వెనుక నుంచి దాడికి పాల్పడితే ఊహించని వేగంతో ఆగంతకుని చేతిని పట్టుకునేందుకు ప్రయత్నించాలి. అదే వేగంతో కాలితో ఎదుటి వ్యక్తి కాలిని వెనుక నుంచి తన్ని పడిపోయేటట్టు చేయాలి. అదేవిధంగా మెడపై కత్తిని ఉంచితే వేగంగా కొంచెం కిందకు వంగి అవకాశముంటే పళ్లతో చేతిపై గట్టిగా కరవాలి. దీంతో కత్తి జారవిడిచే అవకాశం ఉంది.

**ఆకతాయిల పని పట్టొచ్చిలా..**

కరాటే, కుంగ్‌ఫూ, బాక్సింగ్, వుషూ తదితర యుద్ధ విద్యలు ఆకస్మిక దాడులను తక్కువ శక్తితోనే సమర్థంగా ఎదుర్కొనే ధైరాన్ని ఇస్తాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు కోచ్‌లు కొందరు పిల్లలకు యుద్ధకళలను నేర్పుతున్నారు. ఏడేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులతో శిక్షణ ఇప్పించేవారు. ఇలాంటి శిక్షణలు కొన్నేళ్లుగా జరగడం లేదు. ముఖ్యంగా అమ్మాయిలకు యుద్ధవిద్య తెలిసి ఉంటే వేధింపులకు గురిచేసే వ్యక్తిని పక్కన చూపిన విధంగా అడ్డుకునే అవకాశం ఉంది.

**ఆయుధంతో మీదకొస్తే..**

ఆయుధంతో కొట్టేందుకు ప్రయత్నిస్తే ముందుగా ఇలా ఆయుధం ఉన్న చేతిని పట్టుకునేందుకు ప్రయత్నించాలి. అదే ఊపుతో ఆ వ్యక్తి కాలి వెనుక వైపు మన కాలితో తంతే కింద పడిపోతారు.

ఎదురుదాడి చేసే సమయంలో పిడికిలిని బిగించి బలంగా సుత్తితో మేకును కొట్టినట్టుగా దాడి చేయాలి. అవకాశముంటే బొటనవేళ్లతో రెండు కళ్లలోకి పొడవాలి. ముక్కు, మెడపైనా కొట్టేందుకు ప్రయత్నించాలి.

చైతన్యం పెంచాలి...: మార్షల్‌ఆర్ట్స్‌కు పట్టణాల్లో ఆదరణ ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలను శిక్షణ కేంద్రాలకు పంపిస్తున్నారు. గ్రామాల్లో చైతన్యం లేదు. పల్లెల్లో అవగాహన కల్పించి ఉచిత శిక్షణల ద్వారా నైపుణ్యాలు నేర్పించాలి. రాణించినవారిని ప్రోత్సహించాలి. స్వీయరక్షణపై మహిళలు జాగరూకులై ఉండాలి.
పల్లెల వీరబాబు, మార్షల్ ఆర్ట్స్ కోచ్, నర్సీపట్నం.

**మానసికంగా దృఢంగా ఉండాలి**

ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణపై దృష్టి పెట్టాలి. అకస్మాత్తుగా ఆగంతకులు దాడికి పాల్పడితే తప్పించుకునే ప్రయత్నంలో ధైర్యంగా ఉండాలి. అందుబాటులో ఉన్న వస్తువునే ఆయుధంగా చేసుకోవాలి. దానివల్ల వెనకడుగు వేసే అవకాశం ఉంటుంది. ఎదురు దాడి చేసేందుకు కళ్లు, గొంతు, ముక్కు భాగాలను ఎంచుకోవాలి. దీంతోపాటు అవకాశం ఉన్నప్పుడు ఎదుట వ్యక్తిని కాలితో కిందకు పడవేసే చిన్న చిట్కాను సాధన చేయాలి. గండి త్రినాథ్, ఉమ్మడి విశాఖ జిల్లా పోలీసు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఇన్‌స్ట్రక్టర్

# పాడికి భరోసా

కర్నూలు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశుసంపద, పాడి రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉచితంగా గ్రాసం పెంపకానికి ఉపాధి నిధులు సమకూర్చడం, పశువులు, జీవాలకు గోకులం షెడ్లు మంజూరు చేసింది. తాజాగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈనెలాఖరు వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో గేదెలు, ఆవులు, ఎద్దులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించడం, గొర్రెల్లో బొబ్బ వ్యాధి నివారణకు టీకాలు వేయనున్నారు. పశువులకు ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు మెరుగైన వైద్యం అందించనున్నారు. ప్రతి మండలంలో రెండు బృందాలు పశు ఆరోగ్య శిబిరాల్లో పాల్గొననున్నాయి.

**సేవలు ఇలా..** కర్నూలు జిల్లాలో ఒక బహుళార్ధ పశు వైద్యశాల, 11 ప్రాంతీయ పశు వైద్యశాలలు, 66 పశు పర్యవేక్షక కేంద్రాలు, 76 గ్రామీణ పశు వైద్య కేంద్రాలు, 392 రైతు సేవా కేంద్రాల పరిధిలో పశు వైద్య అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో సేవలు అందించనున్నారు. నంద్యాల జిల్లాలో 15 పశు వైద్యశాలలు, 74 పశు పర్యవేక్షక కేంద్రాలు, 99 గ్రామీణ పశు వైద్య కేంద్రాలు, 350కిపైగా రైతు సేవా కేంద్రాల ద్వారా అధికారులు,



సిబ్బంది సేవలు అందిస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా పెద్ద పశువులకు ఈసారి నట్టల నివారణ మందులను ప్రభుత్వం సరఫరా చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం పశు సంపద, జీవాల్లో 80 శాతం మేర మందులను సరఫరా చేశారు. 6.58 లక్షల పశువులు, 20.75 లక్షల మేకలు, గొర్రెలకు కలిపి మొత్తం రూ.1.72 కోట్ల విలువ చేసే మందులను ఆయా కేంద్రాలకు చేరవేశారు.

# రక్తహీనత.. వెన్నాడుతున్న రుగ్మత


కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మహిళలు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత సమస్య తీవ్రంగా ఉంది. గర్భం దాల్చిన నెల నుంచి ప్రసవం తర్వాత ఆరు నెలల వరకు మహిళలకు పౌష్టికాహార కిట్లు ఇచ్చి వారి ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నారు. అయినప్పటికీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15,408 మంది గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో బాధపడుతున్నారు.

**పరిస్థితి గుర్తించక..**

రక్తహీనత కారణంగా పలు ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. రక్తహీనతను చాలామంది తీవ్రమైన సమస్యగా గుర్తించడం లేదు. వాస్తవానికి వైద్యులను సంప్రదించి ఓపక్క మందులు వాడుతూ మరో పక్క మంచి ఆహారం తీసుకుని రక్తహీనత సమస్య తగ్గించుకోవడంతోపాటు ఎప్పటికప్పుడు పరీక్షలు చేసుకుంటూ ఉండాలి. చాలామందిలో ఆ రకమైన శ్రద్ధ లేకపోవడంతో వారి ఆరోగ్యానికి శాపంలా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో మహిళలు, పిల్లలు కలిపి 50 వేల మందికిపైగా రక్తహీనత సమస్యతో బాధపడుతున్నట్లు అధికారికంగా చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఈ సంఖ్య రెండింతలకుపైగా ఉంటుందని అంచనా. **ఆరోగ్యంపై దృష్టి సారించక..**

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పోషకాహారాన్ని చాలామంది గర్భిణులు, బాలింతలు సరిగా తీసుకోవడం లేదు. కొందరు చిన్న వయసులోనే వివాహాలు చేసుకుంటున్న నేపథ్యంలో ఆరోగ్యంపై అసలు దృష్టి పెట్టడంలేదు. గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కార్యకర్తలు తగిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలు చెబుతుంటారు. వాటిని సరిగా పాటించడం లేదు.

కర్నూలు పశ్చిమ ప్రాంతం నుంచి ఏటా 2.5 లక్షల మంది వలస వెళ్తుంటారు. వారిలో గర్భిణులు, బాలింతలు ఉంటున్నారు. అలా




వెళ్లినప్పుడు ఆరోగ్యంపై దృష్టి పెట్టడంలేదు. ప్రభుత్వం ఇచ్చే బాలామృతం, బాల సంజీవిని కిట్లను కొందరు తీసుకోవడంలేదు.

**పిల్లల్లో పరిస్థితి మరింత తీవ్రం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 35,364 మంది పిల్లలు బరువు తక్కువ సమస్యతో బాధపడుతున్నారు. వారిలో అత్యధికులు రక్తహీనత సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. తగినంత పౌష్టికాహారం అందకపోవడంతో వయస్సుకు తగ్గట్టు బరువు పెరగలేకపోతున్నారు. ఫలితంగా పలురకాల అనారోగ్యాలకు గురవుతున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల వయస్సున్న పిల్లల ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతం 2.5 కిలోల ప్యాకెట్ ఇస్తారు. రోజూ వంద ఎం.ఎల్. పాలు, నెలకు 25 గుడ్లు ఇస్తారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు రోజూ 100 ఎం.ఎల్. పాలు, ఒక ఉడకబెట్టిన గుడ్డు, ఒక రోజు ఆకుకూర పప్పు, ఒకరోజు కూరగాయలతో సాంబారు, ఒకరోజు వెజిటబుల్ రైస్ ఇస్తారు. ఆ ఆహారం ఇచ్చేందుకు ఒకరికి కేవలం రూ.2.30 మాత్రమే ఇస్తుండటంతో ఆ మొత్తం సరిపోవడం లేదు. ఫలితంగా పిల్లలకు రుచికరమైన ఆహారం అందడం లేదు.

ఉమ్మడి జిల్లాలో రక్తహీనతతో బాధపడేవారి వివరాలు
జిల్లా: నంద్యాల మహిళలు: 4,400 పిల్లలు: 8,816 జిల్లా: కర్నూలు మహిళలు: 11,008 పిల్లలు: 26,548

# సచివాలయం.. సేవలు పారదర్శకం

కర్నూలు : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ప్రజల చెంతకు సేవలను మరింత చేరువ చేయాలని కీలక నిర్ణయం తీసుకొంది. ఉద్యోగుల హేతుబద్ధీకరణపై దృష్టి సారించింది. ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి సిబ్బంది సమాచారాన్ని సేకరించింది. త్వరలో మార్పులు.. చేర్పులకు శ్రీకారం చుట్టనుంది.

**ఎక్కడెక్కడ వినియోగిస్తారంటే..**

నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, ఆహార శుద్ధి, మార్కెటింగ్, ఉపాధి కోసం ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఔత్సాహిక యువతను గుర్తించి ప్రోత్సహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎక్కడైతే ఎక్కువమంది సిబ్బంది ఉన్నారో గుర్తించి అవసరమైన ప్రాంతాలకు సర్దుబాటు చేసేలా కసరత్తు చేస్తున్నారు.

**వారిపై అదనపు పనిభారం**

వైకాపా పాలనలో రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలకు స్థానికంగా సేవలందించే పేరుతో భారీ సంఖ్యలో సిబ్బందిని భర్తీ చేశారు. నాటి పాలకుల ముందుచూపు లేమితో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో కొంతమంది సిబ్బందికి పని తక్కువగా ఉండగా.. మరికొంత మందికిపై భారం పడుతోంది. మహిళా పోలీసు, ఎనర్జీ సహాయకులు ఎక్కువగా ఉన్నారు. ధ్రువపత్రాల జారీలో డిజిటల్, వెల్ఫేర్ సహాయకులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరి సంఖ్య మాత్రం తక్కువగా ఉంది. చాలాచోట్ల ఇన్‌ఛార్జులే అదనపు బాధ్యతలు మోస్తున్నారు.

**హేతుబద్ధీకరణతో సత్ఫలితాలు**

కర్నూలు జిల్లాలో 762, నంద్యాల జిల్లాలో 419 మంది కలిపి ఉమ్మడి జిల్లాలో 1,181 మంది ఇన్‌ఛార్జులు పనిచేస్తున్నారు. కొన్ని సచివాలయాల్లో సాంకేతిక సహాయకులు లేకపోవడంతో ఆ పనులన్నీ వెల్ఫేర్ అసిస్టెంట్, ఇతర సిబ్బందిపై పడుతోంది. పనిభారంతో తీవ్రమైన ఒత్తిడి పెరుగుతోంది. గ్రామ సచివాలయాల్లో తగినంత సిబ్బందిని నియమిస్తే పనులు సులభంగా, త్వరితగతిన చేసేందుకు అవకాశం ఉంటుంది. **ఉన్నత విద్యావంతులకు అవకాశాలు**

సచివాలయం ఉద్యోగుల్లో చాలామంది ఇంజినీరింగ్, డిప్లొమో, పీజీ, పీహెచ్‌డీ చేసినవారు ఉన్నారు. వీరి సేవలను క్షేత్రస్థాయిలో వినియోగించేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీఎఫ్‌ఎంఎస్ ఐడీ, చరవాణి సంఖ్య, లింగం, విద్యార్హత, కులం వివరాలు సేకరించారు. బీటెక్, ఎంటెక్‌లో ఈసీఈ, సీఎస్‌ఈ, మెకానికల్, సివిల్, పీజీ, పీహెచ్‌డీ చేసిన వారి వివరాలు తీసుకొన్నారు.

# పండ్ల మొక్కల పెంపకంలో భేష్

కళ్యాణదుర్గం : పండ్ల తోటల పెంపకంలో రైతులను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఉచితంగా పండ్ల మొక్కలు అందించి తోడ్పాటు కల్పించింది. ఈ పథకం కింద పండ్ల మొక్కల సాగులో కళ్యాణదుర్గం నియోజకవర్గం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాంత రైతులు తోటల సాగులో ఆసక్తి చూపడం గమనార్హం. అనంతపురం జిల్లాలో 3,006 మంది రైతులు 9,167.56 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటారు. ఇందులో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 1,394 మంది రైతులు 4,606.23 ఎకరాల్లో మొక్కలు నాటి ప్రథమ స్థానానికి చేరుకొన్నట్లు అధికారులు చెబుతున్నారు.పండ్ల సాగుకు ఉత్సాహంగా ముందుకొచ్చిన రైతులకు ఎకరాకు మామిడి మొక్కలు 70, చీనీ 110, సపోట 60, డ్రాగన్ ఫ్రూట్స్



మొక్కలు 230, దానిమ్మ 235, పూల మొక్కలు అర ఎకరాకు అందజేశారు. ఈ పంటలు సాగు చేసిన రైతులకు ఎకరాకు నెలకు నీటి బిల్లులు రూ.1,526, సంరక్షణకు రూ.2,500 ప్రభుత్వం అందజేయనుంది.

**రైతులకు మరింత ప్రోత్సాహం కల్పిస్తాం: రమేశ్ నాయక్, ఏపీడీ, కళ్యాణదుర్గం** పండ్ల తోటల సాగులో కళ్యాణదుర్గం నియోజకవర్గం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోనూ ముందంజలో ఉంది. ఇక్కడి రైతులకు పండ్ల మొక్కల సాగుపై అవగాహన కల్పించాం. దాంతో ఎక్కువ మంది మొగ్గు చూపారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలు అందించాం. రైతులకు బిల్లులు సక్రమంగా అందేవిధంగా చూస్తాం. రోజుల్లో మరింత మంది రైతులకు ప్రోత్సాహం కల్పిస్తాం.

# అక్రమ లేఅవుట్లు.. అదుపులేని ధరలు

పలమనేరు : 'ఆ పక్కా నాదే.. ఈ పక్కా నాదే.. తలపైనా ఆకాశంలోని ముక్కా నాదే.. హే బిడ్డా.. ఇది నా(అక్రమాల) అడ్డా' అన్న ధోరణిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూములన్నీ ఆక్రమించేశారు. గత ఐదేళ్లూ అడ్డదిడ్డంగా వ్యవహరించారు. పలమనేరు, గంగవరం మండలాలు రికార్డుల పరంగా వేర్వేరుగా ఉన్నా భౌగోళికంగా కలిసిపోయాయి. ఇక్కడ రియల్ భూమ్ అమాంతం పెరిగినా ప్రభుత్వానికి ఏమాత్రం ఆదాయం రావడం లేదు. అక్రమ లేఅవుట్లకు ఇటు పలమనేరు పురపాలిక నుంచి అటు గంగవరం పంచాయతీ నుంచి అనుమతులు ఉండవు. చెరువు మొరవ, చెరువుకట్ట ప్రాంతాల్లోనూ ఆవాస స్థలాలుగా మార్చి విక్రయాలు సాగిస్తున్నారు. తాజాగా పలమనేరు పరిధిలోని బొమ్మదొడ్డి వద్ద ఓ లేఅవుట్‌ను చెరువు మొరవలోనే వేశారు. గంగవరం మొత్తం పలమనేరులో కలవడంతో ఒకప్పుడు ఎకరా రూ.5 లక్షల వరకు ఉండగా ప్రస్తుతం రూ.4 కోట్ల వరకు పలుకుతోంది. ఇటీవల ఓ బడా వ్యాపారి బెంగళూరు నుంచి ఇక్కడికొచ్చి భూముల ధరలు విని విస్తుపోయారు. ఇదే ధరకు బెంగళూరు శివారులో కొనుగోలు చేయొచ్చంటూ వెళ్లిపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. వైకాపా హయాంలో రియల్టర్లు తమకిష్టమొచ్చినట్లు వ్యవహరించగా అధికారులు వారికే అంటకాగారు.

**36 లేఅవుట్లపై ఆంక్షలు విధించాం**


36 లేఅవుట్లకు నోటీసులిచ్చి బ్లాక్‌లిస్టులో పెట్టాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా వ్యవసాయ భూమి మార్పిడికి భూమి విలువలో 5 శాతం రుసుం చెల్లించాలి. నిబంధనలకు అనుగుణంగా వసతులు, 30 అడుగుల రోడ్డు ఉంటే అనుమతులిస్తాం. లేకపోతే బ్లాక్‌లిస్టులో ఉంచి పనులు ఆపేస్తాం. ఎన్వీరమణారెడ్డి, కమిషనర్, పలమనేరు

# భారం మోయలేం

పుత్తూరు : భూముల రిజిస్ట్రేషన్ దస్తావేజులకు ఆన్‌లైన్‌లో స్టాంపులు జారీ చేసేలా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ నూతన విధానం అమలులోకి తెచ్చింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వెండర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించి స్టాంపులు జారీ చేయటంతోపాటు ఆన్‌లైన్‌లో వెండర్లే స్వయంగా కొనుగోలుదారుల వివరాలు నమోదుచేసి విక్రయించాల్సి ఉంటుంది. **వివరాల కోసమే..** ఇప్పటివరకు స్టాంప్ వెండర్లు కొనుగోలుదారులు కోరిన స్టాంపుల మేరకు దరఖాస్తు రాసి చలానా చెల్లించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి స్టాంపులు పొందేవారు. అలా పొందిన వాటిని కొనుగోలుదారుల పేర్లతో రిజిస్టర్లలో నమోదుచేసి విక్రయించేవారు. అనంతరం వాటిని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వారానికోసారి తనిఖీ చేసేవారు. అయితే ఈ దరఖాస్తులను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భద్రపరచటం కష్టంగా మారుతోందని ఉన్నతాధికారులు భావించారు. దరఖాస్తుపోతే ఆ స్టాంప్ ఎవరు కొనుగోలు చేశారన్న వివరాలు లభించనందున ఆన్‌లైన్‌లో వెండర్లే స్టాంపులు జారీచేసే విధానాన్ని కొత్తగా ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మాన్యువల్‌గా వెండర్లు వీటిని జారీ చేస్తుండగా భవిష్యత్తులో ఆన్‌లైన్ చేయనున్నారు. **అదనపు భారం..** నూతన విధానం ప్రకారం స్టాంపులు విక్రయించాలంటే వెండర్ తప్పనిసరిగా కంప్యూటర్ ఏర్పాటు చేసుకోవాలి. ప్రస్తుతం లైసెన్సు ఉన్నవారిలో 70 శాతం మందికి లేవు. స్టాంపు కోసం ఎవరైనా వస్తే ముందుగా ఐజీఆర్ఎస్ సైట్‌లో లాగిన్ అవ్వాలి. ఆధార్ నంబరు నమోదు చేయగానే వాళ్ల ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేసి కావాల్సిన విలువగల స్టాంప్‌ను వెండరే ముద్రించి విక్రయించి రుసుం తీసుకోవాలి. ఒక్కోసారి సర్వర్ పనిచేయక గంటల తరబడి వేచిఉండాల్సి వస్తుంది. ఇది అటు కొనుగోలుదారులకు, ఇటు స్టాంప్ వెండర్‌కు ఇబ్బందికరమేనని.. మారిన నిబంధనతో గది అద్దెకు తీసుకుని కంప్యూటర్, ఇంటర్నెట్ ఏర్పాటు చేసుకోవడంతో అదనపు భారం పడుతుందని చెబుతున్నారు.

**నూతన విధానంతో పారదర్శకత..**పారదర్శకత కోసమే ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టారు. కొనుగోలుదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తమై ఉంటాయి. అందరూ నూతన విధానంలోకి మారాల్సిందే. శ్రీరామ్, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖాధికారి, తిరుపతి

# రెవెన్యూలో.. భూసమస్యల మేట



కదిరి : గ్రామీణుల్లో అత్యధికులు వ్యవసాయదారులే. పుడమితల్లిపై భరోసాతో జీవనం సాగిస్తారు. తమకున్న భూమిలో పంటసాగే కాకుండా తనఖా పెట్టి డబ్బు అవసరాలు తీర్చుకుంటారు. అలాంటి ఆధారమే తిరకాసుగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలంపై హక్కుదారులంటే.. రికార్డుల్లో పరాయి వ్యక్తులు ఉన్నారు. విస్తీర్ణంలో తేడాలతోనూ సమస్యగా మారింది. వీటన్నిటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. సదస్సుల్లో కుప్పలు, తెప్పలుగా రైతుల నుంచి ఫిర్యాదు అందాయి. ఇందులో పరిష్కారమైన వాటికంటే వాయిదా పడిన వినతులే అధికం. తర్వాతైనా పరిష్కరిస్తారంటే కొలతలు వేసి, రికార్డుల్లో వివరాలు సరిచేయడంలో కీలకపాత్ర పోషించే సర్వేయర్లు, వీఆర్వోల కొరత సమస్యగా ఉంది. రెవెన్యూ అధికారులు గ్రామాలకొచ్చి సదస్సులు పెట్టినా భూవిస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, రికార్డుల్లో తప్పుల సవరణ యజ్ఞంగా మారింది. రైతులు భూ ఆధార పత్రాలను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు తప్పని శిక్షణ భావిస్తున్నారు.

**సిబ్బంది కొరతతో పనిభారం**

రెవెన్యూశాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్ల కొరత వేధిస్తోంది. జిల్లావ్యాప్తంగా అమడగూరు, నల్లమాడ, ఓబుళదేవరచెరువు, తలుపుల, రామగిరి, పెనుకొండ మండలాలకు సర్వేయర్లు లేరు. 95 రెవెన్యూ గ్రామాలకు గ్రేడ్-1, గ్రేడు-2 వీఆర్వోల కొరత ఉంది. మొన్నటి దాకా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇందులో రైతులు ఇచ్చిన ఫిర్యాదుల్లో పరిష్కారమైనవి స్వల్పమే. ఇంకా పరిష్కరించాల్సినవే 2,739 ఉన్నాయి. అవి అలాగే ఉండగానే మళ్లీ రెండో దశ భూరీసర్వే సోమవారం నుంచి మొదలవనుంది. సిబ్బంది కొరతకు తోడు భూ రీసర్వే అదనపు భారంగా మారింది. రీసర్వే పనిలో రెవెన్యూ సిబ్బంది నిమగ్నమైతే సదస్సుల్లో చేసుకున్న విన్నపాలు మూలనపడతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తగిన చర్యలతో కాలయాపన లేకుండా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. 'కదిరి రెవెన్యూ డివిజన్‌లోని అమడగూరు మండలంలో సర్వేయరుతోపాటు వీఆర్వోల సమస్య వేధిస్తోంది. మండలంలో తొమ్మిది రెవెన్యూ గ్రామాలున్నాయి. ఐదుగురు వీఆర్వోలు మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో ఒక్కొక్కరు రెండు, మూడేసి గ్రామాల బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వీఆర్వోలను నియమించి సమస్యలు పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.'

**పరిష్కారానికి కృషి చేస్తాం: విజయసారథి, డీఆర్వో**

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రెవెన్యూ సదస్సుల్లోని ఫిర్యాదులతో పాటు సాధారణ భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. గతంలో వచ్చినవి పునరావృతం కాకూడదనే రీసర్వే మొదలవబోతోంది. కొరత ఉన్నచోటకు సిబ్బందిని ఏర్పాటు చేస్తాం.

# కొండలనూ కొల్లగొడుతున్నారు



గుత్తి : గుత్తిలో కొందరు నాయకులు కొండలనూ కొల్లగొడుతున్నారు. కొండలను పేల్చి వేస్తూ రాళ్లు, మట్టిని విక్రయిస్తున్నారు. ఆ తర్వాత ఏర్పడే రూ.కోట్లు విలువైన స్థలాలను కబ్జా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పురపాలికలో పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. పురపాలికలో భూదందా జోరుగా సాగుతోంది. నాయకులు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ స్థలాలు, కొండలను దర్జాగా ఆక్రమిస్తున్నారు. కొందరు వాటిని ఇతరులకు విక్రయిస్తూ రూ.లక్షలు కూడగట్టుకుంటుండగా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధుల అండదండలతో కొండలను అక్రమంగా ఘాతాలు పెట్టి పేల్చివేతకు పాల్పడ్డారు. పెద్దగుట్టను పూర్తిగా పేల్చివేశారు. పేల్చివేతలు, ఆక్రమణలపై కథనాన్ని ప్రచురించడంతో రెవెన్యూ అధికారులు బ్లాస్టింగ్ పనులు నిలిపివేయించారు.

**ఆక్రమణలు ఇలా..**

గుత్తికి సమీపంలోని సర్వేనెంబర్ 431లో ఓ ప్రజాప్రతినిధి ప్రభుత్వ గుట్టను పొక్లెయిన్ సాయంతో చదును చేశాడు. ఆయన ఇతరులకు ప్లాట్లువేసి విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. గుత్తికి చెందిన ఓ నాయకుడు ఎకరా స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లు వేశాడు. మరో నాయకుడు సుమారు 18 సెంట్ల స్థలాన్ని కబ్జాచేసి పునాదులు వేసుకున్నాడు. అలాగే ఇంకో నాయకుడు సుమారు 20 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి పునాదులు వేశాడు. కొత్తపేట పంచాయతీ పరిధిలో 200 ఎకరాల ప్రభుత్వ భూమి, కొండలు ఉన్నాయి. ప్రభుత్వం రెండేళ్ల కిందట జగనన్న లేఅవుట్‌ను ఏర్పాటు చేసి సుమారు 600 మందికి పట్టాలు మంజూరు చేసి ఇళ్లను నిర్మించేందుకు పూనుకొంది. ఇళ్ల నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి. కాలనీ ఏర్పడుతుండటంతో అక్కడ స్థలాలకు డిమాండు నెలకొంది. గుత్తి పట్టణ శివారులోని సర్వేనెంబర్ 727లో ఓ వైకాపా నాయకుడు నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైకాపా ప్రజాప్రతినిధుల అండతో కొండను కూల్చి చేశాడు. రూ.కోట్లు విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు పూనుకోగా అప్పట్లో 'ఈనాడు' కథనం ప్రచురించడంతో రెవెన్యూ అధికారులు పేలుళ్లను అడ్డుకున్నారు. ప్రస్తుతం కొండ కొంత భాగం మిగిలి ఉంది. అక్కడ పట్టణ ఆరోగ్య కేంద్రం ఉంది. దీంతో అక్కడ స్థలాలకు మంచి గిరాకీ ఏర్పడింది. సర్వేనంబర్ 728లో ప్రస్తుతం ఓ నాయకుడు తన సామాజికవర్గం వారికి నివేశన స్థలాల కోసం గుట్టలను కూల్చి వేయిస్తున్నాడు. పొక్లెయిన్‌తో రాళ్లను తొలగించి చదును చేస్తున్నాడు.

**నోటీసులతో సరిపెడుతున్నారు..**

ప్రభుత్వ కొండలు, గుట్టలు, స్థలాలను ఆక్రమిస్తున్న నాయకులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. కొత్తపేట పరిధిలో ఆక్రమణలకు పాల్పడిన 80 మందికి నోటీసులు ఇచ్చారు. తరువాత ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారు. సర్వేనంబరు 728లో కొందరు నకిలీ పట్టాలతో పునాదులు వేసుకోగా అధికారులు కొన్నింటిని కూల్చారు. మిగిలినవాటి జోలికి వెళ్లలేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఓ నాయకుడు ఇక్కడికి వచ్చి ఆక్రమణదారులకు మద్దతు ఇచ్చాడు. ఈ కారణంగా అధికారులు వెనుకడుగువేశారు.

**మాదృష్టికి రాలేదు**

కొండలు, గుట్టల పేల్చివేత విషయం మా దృష్టికి రాలేదు. గుట్టుగా చేస్తుండవచ్చు. పైగా తాము సెలవుల్లో ఉన్నప్పుడు పేలుళ్లకు పాల్పడుతున్నారేమో. ప్రభుత్వ స్థలాలు, గుట్టల చదునుపై విచారిస్తాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఓబిలేసు, తహసీల్దారు, గుత్తి

# అంతరించిపోతున్న పచ్చదనం



మడకశిర : పచ్చని చెట్లను కాపాడుతూ పర్యావరణాన్ని రక్షించాలని ప్రభుత్వం చెబుతున్నా పలువురు సొంత లాభార్జన కోసం పచ్చని చెట్లను నరికి కలపను అక్రమంగా తరలించి జేబులు నింపుకొంటున్నారు. రొళ్ల, అగళి మండలాలు దాదాపు కర్ణాటక ప్రాంతంలో కలిసిపోయినట్లుగా ఉంటాయి. దీన్ని అదునుగా భావించిన పలువురు వ్యాపారులు పచ్చని చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలాల్లోని పెద్ద పెద్ద చెట్లను రైతులతో తక్కువ నగదుకు కొనుగోళు చేసి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. కర్ణాటక సరిహద్దున పావగడ, మడిగేశి, హొసకెర, రెంటవళలు, బడవనహళ్లి, శిరా, పట్టనాయకనహళ్లి తదితర పట్టణాలకు పెద్ద పెద్ద వాహనాల్లో కలపను తరలిస్తున్నారు. నాలుగు రోజులుగా శివబాలయోగినగర్ ప్రాంతంలో రెంటవళ రోడ్డు పక్కన నీలిగిరి, మామిడి, తుమ్మ దుంగలను ట్రాక్టర్‌లో డంప్ చేసి లారీకి నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**నామమాత్రపు చర్యలతో సరి..**

ఐదేళ్ల కిందట వృక్షాలు లేక వర్షాలు కురవకపోవడంతో అనావృష్టి ఏర్పడి ప్రజలు చాలా ఇబ్బందులుపడ్డారు. ప్రస్తుతం రెండు మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. ఈవిధంగా చెట్లను తొలగిస్తే ఇబ్బందులు తప్పవని ప్రజలు వాపోతున్నారు. వృక్ష సంపదను కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు, పోలీసులు నామమాత్రపు చర్యలు చేపడుతున్నారు. కిందిస్థాయి అటవీశాఖ అధికారులు వ్యాపారులతో లాలూచిపడి మామూళ్లు ఇప్పించుకుంటున్నారంటూ రెండ్రోజుల కిందట మడకశిర మండలానికి చెందిన పలువురు వ్యాపారులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి వృక్ష సంపదను కాపాడాలని కోరుతున్నారు.


**చెట్లను నరికితే కేసులు నమోదు చేస్తాం**

కుళ్లాయప్ప, ఇన్‌ఛార్జి ఫారెస్ట్ అధికారి

అనుమతులు లేకుండా వ్యాపారులు అక్రమంగా చెట్లను నరికి దుంగలను ఇతర ప్రాంతాలకు తరలిస్తే చర్యలు తీసుకుంటాం. రైతుల పొలాల నుంచి చింత, మామిడి, వేప, టేకు, తుమ్మ, కానుగ తదితర చెట్లను నరికితే మా దృష్టికి తీసుకువస్తే కేసులు నమోదు చేస్తాం.

# ఉద్యమ్.. స్ఫూర్తి కావాలి

చిత్తూరు : పారిశ్రామిక రంగ వృద్ధిపై ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది. ఇంటికో పారిశ్రామికవేత్త నినాదంతో ప్రణాళికల్ని అమలు చేస్తోంది. దీనికోసం ఇప్పటికే ఏర్పాటైన ఎంఎస్ఎంఈలను గుర్తించి క్షేత్రస్థాయిలో వాటి సమస్యల్ని తెలుసుకోవడానికి రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ ఫెర్మార్మెన్స్ (ర్యాంపు) సర్వే ప్రారంభించింది. అయితే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) ర్యాంపు సర్వే నత్తనడకన సా..గుతోంది. ఇప్పటివరకూ సుమారు 11 వేల యూనిట్లనే సర్వే చేసినట్లు తెలుస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి క్షేత్రస్థాయిలో సర్వే పనులు అప్పగించారు. మండల, పుర/నగరపాలక అధికారుల పర్యవేక్షణ లేమితో సర్వే పనులు ఆశాజనకంగా జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సర్వే పూర్తిచేయడానికి కొన్ని రోజులే గడువున్న నేపథ్యలో



సంక్రాంతి సెలవుల తర్వాతనైనా పనుల్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

**విద్యుత్తు సర్వీసుల ఆధారంగా..**

పరిశ్రమల రంగంపై ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం అంతాఇంతా కాదు. ప్రతికూల పరిస్థితుల్లో అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి. ఎంఎస్ఎంఈలపై ప్రభుత్వం దగ్గర ఎలాంటి సమాచారం లేదు. దీంతో విద్యుత్తు సర్వీసుల ఆధారంగా పరిశ్రమల్ని అధికారులు గుర్తించారు. ఆయా పరిశ్రమల ప్రస్తుత స్థితిని లెక్కించేందుకు గతేడాది నవంబర్ 29న జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలకు సర్వే బాధ్యతల్ని అప్పగించారు. నిర్దేశిత వివరాలు పొందుపరచగానే సదరు పరిశ్రమకు ఉద్యమ్ గుర్తింపు సంఖ్యతో ప్రత్యేక రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం జారీ అవుతుంది. ఉద్యమ్ పత్రాలు తక్కువగానే జారీచేసినట్లు తెలుస్తోంది. సచివాలయ సిబ్బందికి ఇతర సర్వే పనులు ఉండటంతో సర్వే ఆలస్యమవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

**సర్వే ఆధారంగా చర్యలు..**

ర్యాంపు సర్వే పూర్తయితే.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎంఎస్ఎంఈ, ఇతరత్రా ప్రోత్సాహకాలు, రాయితీలు వర్తిస్తాయి. రాష్ట్ర పరిశ్రమల విధానం నుంచి వచ్చే సౌకర్యాలు రాయితీలు పొందవచ్చు. ఎంఎస్ఎంఈ పోర్టల్‌లో పరిశ్రమల సమాచారం పొందుపరిస్తే కేంద్ర ప్రభుత్వ రాయితీ పథకాలను ఎక్కువగా అందిస్తుంది.

**నిత్య సమీక్షలు..**ర్యాంపు సర్వేపై పరిశ్రమల శాఖ అధికారులు నిత్యం సమీక్షలు జరుపుతున్నారు. మండల, పుర/నగరపాలక పర్యవేక్షణ అధికారుల నుంచి ఎప్పటికప్పుడు వివరాలు తెప్పించుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.

# తగ్గుతున్న సాగు

అనకాపల్లి : జిల్లాలో కొంతకాలంగా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. సాగు ఖర్చులు పెరగడం.. దిగుబడులు తగ్గడం.. గిట్టుబాటు ధరలు లేకపోవడమే దీనికి కారణమని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. జిల్లాలో సాధారణ విస్తీర్ణం 85,857 హెక్టార్లు. ప్రస్తుతం 63,286 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వరి పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉన్నా ఇతర పంటలు బాగా తగ్గిపోతున్నాయి. గతంలో ఎటుచూసినా చెరకు తోటలు కనువిందు చేసేవి. 49 వేల హెక్టార్లలో చెరకు సాగు చేసేవారు. ఇప్పుడు 5,894 హెక్టార్లకు పడిపోయింది. ఎకరా సాగుకు రూ.60 వేలు ఖర్చవుతోంది. గతంలో హెక్టారుకు 75 నుంచి 80 టన్నుల దిగుబడి వచ్చేది. ఇప్పుడు 50 టన్నులకు మించడం లేదు. ఆదాయం అంత రావడం లేదని రైతులు మహేష్, సూరిబాబు తెలిపారు.

జొన్న, గంటి, చోడి, జొన్న, సామ, కొర్ర, కందులు, మినుము, పెసర, బొబ్బర, ఉలవలు వంటి పంటల సాగు ఏటేటా తగ్గుతోంది. స్థిరాస్తి ప్రభావం వ్యవసాయ రంగంపై పడింది. పరవాడ, అనకాపల్లి, మునగపాక, సబ్బవరం, అచ్యుతాపురం మండలాల్లో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఆయా ప్రాంతాల్లో అనేకమంది వ్యాపారులు వ్యవసాయ భూములు కొనుగోలు చేసి ప్లాట్లుగా అమ్మకాలు చేస్తున్నారు.

**ఇలా చేస్తే మేలు**

కూలీల సమస్య ఎక్కువగా ఉంది. దీని నివారణకు యంత్రాలు ఉపయోగించాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైతులు నిత్యం ఉపయోగించే కత్తి, కొడవలి, గునపం, పార వంటి పరికరాలు రాయితీపై ఇవ్వాలి. నాణ్యమైన విత్తనం అందించాలి. చెరకు విత్తనాన్ని రాయితీపై ఇవ్వాలి. బెల్లానికి కనీస మద్దతు ధర ప్రకటించాలి.

# గెడ్డను కప్పి.. కబ్జాకు యత్నం



అనకాపల్లి : పీఎంపాలెం ప్రాంతాల్లో రోజురోజుకీ భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. కబ్జాల ముసుగులో ప్రభుత్వ గెడ్డ స్థలాలను సైతం కప్పి తమ వశం చేసుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఆరో వార్డు గాయత్రీనగర్ దరి ఎఫ్‌సీఐ లేఅవుట్లో బక్కన్నపాలెం సర్వే సంఖ్య 28లో సుమారు రూ.కోటిన్నర విలువ చేసే 200 గజాల ప్రభుత్వ గెడ్డ స్థలంపై ఇటీవల కొందరు కబ్జాదారుల కన్ను పడింది. అధికారులు, ప్రజలు సంక్రాంతి పండగ హడావుడిలో ఉండగా అదును చూసి మట్టితో గెడ్డను కప్పి ఆక్రమణకు తెరతీశారు. ఆయా భూమిలో రేకుల షెడ్లు నిర్మించేందుకు నిర్మాణ సామగ్రిని తరలించి పనులు ప్రారంభించారు. దీనిపై స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఎవరూ స్పందించలేదు. సంబంధిత గెడ్డను ఇప్పటికే కొందరు ఆక్రమించుకుని రాజకీయ నాయకుల ముసుగులో నివాసాలు సైతం నిర్మించారు. కోట్లాది రూపాయలు విలువైన గెడ్డ స్థలం ఆక్రమణలకు గురవ్వకుండా కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చురకలు






# తెలుగు సినీ సెట్స్ లో శ్వేతా బసుకు అవమానం

కొత్త బంగారు లోకం మూవీతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్వేతాబసు ప్రసాద్ మొదటి సినిమాతోనే యూత్ కు బాగా దగ్గరైంది. ఫస్ట్ మూవీతోనే మంచి ఫేమ్ వచ్చినప్పటికీ ఆ తర్వాత అమ్మడికి పెద్దగా ఛాన్సులు రాలేదు. వచ్చిన కొన్ని అవకాశాలను కూడా తప్పటడుగులేసి ఫ్లాపులను కొని తెచ్చుకుంది. కొన్నేళ్ల నుంచి తెలుగు చిత్ర పరిశ్రమకు దూరమైన శ్వేత బసు ప్రసాద్ ప్రస్తుతం హిందీ టెలివిజన్ ఇండస్ట్రీలో రాణిస్తుంది. తాను నటించిన ఊప్స్ అబ్ క్యా అనే వెబ్ సిరీస్ ఫిబ్రవరి 20న రిలీజ్ కానుంది. ఆ చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా శ్వేత టాలీవుడ్ లో పడిన ఇబ్బందుల గురించి వెల్లడించింది. శ్వేతా బసు ప్రసాద్ ఒక తెలుగు సినిమా సెట్ లో వేధింపులకు గురైనట్టు ఆమె గుర్తు చేసుకుంది. కొన్నేళ్లుగా సినిమాలు చేస్తూ వస్తున్న శ్వేతా బసు ప్రసాద్ ఓ తెలుగు సినిమా సెట్స్ లో చాలా ఇబ్బందులకు గురైనట్టు తెలిపింది. తన హైట్ 5.2 అడుగులని, ఆ హీరో ఆరు అడుగులుంటాడని దీంతో హీరోతో



పోలుస్తూ తనని ఎత్తు తక్కువగా ఉన్నందుకు సెట్ లో ప్రతి ఒక్కరూ ఎగతాళి చేసేవారని, ఆయన అంత ఎత్తు ఉంటే ఈవిడ మాత్రం 5 అడుగులే ఉందని కామెంట్స్ చేసేవారని వెల్లడించింది. తన హైట్ మీద ఆ హీరో కూడా కామెంట్ చేసేవాడని, ప్రతి రోజూ తన ఎత్తును గుర్తు చేస్తూ కామెంట్ చేసేవాడని, షూటింగ్ టైమ్ లో కూడా తాను చేసిన ప్రతీ సీన్‌ను మారుస్తూ ఉండేవాడని, కావాలని రీటేక్స్ చేయించేవాడని, తెలుగు వాడే అయినప్పటికీ ఆయనకు తెలుగు సరిగా రాదని, సెట్స్ లో ఎవరికీ ఆయని భాష అర్థం కాదని తెలిపింది. తాను తెలుగమ్మాయి కాకపోయినా ఎలాగొలా తెలుగు నేర్చుకుని డైలాగ్స్ చెప్పేదాన్నని, ఆ హీరో తెలుగు వాడే అయినప్పటికీ డైలాగ్స్ సరిగా చెప్పేవాడు కాదని, అయినా అతని గురించి ఎవరూ పట్టించుకునే వారు కాదని, తన విషయంలో మాత్రం కంట్రోల్ లో లేని హైట్ గురించి కామెంట్ చేసేవాళ్లని, తాను ఇప్పటివరకు ఇబ్బంది పడిన సినిమా ఏదైనా ఉందా అంటే అది ఆ సినిమానేనని శ్వేతా తెలిపింది. అయితే ఇదంతా ఏ సినిమా టైమ్ లో అనేది మాత్రం శ్వేత చెప్పలేదు. ఇదిలా ఉంటే కొత్త బంగారు లోకం తర్వాత రైడ్, కాస్కో, కలవర్ కింగ్, ప్రియుడు, జీనియస్ సినిమాల్లో శ్వేత నటించింది.

# అఖండ2 కోసం బాలయ్య అంత తీసుకుంటున్నాడా?

గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణ ప్రస్తుతం వరుస హిట్లతో మంచి జోష్ మీదున్నాడు. అఖండ, వీర సింహారెడ్డి, భగవంత్ కేసరి సినిమాలతో హ్యాట్రిక్ విజయాలందుకున్న బాలయ్య రీసెంట్ గా బాబీ దర్శకత్వంలో వచ్చిన డాకు మహారాజ్ సినిమాతో మరో హిట్ అందుకున్నాడు. వరుస హిట్స్ లో ఉన్న బాలయ్య ను చూసి ఫ్యాన్స్ ఎంతో సంతోషపడుతున్నారు. ఇదిలా ఉంటే బాలయ్య ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో అఖండ2 తాండవం చేస్తున్న విషయం తెలిసిందే. బ్లాక్ బస్టర్ అఖండ సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై అందరికీ మంచి అంచనాలున్నాయి. అసలే బాలయ్య-బోయపాటి అంటే సూపర్‌హిట్ కాంబినేషన్. వీరిద్దరి కలియికలో ఇప్పటికే పలు సినిమాలొచ్చాయి. సింహా, లెజెండ్, అఖండ సినిమాలతో హ్యాట్రిక్ అందుకున్న బాలయ్య- బోయపాటి ఇప్పుడు అఖండ2 కోసం



మరోసారి కలిసి పని చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. అఖండ2 స్క్రిప్ట్ ను బోయపాటి నెక్ట్స్ లెవెల్ లో రాసుకున్నాడని, సినిమాలో గూస్‌బంప్స్ ఎలిమెంట్స్ చాలానే ఉన్నాయని యూనిట్ సభ్యులంటున్నారు. ఇక అసలు విషయానకొస్తే, బాలయ్య అఖండ2 కు తన రెమ్యూనరేషన్ ను ఒక్కసారిగా పెంచినట్టు తెలుస్తోంది. మొన్నటివరకు రూ. 28 కోట్లు ఛార్జ్ చేసిన బాలయ్య ఏకంగా ఏడు కోట్లు పెంచి రూ. 35 కోట్లు తీసుకుంటున్నాడని తెలుస్తోంది. బాలయ్య మార్కెట్, హిట్ ట్రాక్ చూసి నిర్మాతలు కూడా బాలయ్య అడిగినంత ఇవ్వడానికి ఒప్పుకున్నట్టు సమాచారం. అయితే రీసెంట్ గా మ్యూజిక్ డైరెక్టర్ తమన్ కు బాలకృష్ణ ఓ లగ్జరీ కారు బహుమతిగా ఇచ్చిన విషయం తెలిసిందే. గత నాలుగు సినిమాలుగా తమన్- బాలయ్య కలిసి సినిమాలు చేస్తున్నారు. తమన్ పనితనం నచ్చడంతో బాలయ్య దానికి కృతజ్ఞతగా ఈ కారును గిఫ్ట్ ఇచ్చాడు. అయితే తమన్ కు బాలయ్య ఆ కారు కొనింది కూడా అఖండ2 రెమ్యూనరేషన్ లో నుంచే అని వార్తలు వినిపిస్తున్నాయి. మరి ఇందులో నిజమెంతన్నది తెలియాల్సి ఉంది.

# మేడే నుంచి ఇండిపెండెన్స్ డేకి మారుతున్నారా?




సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో కూలీ భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో సినిమాపై భారీ బజ్ నెలకొంది . సూపర్ స్టార్ రోల్ ఎలా ఉండబోతుంది? అతడి మార్క్ ఎలివేషన్ లోకేష్ ఎలా ప్లాన్ చేసాడం టూ? నెట్టింట పెద్ద చర్చ జరుగుతోంది. ఎల్ సీ యూతో సంబంధం లేకుండా లోకేష్ తెరెక్కిస్తోన్న కొత్త చిత్రమిది. దీంతో సూపర్ స్టార్ సైతం ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే ముగింపు దశకు చేరుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ సహా అన్ని పనులు పూర్తి చేసి కార్మికుల దినోత్సవం సందర్భంగా మే 1న చిత్రాన్ని రిలీజ్ చేయాలని ప్లాన్ చేసారు. అయితే ఇప్పుడా సినిమా మే నుంచి ఆగస్టు వాయిదా పడుతున్నట్లు సమాచారం. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారుట. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. రిలీజ్ తేదీకి..ఈ సినిమా కాన్సెప్ట్ కి కొంత దగ్గర సంబంధం ఉందని వినిపిస్తుంది. ఇందులో రజనీకాంత్ గోల్డ్ స్మగ్లర్ పాత్ర పోషిస్తున్నారు. అసలు స్మగ్లర్ గా మారడానికి కారణాలు ఏంటి? సినిమాలో రజనీకాంత్ గతం ఏంటి? అన్నది చాలా బలంగా.. ..ఇంపాక్ట్ గా లోకేష్ చెప్పబోతున్నాడుట. ఆ పాయింట్ నిజాయితీగా కష్టపడే వారికి కనెక్ట్ అయ్యేలా ఉంటుందిట. ఈ నేపథ్యంలోనే తొలుత కార్మికుల దినోత్సవం సందర్భంగా మేలో రిలీజ్ అనుకున్నారని అప్పట్లోనే వార్తలొచ్చాయి. కానీ అప్పటికి షూట్ సహా పోస్ట్ ప్రొడక్షన్ పూర్తవ్వడం సాధ్యం కాదని దీంతో ఆగస్టు 15 కి వాయిదా వేస్తున్నారని కోలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. మరి ఇందులో నిజమెంతో తెలియాల్సి ఉంది.

# సమంతకు ఐకానిక్ గోల్డ్ అవార్డు..



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత తన నటనతోనే కాకుండా యాక్షన్ పెర్ఫార్మెన్స్ తో కూడా అదరగొడుతుంది. సమంత గతేడాది రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో సిటాడెల్ హనీ బన్నీ అనే వెబ్‌సిరీస్ చేసిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌కు ఆడియన్స్ నుంచి మంచి ఆదరణ దక్కింది. ఈ సీరిస్ లో సమంత తన నటనతో టాలీవుడ్ ఆడియన్స్‌నే కాకుండా బాలీవుడ్ ప్రేక్షకుల్ని కూడా మాయ చేసింది. ఈ సిరీస్ కోసం సమంత మొదటిసారి బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ తో కలిసి నటించింది. ఇదిలా ఉంటే ఈ సిరీస్‌కు గానూ తాజాగా సమంతకు ఐకానిక్ గోల్డ్ అవార్డు లభించింది. అంతేకాదు ఈ సిరీస్ కు బెస్ట్ వెబ్ సిరీస్ గా కూడా అవార్డు వచ్చింది. ఈ విషయాన్ని డైరెక్టర్ డీకే తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా షేర్ చేసుకున్నాడు. ఈ వెబ్ సిరీస్ ను ఆడియన్స్ ముందుకు తీసుకురావడానికి ఎంతో మంది కృషి చేశారని, అవార్డుల రూపంలో అందరూ చూపిస్తున్న ప్రేమకు ఎప్పటికీ ఋణపడి ఉంటానని డీకే తెలిపాడు. డీకే పోస్ట్ తో ఈ విషయం వైరల్ అవడంతో సమంతకు ఐకానిక్ గోల్డ్ అవార్డు రావడంపై అందరూ ఆమెకు విషెస్ తెలుపుతున్నారు. ఇక సిరీస్ లో సమంత తన నటనతో అందరినీ కట్టిపడేసింది. సిటాడెల్ కోసం సమంత ఎంత కష్టపడిందో అందరికీ తెలుసు. సమంత పడిన కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించిందని అటు టాలీవుడ్, బాలీవుడ్ సెలబ్రిటీలు సైతం కామెంట్స్ చేస్తున్నారు.

వ్యక్తిగతంగా సమంత పలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ కెరీర్ పరంగా మాత్రం సామ్ సక్సెస్‌ఫుల్ గా దూసుకెళ్తుంది. టాలీవుడ్ లో సమంత నుంచి తెలుగులో ఆఖరిగా వచ్చిన సినిమా ఖుషి. విజయ్ దేవరకొండతో చేసిన ఆ సినిమా యావరేజ్ అనిపించుకుంది. అప్పట్నుంచి సమంత తెలుగులో మరో సినిమాను ఒప్పుకుంది లేదు. గతేడాది సొంత బ్యానర్ లో మా ఇంటి బంగారం అనే సినిమాను అనౌన్స్ చేసింది కానీ అప్పట్నుంచి దాని గురించి మళ్లీ ఎలాంటి అప్డేట్ లేదు. ప్రస్తుతం సమంత రక్త్ బ్రహ్మాండ్ అనే హిందీ ప్రాజెక్టులో నటిస్తోంది.

# యాక్సిడెంట్ తర్వాత వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేస్తున్నా


2018లో నన్ను దోచుకుందువటే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నభా నటేష్ మొదటి సినిమాతోనే నటిగా మంచి మార్కులు కొట్టేసింది. ఆ తర్వాత పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ కు జోడీగా ఇస్మార్ట్ శంకర్ లో నటించి మంచి బ్రేక్ అందుకున్న నభా కెరీర్ కు ఇక తిరుగులేదనుకున్నారు. కానీ ఇస్మార్ట్ శంకర్ తర్వాత నభా నటించిన డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో, డార్లింగ్ సినిమాలన్నీ ఒకదాన్ని మించి మరోటి ఫ్లాపులుగా నిలిచాయి. అయితే మధ్యలో అమ్మడు ఓ ఏడాది పాటూ ఏ సినిమాలోనూ కనిపించలేదు. దానికి కారణం ఆమె యాక్సిడెంట్ కు గురై తీవ్ర గాయాలపాలైంది. ఆ టైమ్ లో నభాకు కొన్ని సర్జరీలు కూడా జరిగాయి. ఆ యాక్సిడెంట్ వల్ల శారీరకంగా, మానసికంగా



ఎంతో బాధను అనుభవించానని నభా ఇప్పటికే పలుమార్లు చెప్పింది. తనకు మూడేళ్ల కింద జరిగిన ప్రమాదంలో భుజం గాయపడి కొన్ని సర్జరీలు చేశారని, ఆ టైమ్‌లో తన ఫిట్‌నెస్ ను తిరిగి పొందడానికి తానెంతో శ్రమించినట్టు నభా రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. నభా ప్రస్తుతం నటిస్తున్న రెండు యాక్షన్ సినిమాలు ఈ ఇయర్ లోనే రిలీజ్ కానున్నాయి. ఆ సినిమాల కోసం నభా తాను స్ట్రెంగ్త్ ను బిల్డ్ చేసుకుంటున్నట్టు తెలిపింది. యాక్సిడెంట్ లో అయిన గాయాల వల్ల వర్కవుట్స్ చేయడాన్ని తానెంతో ఎంజాయ్ చేస్తున్నానని, దాని వల్ల శరీరంపై అవగాహన పెరిగిందని.. మొబిలిటీ ఎక్సర్సైజ్‌లు, స్విమ్మింగ్, డ్యాన్సింగ్ చేయడాన్ని ఇష్టపడుతున్నానని, అంతకు ముందు నటిగా ఉన్నప్పుడు తప్పదు కాబట్టి వర్కవుట్స్ చేయాలి కాబట్టి చేసేదాన్నని, కానీ ఇప్పుడు వర్కవుట్స్ విషయంలో తన ఆలోచనా విధానం పూర్తిగా మారిందని వెల్లడించింది నభా. డైట్ లో భాగంగా తాను ఇంట్లో వండిన ఆహారాన్నే తీసుకుంటానని, ఎగ్స్, చికెన్ లేదా చేపలతో వెజిటెబుల్స్, రైస్ లేదా రోటీ తీసుకుంటానని, జంక్ ఫుడ్ ను పూర్తిగా కంట్రోల్ చేశానని చెప్తుంది నభా. ఇక సినిమాల విషయనికొస్తే నిఖిల్ తో కలిసి స్వయంభు అనే పాన్ ఇండియా సినిమాతో పాటూ నాగబంధం అనే సినిమాను కూడా చేస్తోంది నభా.

# భాగ్య శ్రీ అప్పుడే పెంచేసిందా..?

టాలీవుడ్ లో ప్రస్తుతం లక్కీయెస్ట్ బ్యూటీ అంటే అది మిస్టర్ బచ్చన్ భామ భాగ్య శ్రీ అనే చెప్పాలి. ఎవరికైనా తొలి సినిమా ఫ్లాప్ అయితే ఛాన్స్ లు రావు. కానీ భాగ్య శ్రీకి మాత్రం సీన్ రివర్స్ లో జరుగుతుంది. అమ్మడు ఇప్పుడు వరుస క్రేజీ సినిమాలతో అదరగొడుతుంది. భాగ్య శ్రీ బోర్స్ లిస్ట్ లో విజయ్ దేవరకొండ కింగ్ డమ్ , రామ్ సినిమాతో పాటుగా దుల్కర్ సల్మాన్ తో చేస్తున్న కాంత ఉంది. ఇవి చాలవు అన్నట్టుగా ఇప్పుడు సూర్యతో వెంకీ అట్లూరి చేస్తున్న సినిమాలో కూడా భాగ్యాన్నే ఎంపిక చేశారని టాక్. ఏ ముహూర్తాన తెలుగు ఆఫర్ ఓకే చేసిందో కానీ భాగ్య శ్రీ లక్ ఒక రేంజ్ లో ఉందని చెప్పొచ్చు. మిస్టర్ బచ్చన్ ఫ్లాప్ అయినా కూడా భాగ్య శ్రీ గ్లామర్ షో ఆమె క్యూట్ నెస్ ఆడియన్స్ కి నచ్చేసింది.



అందుకే ప్రేక్షకుల్లో ఆమె క్రేజ్ గుర్తించి అవకాశాలు ఇస్తున్నారు. విజయ్ దేవరకొండతో సినిమా అంటే హీరోయిన్ విషయంలో ఫ్యాన్స్ కి పండగే. కింగ్ డం లో భాగ్య శ్రీ ఎలా ఉండబోతుందో చూడాలి. రామ్ తో చేస్తున్న సినిమా కంప్లీట్ లవ్ స్టోరీ అని తెలుస్తుంది. రామ్ తో భాగ్య శ్రీ ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ అదిరిపోయేలా ఉంది. ఇక ఈ వరుస ఆఫర్లు అమ్మడి తన డిమాండ్ ని గుర్తించేలా చేయగా మొదటి రెండు సినిమాలకు రెమ్యునరేషన్ గురించి పెద్దగా ఆలోచించని భాగ్య శ్రీ ఇప్పుడు రెమ్యునరేషన్ పెంచేసిందని తెలుస్తుంది. ఆల్రెడీ కమిటైన సినిమాలకు కోటికి అటు ఇటుగా తీసుకుంటున్నట్టు తెలుస్తుండగా సూర్య వెంకీ అట్లూరి కాంబో సినిమాకు భాగ్య శ్రీ డబుల్ రెమ్యునరేషన్ అడుగుతుందని టాక్. ఐతే అమ్మడి ఫాలోయింగ్ చూసి ఆమె అడిగినంత ఇచ్చేస్తున్నారట నిర్మాతలు. సో చూస్తుంటే టాలీవుడ్ నెక్ట్స్ క్రేజీ హీరోయిన్ గా భాగ్య శ్రీకి టాప్ ప్రియారిటీ ఇచ్చేలా ఉన్నారు. భాగ్య శ్రీ బోర్స్ కూడా తెలుగులో తనకు వచ్చిన ఈ పాపులారిటీ ని పర్ఫెక్ట్ గా వాడుకోవాలని చూస్తుంది. ఇక చేస్తున్న సినిమాల్లో ఏ ఒక్కటి బ్లాక్ బస్టర్ హిట్ పడ్డా భాగ్య శ్రీని ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పొచ్చు. విజయ్ కింగ్ డం తో పాటు కాంత, సూర్యతో చేస్తున్న సినిమా కూడా పాన్ ఇండియా రిలీజ్ అవుతున్నాయి. సో భాగ్య శ్రీ బోర్స్ లక్ ఎలా ఉందో రాబోతున్న సినిమాల ఫలితాలు నిర్ణయిస్తాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536